అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 26-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 325

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

బిజినెస్

పేటియంలో బఫెట్ వాటా విక్రయం

- రూ.1,371 కోట్లకు 2.46శాతం వాటా
- షేర్ 3 శాతం పతనం



న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ వేదిక పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో ప్రముఖ బిలియనీర్ వారెన్ బఫెట్ తన వాటాలను పూర్తిగా విక్రయించారు. బఫెట్‌కు చెందిన బర్క్‌షైర్ హాత్‌వే కంపెనీ తన 2.46 శాతం వాటాను రూ.1,371 కోట్లకు అమ్మేశారు. ఓపెన్ మార్కెట్‌లో ప్రతీ షేర్‌పై 31 శాతం నష్టంతో విక్రయించారు. 1.56 కోట్ల షేర్లను రూ.620 కోట్లకు వదిలేసుకున్నారు. దీంతో శుక్రవారం బిఎస్ఇలో వన్ 97 కమ్యూనికేషన్ షేర్ 3.08 శాతం పతనమై రూ.895 వద్ద ముగిసింది. పేటియంలో ఇంతక్రితం బఫెట్ కంపెనీ ఒక్కో షేర్‌ను రూ.1,279.7తో 2.6 శాతం వాటాను రూ.2,179 కోట్లతో కొనుగోలు చేసింది. ఎన్ఎస్ఇ డేటా ప్రకారం.. శుక్రవారం సెషన్‌లో సగటున ఒక్కో షేర్‌ను రూ.877.29కు విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పేటియం రూ.291.7 కోట్ల నష్టాలను చవి చూసింది. గతేడాది ఇదే త్రైమాసికంలోనూ రూ.571.5 కోట్ల నష్టాలను ప్రకటించింది. క్రితం క్యూ2లో కంపెనీ రెవెన్యూ 32 శాతం పెరిగి రూ.2,518.6 కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,914 కోట్లుగా ఉంది.

డిఎల్ఎఫ్‌లో ఈడి సోదాలు

- డొల్ల కంపెనీలకు రూ.440 కోట్లు తరలింపు..!



న్యూఢిల్లీ : ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ డిఎల్ఎఫ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) సోదాలు చేపట్టింది. సూపర్‌టెక్ గ్రూప్ రియాల్టీ సంస్థ మనీ లాండరింగ్ కేసులో భాగంగా గురుగావ్‌లోని డిఎల్ఎఫ్ కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా.. సూపర్ టెక్ వ్యవహారంలోనే కంపెనీకి సంబంధించిన లావాదేవీలను అధికారులు తనిఖీ చేశారని రిపోర్టులు వస్తున్నాయి. సూపర్ టెక్ ప్రమోటర్ అయిన ఆర్‌కె అరోరా 670 మంది గృహ కొనుగోలుదారులను రూ.164 కోట్లు మేర మోసగించారని ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయనపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 26 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మదుపరులు, గృహ కొనుగోలుదారుల నుంచి సేకరించిన కోట్లాది రూపాయల నగదును వివిధ డొల్ల కంపెనీలకు తరలించారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరోరాను గడిచిన జూన్‌లో ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇది కేసు నమోదు చేసింది. మొత్తం రూ.440 కోట్ల మేర నిధులను నిబంధనలకు విరుద్ధంగా డొల్ల కంపెనీలకు తరలించారని అంచనా. గడిచిన 30 ఏళ్లలో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో సూపర్‌టెక్ కంపెనీ దాదాపు 80వేల ఇళ్లను నిర్మించింది. ప్రస్తుతం మరో 20 వేల గృహాలకు సంబంధించిన 25 ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. రెండేళ్ల నుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. నోయిడాలో నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి చేసిన ట్విన్ టవర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశాలతో కూల్చివేయడంతో కంపెనీకి రూ.500 కోట్లు మేర నష్టం రావడంతో పాటు ఇతర సమస్యలను ఎదుర్కొంటుంది. మరోవైపు యూనియన్ బ్యాంక్‌కు రూ.432 కోట్లు ఎగవేసిన కేసులో ఎన్‌సిఎల్‌టిలో దివాలా ప్రక్రియను ఎదుర్కొంటుంది.

ఒక్క రోజులో 4.63 లక్షల మంది విమానయానం



న్యూఢిల్లీ : భారత పౌర విమానయాన రంగం నూతన రికార్డ్‌ను సృష్టించింది. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా గురువారం ఒక్క రోజునే 4,63,417 మంది విమానాల్లో ప్రయాణించారని కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ట్వీట్ చేశారు. 5,998 విమాన సర్వీసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబరులో ప్రయాణికుల సంఖ్య రికార్డ్ స్థాయిలో నాలుగు రెట్లు పెరిగిందని వెల్లడించారు.

మార్చి కల్లా 2500 శాఖలకు విస్తరణ



పూణె: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) 2024 మార్చి ముగింపు నాటికి 2500 శాఖలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ బ్యాంక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎఎస్ రాజీవ్ తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో కొత్తగా 650 శాఖలను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది 250 శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా వ్యాపారంలో 23-25 శాతం వృద్ధిని సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,500 కోట్ల నికర లాభాలు అంచనా వేస్తున్నామన్నారు.

ప్రియాంక గాంధీ మాటలు హాస్యాస్పదం

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ప్రధాని పీవీ పై ప్రియంక గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. పీవీ నరసింహరావును బతికుండగానే కాకుండా, చనిపోయిన తరవాత కూడా అవమానించారని ఆరోపించారు. ఓట్ల కోసం ప్రియాంక పీవీ గురించి చిలక పలుకులు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పీవీకీ చేసిన అవమానాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోరని అన్నారు. పీవీ చనిపోతే ఢిల్లీ లో ఆయన అంత్యక్రియలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. పీవీ నరసింహా రావు కీర్తిప్రతిష్టలను గుర్తించిన బీఆర్ఎస్ పార్టీనెక్లెస్ రోడ్డు లో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పీవీ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బీసీ సీఎం కావాల్సిందే

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామన్న ప్రధాని మోడీకి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ శనివారం హైదర్‌గూడలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ప్రధాన పార్టీలన్నింటి కంటే ఎక్కువగా బీసీలకు 36 సీట్లు ఇవ్వడమే కాక, అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రి చేస్తామన్న బీజేపీని ఆయన అభినందించారు. మీడియా సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, కార్యదర్శి మిర్యాల శ్రీలత, రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం, రాష్ట్ర యువజన కన్వీనర్ మడత కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాక్‌లో అగ్ని ప్రమాదం..10 మంది మృతి

కరాచీ : పాకిస్థాన్‌లోని కరాచీలో ఒక షాపింగ్ సెంటర్ శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో 10 మంది మృతి చెందారు. కాల్ సెంటర్లు, సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉన్న బహుళ అంతస్తుల భవనం ఆర్‌జె మాల్‌లో శనివారం తెల్లవారు జామును ఈ ప్రమాదం జరిగింది. 22 మంది గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. మాల్‌లో చిక్కుకున్న సుమారు 50 మందిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ అగ్ని ప్రమాదానికి కారణాన్ని ఇంకా గుర్తించలేదు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

విమానాశ్రయాలను అభివృద్ధి చేయరేం?

కేంద్రంపై పినరయి మండిపాటు

- ప్రైవేటు కంపెనీలపై ప్రేమ కురిపిస్తోందని ఆగ్రహం



తిరువనంతపురం: రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న కన్నూర్, కరిపూర్ విమానాశ్రయాల అభివృద్ధిపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ విమానాశ్రయాల విస్తరణ ఆగిపోయిందని మండిపడ్డారు. నవ కేరళ సదస్ కార్యక్రమం సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విమానాశ్రయాలను సమగ్రంగా అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేరళ ప్రవాసుల భూమి అని అంటూ వారు తమ స్వరాష్ట్రంతో అనుసంధానమయ్యేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. విమాన ఛార్జీలు తరచూ పెరుగుతున్నాయని, అయితే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అందుబాటులో లేవని పినరయి చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే కన్నూర్, కరిపూర్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. ప్రయాణికులను మలబార్ (ఉత్తర కేరళ) ప్రాంతానికి చేర్చే తొలి విమానాశ్రయం కలిపూరేనని, అయితే ఇప్పుడు దాని అభివృద్ధి ఆగిపోయిందని తెలిపారు. కరిపూర్ విమానాశ్రయంలో రన్‌వే నిర్మాణానికి అవసరమైన భూమిని అక్టోబర్‌లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించామని, అయితే టెండర్ ప్రక్రియ కారణంగా జాప్యం జరుగుతోందని వివరించారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, రన్‌వే అభివృద్ధికి వాస్తవ రూపం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని అన్నారు. కన్నూర్ విమానాశ్రయం నిర్మాణం గత ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందని, దానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అయినా కేంద్రం ఇప్పటికీ విదేశీ విమానాశ్రయాల రాకపోకలను అనుమతించడం లేదని విమర్శించారు. విమానాశ్రయాలపై నియంత్రణ కోసం, తమ ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయించుకునేందుకు కేంద్రం ప్రైవేటు కంపెనీలకు సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిపై ప్రేమ కురిపిస్తోందని ఆరోపించారు. అందుకే కన్నూర్ విమానాశ్రయం అభివృద్ధిని నిలిపివేశారని పినరయి చెప్పారు.

1న ప్రభుత్వ సెక్యూరిటీల వేలం | వాటి విలువ అక్షరాలా రూ. 30 వేల కోట్లు

న్యూఢిల్లీ : ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.30 వేల కోట్ల విలువైన మూడు సెక్యూరిటీలను వేలం వేస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం '7.37% ప్రభుత్వ సెక్యూరిటీ 2028'ని రూ. 7,000 కోట్లకు, '7.18% ప్రభుత్వ సెక్యూరిటీ 2033'ని రూ.13,000 కోట్లకు, '7.30% ప్రభుత్వ సెక్యూరిటీ 2053'ని రూ.10,000 కోట్లకు వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 1న ముంబయిలోని ఆర్‌బీఐ కార్యాలయంలో ఈ వేలం జరుగుతుంది. ఈ మూడు సెక్యూరిటీలలో రూ.2,000 కోట్ల చొప్పున అదనపు సబ్‌స్క్రిప్షన్లను పొందే అవకాశాన్ని ప్రభుత్వం తన వద్ద ఉంచుకుంది. ఆర్‌బీఐ కోర్-బ్యాంకింగ్ సొల్యూషన్స్ (ఈ-కుబేర్) ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. వేలం ఫలితాలను అదే రోజు ప్రకటిస్తారు. బిడ్లు దక్కించుకున్న వారు డిసెంబర్ 4న చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.

పీవీ పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం ఓ జాతీయ వార్తా సంస్థతో మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడైన పీవీని కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా పనిచేసిన నాయకుడికే పార్టీ టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. చనిపోయిన వ్యక్తిని గౌరవించాలన్న కనీస మర్యాద లేక పోగా ఆయన పార్థీవ దేహాన్ని ఏఐసీసీ కార్యాలయానికి రానివ్వకుండా అడ్డుకున్న సంగతిని తెలంగాణ ప్రజలు మర్చిపోరని అన్నారు. .పీవీ కుటుంబానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పీవీ నరసింహారావు శతజయంతిని ఘనంగా జరపడంతో పాటు భారతరత్న ఇవ్వాలని కోరిందని గుర్తు చేశారు. ఎన్నడూ ఉద్యమం చేయని..ఉద్యోగం చేయని, రాహూల్ గాంధీ యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. రాహుల్ ఒక రాజకీయ నిరుద్యోగి..ఆయన ఉద్యోగం కోసం నిరుద్యోగుల్ని రెచ్చగొట్టి చిచ్చుపెట్టాలని చూస్తున్నాడని ఆయన విమర్శించారు.

జర్నలిస్టు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

మరొకరికి మూడేళ్ల జైలు

న్యూఢిల్లీ : జర్నలిస్టు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసులో ఢిల్లీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులైన నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరో నిందితుడికి మూడేళ్లు జైలుశిక్ష ఖరారు చేసింది. హెడ్‌లైన్స్ టుడే న్యూస్ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేసిన 25 ఏళ్ల సౌమ్యా విశ్వనాథన్ 2008 సెప్టెంబరు 30న హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆఫీస్ ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా దుండగులు కాల్పులు జరిపి హత్య చేశారు. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో కారులో ఆమె మరణించి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. తొలుత రోడ్డు ప్రమాదంగా భావించారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత తలకు బుల్లెట్ గాయం వల్ల ఆమె చనిపోయినట్లు తెలిసింది. సిసిటివి ఫుటేజ్ కూడా దీనిని నిర్ధారించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రవి కపూర్, అమిత్ శుక్లాను అరెస్టు చేశారు. వారిని ప్రశ్నించగా.. నేరం అంగీకరించారు.

సౌమ్యా విశ్వనాథన్‌ను కాల్చి చంపి దోచుకున్నట్లు చెప్పారు. థ్రిల్లింగ్ కోసం ఈ హత్యలు చేసినట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మిగతా నిందితులైన బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్‌తో పాటు సహకరించిన అజయ్ సేఠీని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 2010 జూన్‌లో ఈ కేసుపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 15 ఏళ్ల పాటు విచారణ జరిపిన ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఈ ఏడాది అక్టోబరులో ఐదుగురు నిందితులు రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్, అజయ్ సేఠీని దోషులుగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే కేసును విచారించిన ఢిల్లీ కోర్టు ఐదుగురు నిందితుల్లో నలుగురు రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్‌కు తాజాగా జీవిత ఖైదు విధించింది. నలుగురు దోషుల చర్య 'అరుదైన' కేటగిరి కిందికి రాదని, అందువల్ల వీరికి మరణశిక్ష విధించలేమని కోర్టు పేర్కొంది. హత్యకు సహకరించిన అజయ్ సేఠీకి మాత్రం మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

అమెరికాలో కొనసాగుతున్న జాతి విద్వేష ఉద్రిక్తతలు

ఫ్లాయిడ్‌ను చంపిన అధికారికి కత్తిపోట్లు

- జైలులోనే దాడి

వాషింగ్టన్ : నల్లజాతి విద్వేష జాఢ్యం మూలాన అమెరికాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనేవున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జార్జ్ ఫ్లాయిడ్ హత్యకేసులో దోషిగా నిర్ధారించబడి శిక్ష అనుభవిస్తున్న పోలీస్ అధికారి డెరెక్ చౌవిన్‌పై జైలులోనే దాడి జరిగింది. ఆరిజోనా రాష్ట్రంలోని టుక్సాన్ నగరంలోని ఫెడరల్ కరెక్షనల్ ఇనిస్టిట్యూషన్ (ఎఫ్‌సిఐ)లో శుక్రవారం మధ్యాహ్నం ఈ దాడి ఘటన జరిగిందని, డెరెక్ చౌవిన్ కత్తిపోట్లకు గురయ్యాడని స్థానిక మీడియా వెల్లడించింది. దాడి జరిగిన వెంటనే స్పందించిన జైలు అధికారులు తగిన చికిత్స చేసినట్లు తెలిపింది. 2020లో 46 ఏళ్ల నల్లజాతీయుడు జార్జ్ ఫ్లాయిడ్ అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఫ్లాయిడ్‌పై పోలీస్ అధికారి డెరెక్ చౌవిన్ మోకాళ్లపై బలంగా కూర్చోవడంతో 'నాకు ఊపిరి అందడం' లేదని ఫ్లాయిడ్ విలవిలాడారు. అయినా చౌవిన్ విడిచిపెట్టలేదు. ఈ కేసులో చౌవిన్‌ను దోషిగా తేలాడు. న్యాయస్థానం ఆయనకు 21 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆగస్టు 2022 నుంచి టుక్సాన్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. జార్జ్ ఫ్లాయిడ్ హత్యపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పోలీసుల క్రూరత్వం, జాత్యహంకారానికి వ్యతిరేకంగా ఆందోళనలు, ర్యాలీలు జరిగాయి. కాగా, మరోవైపు తనపై హత్యకేసును మరోసారి విచారించాలని పోలీస్ అధికారి చౌవిన్ దాఖలు చేసిన పిటీషన్ అమెరికా సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది.

పోస్టు ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు బట్వాడా

- సెలవు రోజుల్లోనూ విధుల్లోనే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓటరు గుర్తింపు కార్డుల బట్వాడాను వేగవంతం చేసినట్టు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం తెలిసింది. ఈనెల 30వ తేదీలోపు ఓటర్లకు గుర్తింపు కార్డుల్ని పూర్తిగా బట్వాడా చేయాలని నిర్ణయించామనీ, దానికోసం ఆదివారం, గురునానక్ జయంతి వంటి ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పోస్టుమేన్లు విధుల్లో ఉంటారని అసిస్టెంట్ డైరెక్టర్ (బీడీ) ఎన్ఎస్ఎస్ రామకృష్ణ తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుల బట్వాడా కోసం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఓటరు గుర్తింపు కార్డుదారులకు పోస్టాఫీసుల ద్వారా మూడు దశల్లో సంక్షిప్త సందేశాలు (ఎస్ఎమ్ఎస్) వస్తాయనీ, వాటిని భద్రపరుచుకొని, నేరుగా సంబంధిత పోస్టాఫీసుల్లో కూడా ఓటరు గుర్తింపు కార్డులు తీసుకోవచ్చని వివరించారు. ఓటరు కార్డు బుకింగ్, పోస్ట్‌మ్యాన్ బట్వాడా చేసే సమయంలో, అందుకున్న తర్వాత ఎస్ఎమ్ఎస్‌లు వస్తాయని తెలిపారు. దీపావళి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 43 పోస్టాఫీసుల్ని ఓపెన్ చేసే ఉంచామనీ, 409 మంది పోస్ట్‌మేన్‌లు, సిబ్బంది దాదాపు 1.34 లక్షల ఓటరు గుర్తింపు కార్డుల్ని బట్వాడా చేశారని చెప్పారు. సకాలంలో గుర్తింపు కార్డుల్ని అందిస్తామనీ, ప్రజలు సహకరించాలని కోరారు.



నవతెలంగాణ

ఆదివారం 26-11-2023
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
అనుదినం... జనస్వరం
సంపుటి : 9 సంచిక : 325 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



సీపీఐ(ఎం)ది డబ్బు యాత్ర కాదు, పోరాట యాత్ర

ఆరు గ్యారంటీలపై మాట్లాడే వారికే గ్యారంటీ లేదు

- పోడు పట్టాల పంపిణీలో మోసం చేసిన బీఆర్ఎస్
- భూక్య వీరభద్రంకు ఓటేసీ.. అసెంబ్లీకి పంపించండి
- ఊసరవెల్లి రాజకీయ నాయకులను ఓడించండి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

నవతెలంగాణ-వైరాటౌన్/కొణిజర్ల

ఊసరవెల్లిలా రంగులు మార్చే రాజకీయ నాయకుల మాటలు నమ్మొద్దని, వారికి డబ్బు మాత్రమే ఉందని, ఒక సిద్ధాంతం, నీతి, నిజాయితీ లేదని, అలాంటి వారిని ఓడించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపునిచ్చారు. ఎర్రజెండా ఎత్తి పోరాటాలు చేయడంలోనే ...9లో



ప్రజలకు రక్ష కమ్యూనిస్టులే...

ప్రజాసమస్యల్ని చట్టసభల్లో లేవనెత్తేది వారే

- అలాంటి నేతలను చట్టసభలకు పంపండి
- పోరాటగడ్డలే విప్లవకారులకు యాత్రాస్థలాలు
- పాలేరులో తమ్మినేని వీరభద్రంను గెలిపించండి: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ఖమ్మం జిల్లా ఎమ్.వెంకటాయపాలెం నుంచి అచ్చిన ప్రశాంత్

ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమ్ముడుపోకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నికరంగా కొట్లాడేది కమ్యూనిస్టులేననీ, అందుకే పాలేరు ఎమ్మెల్యేగా తమ్మినేని వీరభద్రాన్ని గెలిపించాలని సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరులగన్న పోరాట గడ్డలే విప్లవకారులకు తీర్థయాత్రా స్థలాలని ఆయన చెప్పారు. అలాంటి గడ్డ ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం రూరల్ మండలంలోని ఎమ్.వెంకటాయపాలెంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఏచూరి మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగ, ప్రజా పోరాటాలను చీల్చడానికి మతోన్మాద రాజకీయాలను బీజేపీ ముందుకు తీసుకొస్తున్నదని విమర్శించారు. యూపీలో బీజేపీ బుల్డోజర్ పాలన కొనసాగిస్తున్నదన్నారు. మణిపూర్‌లో పెద్ద ఎత్తున హింస జరుగుతుంటే మోడీ ఒక్కసారి కూడా వెళ్లలేదన్నారు. మణిపూర్ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మోడీపైన లేదా? అని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటే ...9లో

కేసీఆర్ రిమోట్ మోడీ చేతిలో..

ఇక్కడ.. అక్కడ ఇద్దరిని ఓడించడమే లక్ష్యం



- ఎలాంటి తెలంగాణ కావాలో జనం తేల్చుకోవాలి
- అధికారం రాగానే చట్టాలుగా ఆరు గ్యారంటీలు
- ధరణిని రద్దుచేసి భూములు కాపాడతామని స్పష్టీకరణ
- ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తామని హామీ : రాహుల్‌గాంధీ

9లో..



రుణమాఫీ కాలే..ఉద్యోగాలు రాలే..

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కేసీఆర్

- ఖమ్మం,పాలేరు, సత్తుపల్లి, మధిర రోడ్‌షోల్లో ప్రియాంకగాంధీ

10లో..

స్కామ్‌లుగా ఇరిగేషన్ స్కీమ్‌లు..

బీజేపీతోనే.. సౌభాగ్య తెలంగాణ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్బన్ పేపర్ లాంటిది
- ఎస్సీ,ఎస్టీ, ఓబీసీలకు అన్యాయం చేసింది ఆ రెండు పార్టీలే..
- ఎస్సీ వర్గీకరణ ప్రణాళికలు సిద్ధం : ప్రధాని మోడీ

నవతెలంగాణ-కామారెడ్డి/ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి



బీజేపీ మాట ఇస్తే దానిపై నిలబడుతుందని, 370 ఆర్టికల్‌ను రద్దు చేస్తామని చెప్పి చేసి చూపించామని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే.. సకల సౌభాగ్య తెలంగాణను ఇవ్వడమే లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి విముక్తిని కోరుకుంటున్నారన్నారు. బీజేపీ గెలిస్తే చెరకు రైతులకు తీపికబురు ఉంటుందని చెప్పారు. తెలంగాణలో ఇరిగేషన్ పథకాలను ఇరిగేషన్ స్కామ్‌లుగా మార్చారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక తరగతులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్యాయం చేశాయన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలో తెస్తే తొలి బీసీని సీఎం చేసే బాధ్యత తనదే అన్నారు. మోడీ మాట ఇస్తే తప్పదు అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో ప్రధాని మాట్లాడారు. కామారెడ్డి సభలో.. 'నా కుటుంబ సభ్యులారా' అని ప్రధాన మోడీ తన ప్రసంగానికి ముందు అనడంతో ప్రజల నుంచి హర్షధ్వానాలు వినిపించాయి. కేసీఆర్ అధికారంలోకి రాకముందు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి తనే ఆ కుర్చీని కబ్జా ...9లో



కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే పదేళ్లు వెనక్కి

ప్రాజెక్టును ఇసుక మీద కాక నెత్తి మీద కడతారా..?

- గ్యారెంటు లేని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి : మంత్రి తన్నీరు హరీశ్ రావు

వివరాలు 9లో..

గంప గుత్త బేరాలు

ఊర్లకు ఊర్లే కొనుగోలు | **సామూహిక ప్రమాణాలు**

ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకున్న వేళ.. అంది వచ్చిన ఏ అవకాశాన్నీ రాజకీయ పార్టీలు వదులుకోవడం లేదు. ఓటర్లను ప్రలోభ పెట్టడం చాలా ఎన్నికల్లో చూసాం. కానీ ఈసారి రాజకీయ పార్టీలు కొత్త తరహా పంథాకు శ్రీకారం చుట్టాయి. విలువలకు పాతరేసి గంప గుత్త బేరాలు మొదలు పెట్టాయి.ఊళ్ళకు ఊళ్ళనే కొనుగోలు చేస్తున్నాయి. ఓటర్లను అంగట్లో సరుకుల్లా చేస్తున్నాయి. "ఆ ఊర్లో ఇతర పార్టీల జెండాలు ఎగరకూడదు... వందకు వంద శాతం ఓట్లు మన పార్టీకే పడాలి"... ఇది ఆయా గ్రామాల ప్రజలకు సదరు పార్టీకి మధ్య ఒప్పందం. ఇందుకోసం ఆ గ్రామాల్లోని రచ్చబండల దగ్గర సామూహిక ప్రమాణాలు చేయిస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో వచ్చిన ఈ కొత్త పోకడ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.



- ట్రెండ్ మార్చిన నేతలు
- అంగడి సరుకుగా మారిన ఓటు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"మనసా... వాచా.. కర్మణా ప్రమాణం చేస్తున్నాం. గ్రామ శ్రేయస్సు కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఫలానా పార్టీకి ఓటేస్తున్నాం. గ్రామంలోని ప్రజలందరూ తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి సమిష్టిగా తీసుకున్న నిర్ణయం ఇది" తెలంగాణ ఎన్నికల్లో మొదలైన కొత్త పోకడ ఇది. గతంలో వ్యక్తులు, కుటుంబాలు,కుల సంఘాల ఓట్లను రాజకీయ పార్టీలు కొనుగోలు చేసేవి. అయితే ఇప్పుడు ట్రెండ్ ...9లో

సంపాదకీయం

'లా' వొక్కింతయులేదు, ధైర్యంబు విలోలంబయ్యె, ప్రాణంబులున్ ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె, తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్'...అన్న పోతనామాత్యుడి గజేంద్ర విలాపమును గుర్తుకు తెస్తున్నది నేటి జాతీయ 'లా' దినోత్సవం. ఎందుకంటే, ఒక్కింత న్యాయం చేయండీ అని ఎన్ని గొంతులు ఈ దేశంలో అర్థిస్తున్నాయో వింటే, మొసలికి చిక్కిన గజేంద్రుడి దు:ఖం గుర్తుకు రాక మానదు. పురాణగాథలో గజేంద్రుని ఘోషను వైకుంఠపురంలో వున్న విష్ణుమూర్తి విని హుటాహుటిన కాపాడేందుకు ఉరికొచ్చాడు. మరి వాస్తవిక వర్తమానంలో మనకున్న ఏకైక భరోసా మన రాజ్యాంగం. దాని ప్రకారంగానే న్యాయం కావాలని ఎవరమైనా అడుగుతాము. న్యాయమైనా, చట్టమైనా ఏదయినా ఆచరణలోకి రావటానికి, రాజ్యము నిర్వహించే పాత్ర కీలకమైనది. వాస్తవానికి మనమే ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగం ప్రకారమే పాలనయినా, న్యాయమైనా జరగవలసి వుంటుంది. కానీ న్యాయమూ, చట్టమూ, పాలనా సమాజంలోని ఉన్నత వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నపుడు అశేష సామాన్యులంతా అన్యాయం పాల వుతూనే వుంటారు. ఆర్తగీతాలాపన కొనసాగుతూనే వుంటుంది. అసలు చట్టము న్యాయ విధాన వ్యవస్థా ఏర్పడిందే వారి కోసం కదా! అదొక మౌలిక విషయం. దాన్నలా వుంచి న్యాయ దినోత్సవాన్ని గురించి మాట్లాడుకోవాలి.

జనవరి 26, 1946లో మన రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ సభను ఏర్పాటు చేసుకున్నం. నవంబరు 26, 1949న, డా॥ అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించబడిన రాజ్యాంగాన్ని ఆమోదించి స్వీకరించడం జరిగింది. 26, జన



'లా' వొక్కింతయులేదు!

ఎన్నెన్నో అన్యాయాలు వెంటాడుతున్న వేళ న్యాయదినోత్సవాన్ని చేస్తున్నాము. అవునుమరి లేని వాటిని పొందాలన్న కోరికతోనే ఈ దినోత్సవాలు జరుపుకోవటం. ప్రపంచంలోనే గొప్పదనదగిన అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మనకున్నప్పటికీ, దాని ప్రకారం అందరికీ సమాన న్యాయం హక్కులు అందక పోవటం పాలకుల దుర్నీతికి, దుర్వర్తనకు అద్దం పడుతుంది. నిజంగా బాబాసాహెబ్ తో పాటుగా అనేక మంది విద్యాధికులు, నాయకులు ఎంతో కృషి చేసి, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, శాంతి, సౌహార్ధతల సారంగా ఒక ఘనమైన రాజ్యాంగాన్ని మనకందించారు. కానీ అందులోని అన్ని విలువలు, హక్కులు త్రోసివేయబడుతున్నాయి. ఇలా తోసి వేస్తున్న పాలకులే మరోవైపు ఉత్సవాలను ఘనంగా చేయాలని పిలుపునియ్యటం విడ్డూరమైన విషయం.

వరి 1950లో అమలు ప్రారంభమయింది. రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబరు 26ను ముప్పయి ఏండ్ల తర్వాత సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ న్యాయదినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. 2015లో డా॥ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా కూడా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఈ సందర్భంగా రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మననం చేసుకోవాలని, అదే విధంగా రాజ్యాంగ నిర్మాతగా వున్న అంబేద్కర్‌ను ఆయన ఆశయాలను స్మరించుకోవాలన్నది ఈ దినోత్సవాల లక్ష్యం.

ప్రజాస్వామ్య పరిరక్షణ, మానవ హక్కులకు రక్షణ, శాంతి, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, లౌకిక విలువలను పరిరక్షించడం మొదలైన సూత్రాలు రాజ్యాంగసారంగా వున్నాయి. ఈ సూత్రాల ఆధారంగానే న్యాయ వ్యవస్థ చట్టము పనిచేస్తాయి. న్యాయవ్యవస్థ అనేది ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణకు మూలస్తంభం లాంటిది. రాజ్యంగం ప్రజలకు కల్పించిన ఈ హక్కులన్నీ, విలువలన్నీ ఇపుడు వమ్ము చేయబడుతున్నాయి. ఏ నేరమూ చేయని వేలాది మంది ప్రజలు, హక్కుల కార్యకర్తలు నిర్బంధానికి గురయివున్నారు. మానవ హక్కులు హరించబడుతున్నాయి. లౌకిక విలువలు మంటకలిశాయి. బహిరంగంగానే మత విద్వేషాలను రెచ్చగొడుతూ విధ్వంసాలు సృష్టిస్తున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ హరించుకుపోతోంది. బ్రతికే హక్కు, మాట్లాడే హక్కు, ఇష్టమైన తిండి తినే స్వేచ్ఛ, బట్టకట్టుకునే స్వేచ్ఛ అన్నీ నియంత్రించబడుతున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగం కల్పించిన ఆదివాసీల, దళితుల, స్త్రీల, మైనారిటీల, జాతుల, తెగల హక్కులు నిరాకరణకు గురవుతున్నాయి. సామాన్యులకు చట్టం, న్యాయం అందని ద్రాక్షగానే వున్నది. అంబేద్కరు మహాశయుడు పాటుపడిన సామాజిక న్యాయానికి తూట్లు పడుతున్నవి. కుల నిర్మూలన అటుంచి కుల వివక్షతలు పెరిగి మనుధర్మ అధర్మ పాలనకై పయనం సాగుతున్నది.

ఇన్ని రాజ్యాంగ హక్కులను నిరాకరించబడుతున్న వేళ రాజ్యాంగ దినోత్సవం జరుపు కొంటున్నాం. ఎన్నెన్నో అన్యాయాలు వెంటాడుతున్న వేళ న్యాయదినోత్సవాన్ని చేస్తున్నాము. అవునుమరి లేని వాటిని పొందాలన్న కోరికతోనే ఈ దినోత్సవాలు జరుపుకోవటం. ప్రపంచంలోనే గొప్పదనదగిన అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మనకున్నప్పటికీ, దాని ప్రకారం అందరికీ సమాన న్యాయం హక్కులు అందక పోవటం పాలకుల దుర్నీతికి, దుర్వర్తనకు అద్దం పడుతుంది. నిజంగా బాబా సాహెబ్‌తో పాటుగా అనేక మంది విద్యాధికులు, నాయకులు ఎంతో కృషి చేసి, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, శాంతి, సౌహార్ధతల సారంగా ఒక ఘనమైన రాజ్యాంగాన్ని మనకందించారు. కానీ అందులోని అన్ని విలువలు, హక్కులు త్రోసివేయబడుతున్నాయి. ఇలా తోసివేస్తున్న పాలకులే మరోవైపు ఉత్సవాలను ఘనంగా చేయాలని పిలుపునియ్యటం విడ్డూరమైన విషయం. రాజ్యాంగపు మూలసూత్రమైన ప్రజాస్వామ్యం పూర్తిగా ధనస్వామ్యంగా మారి పోవటం ఎన్నికలలో మనం చూస్తున్నాము. ఎన్నికలే కాదు, ప్రభుత్వాల ఏర్పాటులో, పార్టీల ఫిరాయింపుల్లో, పదవుల పందేరంలో స్పష్టంగా కనబడుతున్నది.


ఇట్లాంటి సందర్భంలో రాజ్యాంగాన్ని, దాని స్ఫూర్తిని కాపాడుకునేందుకు కృషి చేయటమే నిజమైన కర్తవ్యంగా భావించాలి. న్యాయ సమానత్వాలు అందరికీ అందేందుకు చైతన్యయుత పోరాటమే ఏకైక మార్గం. అందుకు ప్రజలను సన్నద్ధులను చేయటమే దినోత్సవాల అర్థం పరమార్థం కావాలి.

బీజేపీ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే జాతీయ పోరాటంలో బీఆర్ఎస్ ఒకకీలక భాగస్వామి అవుతుందనే నమ్మకం మునుగోడు ఎన్నిక కలిగించింది. ఆ సమయంలోనే ఆపరేషన్ ఫాం హౌస్, లిక్కర్ స్కాం కేసు వంటివి రంగం మీదకు వచ్చాయి. బీజేపీ నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపైనా తీవ్రస్థాయిలో దాడి చేశారు. రకరకాల కథనాల మధ్య ఈ వాతావరణం మారిపోయింది. కేసీఆర్‌తో సహ ఆ పార్టీ నేతలు 'ఇండియా', బీజేపీల మధ్య సమదూరం సిద్ధాంతం తీసుకున్నారు. కాంగ్రెస్ మా ప్రధాన ప్రత్యర్థి గనక దానిపై కేంద్రీకరిస్తున్నామని చెప్పినా మోడీపై విమర్శ తగ్గడం వాస్తవం. అయితే ఎన్నికల ప్రచారం చివరిదశలో మాత్రం దీన్ని కొంత సరిదిద్దుకుని తామెప్పుడూ లౌకిక పార్టీగానే వుంటామని కేసీఆర్,కేటీఆర్ ప్రత్యేకంగా ప్రకటించడం మొదలుపెట్టారు.

హైదరాబాద్ చుట్టుపక్కల 24 స్థానాలు, ఉత్తరతెలంగాణలో 32సీట్లు కాంగ్రెస్ ఆధిక్యత తెచ్చుకోగలననుకుంటున్నది. అయితే హైదరాబాదులో మజ్లిస్, బీఆర్ఎస్, ఉత్తరాంధ్రలో బీజేపీ బలమైన అభ్యర్థులను నిలపడం వల్ల ఆ ఆశ పూర్తిగా నెరవేరుతుందని చెప్పలేము. మూడు శిబిరాల మధ్య స్వతంత్ర పాత్ర కాపాడుకుంటూ ఆత్మగౌరవం విధాన స్పష్టతతో ముందుకు పోవడం సీపీఐ పోటీచేసే కొత్తగూడెంలో వారికే మద్దతు నిస్తామని కూడా సీపీఐ(ఎం) చెప్పడం లౌకిక శక్తుల వామపక్ష వాదుల మన్ననపొందుతున్నది. కాగా ఇదేదో బీఆర్ఎస్ కోసం చేస్తున్నట్టు వచ్చిన ఒక వర్గం మీడియా చేసిన ప్రచారాన్ని సీపీఐ(ఎం) గట్టిగానే ఖండించింది. ఈ పరిస్థితికి కారణమైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఆయా చోట్ల ఓట్ల చీలిక పర్యవసానాలకు మూల్యం చెల్లించవలసి వుంటుంది.

తెలంగాణ సమరంలో సంకేతాలు,సందేహాలు

తెలంగాణతో సహా అయిదు రాష్ట్రాల్లో పోలింగ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. కొన్ని రాష్ట్రాల్లో పోలింగ్ కూడా ముగిసిపోగా మిగిలిన చోట్ల ప్రచారం 28తో పూర్తయి నవంబరు 30న ఓటేయడానికి ప్రజలు సంసిద్ధులవుతున్నారు. ఈ రెండు రోజుల్లోనూ ప్రధానంగా తెలంగాణలో అన్ని పార్టీల అగ్ర నాయకులూ పర్యటించనుండటంతో ప్రచారం తారాస్థాయికి చేరుతుంది. క్రమేణా రూపుమారుతున్న ప్రచార పద్ధతులూ, మీడియా, సోషల్ మీడియా సాధనాలు, నాయకుల పర్యటనలూ అన్నీ హోరెత్తాయి. ప్రజల తీర్పు ఎలా వుంటుందనే దానిపై అనేక రకాల సర్వేలు వెలువడ్డాయి గానీ ఇవేవీ ప్రభంజనం వస్తుందని చెప్పలేదు. పాలకపార్టీ బీఆర్ఎస్ గెలుస్తుందని ఎక్కువ సర్వేలు చెప్పగా కాంగ్రెస్ తప్పక విజయం సాధిస్తుందని రెండు మూడు సర్వేలు చెప్పాయి. ఎన్నికల తేదీ దగ్గరైన కొద్దీ బీఆర్ ఎస్ అనుకూల సర్వేలు జోరందుకున్నాయి. టీవీ చర్చలలోనూ, కార్యక్రమాలలోనూ మొత్తం పైన సర్వేలను తోసిపారేయడమే గాక ఇవన్నీ స్పాన్సర్డ్ అనే రీతిలో ఎదురుదాడి చేస్తున్నారు. కానీ పార్టీలుగా మాత్రం అనుకున్న వాళ్లను రంగంలోకి దింపి రోజుకు రోజు ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసే ప్రయత్నాలు ఆపింది లేదు. బీఆర్ఎస్‌కు ప్రధాన పోటీ కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ అనేదానిపై మాత్రం ఏకాభిప్రాయం వున్నా తేడా మాత్రం పెరిగిపోతున్న స్థితి. కాంగ్రెస్ ప్రభంజనం నెలకొందన్న కథనాలతో అతి విశ్వాసం పెంచుకున్న ఆ పార్టీ ఇప్పటికీ అంతే నమ్మకంతో వుందా అనేది సందేహమే. ప్రచారపరంగా బీఆర్ఎస్‌కు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు ముగ్గురు మూడు కోణాలలో ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ ప్రచార భారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రమే మోయవలసి వచ్చింది. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాత్రమే కొంత తోడు నిలిచారు. ముఖ్యమంత్రి ఎవరనే జాబితాలో ఈ ఇద్దరి పేర్లే ముందుండటం కూడా వాస్తవం. మిగిలిన నాయకులు జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వంటివారెవరూ రాష్ట్ర వ్యాపితంగా పర్యటించడానికి సిద్ధం కాలేకపోయారు. వారి కుటుంబ సభ్యుల సీట్లలోనే దిగబడిపోయారు. నల్గొం డ జిల్లా వంటిచోటికి రేవంత్ రావడాన్ని స్వాగతించింది కూడా లేదు. కేసీఆర్ సహా బీఆర్ఎస్ నాయకులు కూడా రేవంత్‌పైనే అస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ కర్నాటక తరహా వాగ్దానాలతో ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తే బీఆర్ఎస్ ఉన్న పథకాల పెంపుతో పాటు కొన్ని కొత్త వాగ్దానాలు ప్రకటించింది. తెలంగాణ సాధన, అభివృద్ధి, మరీ ముఖ్యంగా హైదరాబాద్ నవీక రణ తమ వల్లనే జరిగిందని కాంగ్రెస్ వస్తే ఇదంతా కొట్టుకు పోతుందని బీఆర్ఎస్ ప్రధాన పల్లవిగా వుంది. 30 మందికిపైగా పాత ఎంఎల్ఎలను మార్చాలని అనే కసూచనలు వచ్చినా కేవలం పదిమందిని మాత్రమే కొత్త వాళ్లను తీసుకున్న కేసీఆర్ నిర్ణయం ప్రభావం ఎన్నికల తర్వాత గాని తెలియదు. కొత్తగా టికెట్టివ్వ డానికి అవకాశం లేకున్నా బీఆర్ఎస్ పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్ధనరెడ్డి వంటివారితో ఆఖరి క్షణంలో చేర్చుకుంది.



తెలకపల్లి రవి

విజయశాంతి వంటివారి కాంగ్రెస్ ప్రవేశం కూడా అలాంటిదే. విధాన పరమైన నిబద్ధత, రాజకీయ విలువలు లేకపోవడం వల్ల ఎన్నికల పోరాటం కాస్త పదవుల కోసం ఆరాటంగానే తయారైంది.

క్రమేణా మారిన దృశ్యం

బీజేపీ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే జాతీయ పోరాటంలో బీఆర్ఎస్ ఒకకీలక భాగస్వామి అవుతుందనే నమ్మకం మునుగోడు ఎన్నిక కలిగించింది. ఆ సమయంలోనే ఆపరేషన్ ఫాంహౌస్, లిక్కర్ స్కాం కేసు వంటివి రంగం మీదకు వచ్చాయి. బీజేపీ నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపైనా తీవ్రస్థాయిలో దాడి చేశారు. రకరకాల కథనాల మధ్య ఈ వాతావరణం మారిపోయింది. కేసీఆర్‌తో సహా ఆ పార్టీ నేతలు 'ఇండియా', బీజేపీల మధ్య సమదూరం సిద్ధాంతం తీసుకున్నారు. కాంగ్రెస్ మా ప్రధాన ప్రత్యర్థి గనక దానిపై కేంద్రీకరిస్తున్నామని చెప్పినా మోడీపై విమర్శ తగ్గడం వాస్తవం.



అయితే ఎన్నికల ప్రచారం చివరిదశలో మాత్రం దీన్ని కొంత సరి దిద్దుకుని తామె ప్పుడూ లౌకిక పార్టీగానే వుంటామని కేసీఆర్,కేటీఆర్ ప్రత్యేకంగా ప్రకటించడం మొదలుపెట్టారు. చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత ఆ మూలాలున్న వారి ఓట్ల ప్రభావం, కుల పరమైన లెక్కలు నడిచినా ఆయనకు బెయిల్ రావడంతో అది తగ్గింది. ఉద్యోగాల భర్తీలో వెనకబాటే తమపై కొంత అసంతృప్తికి కారణమైందని కేటీఆర్ బహిరంగంగానే వ్యాఖ్యానించిన ఉద్యోగార్థులతో సహ వివిధ తరగతుల వారిని మోడీ తరహాలో ఇంటర్వ్యూలు చేస్తూ దగ్గర చేసుకోవడానికి ప్రయత్నించారు. నిజానికి కేసీఆర్ గ్రామాలలో సభలు పెడుతుంటే కేటీఆర్ ఆ సభలతోపాటు నగర వాసులతో చానళ్ల, సోషల్ మీడియా ద్వారా దగ్గరయ్యే ప్రయత్నం పెంచారు. మోడీ, అమిత్‌షాతో సహ బీజేపీ నేతలు మాత్రం పాలకపార్టీపై దాడి తీవ్రంగానే కొనసాగించారు. మతతత్వ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను అరెస్టు చేస్తామనీ బెదిరిస్తూనే వున్నారు. ఏమైనా వారి టార్గెట్ కాంగ్రెస్ అనేది స్పష్టం. హంగ్ వస్తుందని అప్పుడు తాము బీఆర్ఎస్‌ను లోబర్చుకుని చక్రం తిప్పాలనీ ఆశపడుతున్నారు. వారి ఎత్తుగడలు ఏమైనా అసలు కాంగ్రెస్ శిబిరంలోనే ఐక్యత లేకపోవడం, అనేకమంది ముఖ్యమంత్రులు ముందుకు రావడం షరా మామూలుగా సాగుతున్నది. మజ్లిస్ నేత ఒవైసీ బీఆర్ ఎస్‌కే తమ మద్దతు వుంటుందని గట్టిగా ప్రకటించడమే గాక కాంగ్రెస్‌పై దాడి ఎక్కుపెట్టారు.

పేలవంగా జనసేన విన్యాసాలు

ఏపీలో టీడీపీ నేస్తమైన పవన్ కళ్యాణ్ జనసేన బీజేపీతో కలిసి ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తూ డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని, మోడీ మూడోసారి ప్రధాని కావాలని భక్తి చాటుకుంటున్నారు. అయితే ప్రచారం కూడా చేయకపోగా మొక్కుబడిపోటీతో జనసేన ఇక్కడ పలచనవడమే గాక ఏపీలోనూ నష్టపోతుందనే మాట అందరినోటా వస్తోంది. రిజర్వేషన్ వర్గీకరణ పేరిట మందకృష్ణ మోడీని దళితోద్ధారకుడిలా కీర్తించడం కూడా విమర్శకు గురైంది. బీజేపీ తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను తన చుట్టూ తిప్పుకోవడం కనిపిస్తుండగా కాంగ్రెస్ ఆ విధమైన విశాల వైఖరి తీసుకోవడంలో విఫలమైంది. షర్మిల వైఎస్ఆర్‌టిపి, ప్రొఫెసర్ కోదండరామ్ టిజెఎస్‌లను కూడా పోటీకి దూరంగా వుంచింది. సీపీఐకి ఒక్క స్థానం మాత్రం ఇచ్చి పొత్తుపెట్టుకుంది. బీఆర్ఎస్‌గా పేరు మార్చుకుని జాతీయ పాత్ర నిర్వహిస్తామని హడావుడి చేసిన కేసీఆర్ తెలంగాణలో గెలవడం కోసం ప్రాంతీయ పార్టీగా పరిమితం చేసుకోవడం ఒక విచిత్రం, కాంగ్రెస్ ది కేవలం కల్పితమైన హైప్ మాత్రమేననీ తాము పూర్తి ఆధిక్యతతో గెలుస్తామని చెబుతున్న బీఆర్ఎస్ హంగ్ వస్తే బీజేపీ మద్దతు తీసుకునేది లేదని మాత్రం చెప్పడం లేదు. మరో వంక కాంగ్రెస్‌లో కలిసిన మాజీ బీజేపీ నేతలేమో తమ నాయకులు కేసీఆర్‌తో రాజీ పడినందుకే తాము బయటకొచ్చామని ప్రకటిస్తున్నారు. వీరంతా కలిసినప్పటికీ దాదాపు ఒంటరిగా మెజార్టీ సాధించేంత వూపుకాంగ్రెస్‌కు వుందా అనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

సీపీఐ(ఎం) కీలక ప్రభావం

బీజేపీని ఓడించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేకత విధానాలపై పోరాడటానికి 19 స్థానాల్లో స్వంతంగా రంగంలోకి దిగిన సీపీఐ(ఎం) పోటీలు ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఫలితాలను కీలకంగా ప్రభావితం చేస్తాయి. కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్న జిల్లాల్లో ఇవే ప్రధానమైనవి కావడం గమనించదగ్గది. హైదరాబాద్ చుట్టుపక్కల 24 స్థానాలు, ఉత్తరతెలంగాణలో 32సీట్లు కాంగ్రెస్ ఆధిక్యత తెచ్చుకోగలననుకుంటున్నది. అయితే హైదరాబాదులో మజ్లిస్, బీఆర్ఎస్, ఉత్తరాంధ్రలో బీజేపీ బలమైన అభ్యర్థులను నిలపడం వల్ల ఆ ఆశ పూర్తిగా నెరవేరుతుందని చెప్పలేము. మూడు శిబిరాల మధ్య స్వతంత్ర పాత్ర కాపాడుకుంటూ ఆత్మగౌరవం విధాన స్పష్టతతో ముందుకు పోవడం సీపీఐ పోటీచేసే కొత్తగూడెంలో వారికే మద్దతు నిస్తామని కూడా సీపీఐ(ఎం) చెప్పడం లౌకికశక్తుల వామపక్ష వాదుల మన్ననపొందుతున్నది. కాగా ఇదేదో బీఆర్ఎస్ కోసం చేస్తున్నట్టు వచ్చిన ఒక వర్గం మీడియా చేసిన ప్రచారాన్ని సీపీఐ(ఎం) గట్టిగానే ఖండించింది. ఈ పరిస్థితికి కారణమైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఆయా చోట్ల ఓట్ల చీలిక పర్యవసానాలకు మూల్యం చెల్లించవలసి వుంటుంది. బీఎస్పీ కూడా రంగంలో వుంది. కొల్లాపూర్‌లో నిరుద్యోగ యువతి బర్రెలక్క పోటీ మరో ప్రత్యేకతగా వుంది. వీటన్నిటిపై ఓటర్లు ఎలా స్పందిస్తారో డిసెంబర్ మూడున కానీ తేలదు.

ఒంటెత్తు పోకడల మూల్యం?

దక్షిణ భారతంలో ఇంతవరకూ ఏ ముఖ్యమంత్రి మూడోసారి వరుసగా గెలిచింది లేదనే మాట వినిపిస్తున్నా వాస్తవం కాదు. తమిళనాడులో ఎంజి రామచంద్రన్ 1977, 1980, 1984 ఎన్నికలలో వరుసగా గెలుపొందారు. కేరళలో పినరాయి విజయన్ చరిత్రను మారుస్తూ రెండవసారి ముఖ్యమంత్రి కాగలిగారు. కనుక కేవలం గత ఉదాహరణలతోనే నిర్ణయాలకు రావడం వాస్తవికత కాదు. కేసీఆర్ ప్రభుత్వంపై అనేక విమర్శలు, తప్పొప్పులు వున్నా ఆయనను గద్దెదించాలనీ, కాంగ్రెస్‌కు అవకాశమివ్వాలని ప్రజలు దృఢ నిర్ణయంతో వున్నారా అనేదానిపై రెండు రకాల వాదనలు కొనసాగుతూనే వున్నాయి. నిజానికి 1983లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాత ఇప్పటివరకూ ఉమ్మడిగా విడిగా తొమ్మిది ఎన్నికలు జరిగితే అందులో మూడు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. 2004 ఎన్నికలు విద్యుత్ ఉద్యమంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వామపక్షాలతో కలసి పోరాడిన నేపథ్యం. అదే కేంద్రంలో యుపిఎ రావడానికి దోహదం చేసింది. ఈ వాస్తవాలను విస్మరించిన కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ ఎలాంటి ఫలితాలకు దారితీసేది చూడవలసిందే.అలాగే తెలంగాణ సెంటిమెంటు, తమ సంక్షేమ పథకాలు, హైదరాబాద్ అభివృద్ధి, దిగుబడి పెరుగుదల వంటివాటితో పాటు ప్రజలు సారు కారునే విశ్వసిస్తారన్న బీఆర్ఎస్ ఆఖరి ఆశలు ఫలిస్తాయా? బీజేపీ పేరాశలను పథకాలను ప్రజలు ఇప్పటికే విఫలం చేసినప్పటికీ ఎవరికీ మెజార్టీ రాని పరిస్థితే వస్తే ఏదో రూపంలో బీజేపీ పట్టు బిగుస్తుందా అనేది కూడా ఫలితాలతో తేలాలి, ఎందుకంటే హంగ్ వస్తే బీజేపీ మాటే చెల్లుతుందన్నది సర్వజనభావన, ఇప్పటివరకూ తెలుగు ప్రజలు అనిశ్చిత తీర్పులు ఇచ్చిన దాఖలాలు లేవు, మరి ఆ ఒరవడే 2023లోనూ పునరావృతమవుతుందా? ■

లక్ష్మణ దేవర వనవాసం

"బావగారూ" అంటూ రాముల వారి ఆంతరంగిక మందిరంలోకి పరుగెత్తుకుని వచ్చింది ఊర్మిళ.

రాముడు, సీత ఆశ్చర్యపోయారు. ఊర్మిళ దృష్టి రాముల వారి పాదాలు దాటి పైకి ఏనాడూ ప్రసరించ లేదు. చదువుగా మాట్లాడింది. లేదు! మరి ఈనాడు ఏకంగా ఆంతరంగిక మందిరంలోకి రావటమేమిటి. అయితే ఊర్మిళను పరిశీలించి చూస్తే ఆమె చాలా భయాందోళనకు గురై ఉన్నట్లు కన్పించింది!

ఏమిటమ్మా! అంత భయాందోళనతో ఉన్నావు? ' అని అనునయంగా అడిగాడు రాముడు.

'ఆయన వనవాసం వెళతానని సిద్ధమవుతున్నారు! " అన్నది. ఊర్మిళ దు:ఖాన్ని ఆపుకుంటూ.

రాముడి గుండె బద్దలైంది! మళ్ళీ వనవాసమా! మళ్ళీ కుటుంబం అంతా విడిపోవల్సిందేనా? అని ఆవేదన చెందాడు.

"ఇప్పుడు వనవాసం ఎందుకు? మళ్ళీ ఎవరు కోరారు?" అని అడిగాడు రాముడు.

ఊర్మిళ చెప్పే పరిస్థితి లేదు.

ఈలోగా రాజు కుటుంబం అంతా వచ్చింది. విభీషణుడు కూడా వచ్చాడు. లక్ష్మణ వనవాసం గురించి అందరికీ తెలిసిపోయింది. కాని ఎందుకన్నదీ ఎవరికీ తెలియటం లేదు.

ఇంతలో లక్ష్మణుడే వచ్చాడు. నార చీరలు ధరించాడు. ఆయుధాలు కూడా పరిత్యజించాడు. నడిచొస్తున్న శోకమూర్తిలా ఉన్నాడు.

లక్ష్మణుడిని అలా చూసి రాముడు తల్లడిల్లి పోయాడు. ఏమిది? లక్ష్మణా మళ్ళీ వనవాసం ఎందుకు? 12 ఏండ్లు సరిపోలేదా? ఈ సారి వనవాసానికి ఎవరు ఆదేశించిరి? అన్నాడు.

"నన్ను వనవాసం వెళ్ళమని ఎవరూ ఆదేశించ లేదు! అన్నా ఈ నిర్ణయం నాదే!" అన్నాడు లక్ష్మణుడు.

నీకు నీవే నిర్ణయించుకుంటివా? ఎందులకు? అడిగాడు రాముడు. నీ రాజ్యంలోని ప్రజలు నా శీలాన్ని శంకించే మాటన్నారు! అది భరించలేక వనవాసానికి సిద్ధపడ్డాను." అన్నాడు, లక్ష్మణుడు



"ఏమి మాట్లాడుతున్నావు లక్ష్మణా! నీ శీలానికి వంక పెట్టేవారు ఈ రాజ్యంలో ఎవరున్నారు! చెప్పు ! వారిని నా బాణానికి ఆహుతి చేస్తాను! నా తమ్ముడిగా నీవు చేసిన త్యాగం ఆచంద్ర తారార్కం! తమ్ముళ్ళందరికీ నీవు ఆదర్శం! నీవు లేకపోతే నేను లేను! అన్నాడు రాముడు.

అన్న మాటలకు లక్ష్మణుడికి కన్నీళ్ళు ఆగలేదు! అయినా తమాయించుకున్నాడు. వంగి రామ పాదాలను తాకాడు. రాముడు భరించలేకపోయాడు.

"కారణం చెప్పకుండా నీవు వనవాసానికి వెళ్ళరాదు! ఇది నా ఆదేశం". అన్నాడు రాముడు.

అన్నా! నేనేదైనా నీకు గాని, మన రాజ్యానికి గాని, మన కుటుంబానికి గాని ద్రోహం చేశానా? నీ శత్రువు పంచన చేరానా?" అని లక్ష్మణుడు. అంటూండగానే రాముడు "శివ, శివా!"అంటూ చెవులు మూసుకున్నాడు.



అన్నా! నేనాడూ నీ మాట జవదాట లేదు! నా జీవితము నీ అడుగు జాడల్లోనే నడిచింది! నా ఊహ తెలిసినప్పటి నుండి ఇదే జరిగింది! మరి నేనేదైనా మన శతవులకు మద్దతిచ్చానా?" ప్రశ్నించాడు. లక్ష్మణుడు.

"లేనే లేదు!' అన్నాడు రాముడు,

నీ ఆదేశాలు పాటించటమే తప్ప మరొక్కటి నాకు తెలియదు. నీవు వనవాసం వెళ్ళినపుడు, నా భార్య దు:ఖాన్ని సైతం పట్టించుకోకుండా, నిద్రా మైథునాలు మానుకుని నీకు సేవలు చేశాను. కాని ఏనాడైనా మన శత్రువుల వైపు నిలిచానా? " ప్రశ్నించాడు లక్ష్మణుడు.

"లేదు తమ్ముడు. లేదు! " అన్నాడు రాముడు.

"నిన్ను, నన్ను పలిచిన తప్పు మినహా మరే తప్పు చేయని శూర్పణఖ ముక్కు చెవులు కోశాను. అది నాకు ఇష్టం లేదు! అయినా నీ ఆదేశం పాటించాను!" అన్నాడు లక్ష్మణుడు

"అవును! నిజమే!" అన్నాడు రాముడు.

"రావణుడు ఎంత శక్తి వంతుడే తెలిసీ యుద్ధానికి సిద్ధపడ్డాము. అందులో నేను ఇంద్రజిత్తు చేతిలో ఓడిపోయి, మళ్ళీ గెలిచాను. అప్పుడూ నేను శత్రువులకు మద్దతివ్వలేదు! నీ కోసం నా ప్రాణాలు పణంగా పెట్టాను." అన్నాడు లక్ష్మణుడు.

""రావణుడి వద్ద రాజధర్మం నేర్చుకొమ్మని పంపినపుడు కూడా. లంకలో ఏ ప్రలోభాలకు నేను లోనుకాలేదు. నీకు,నా మన రాజ్యానికి ఏ ద్రోహమూ చేయ లేదు. అంతేకాదు. నాకు నచ్చని పనులు నీవు చేశావు. కాని అలాంటప్పుడు కూడా నేను శత్రవుల పక్క చేరలేదు! "అన్నాడు. లక్ష్మణుడు,

"లక్ష్మణస్వామీ! నిన్ను తప్పు పట్టిన వారెవవరు? ఈ గత జలసేతుబంధనం ఎందుకు? అసలు విషయం ఏమిటీ చెప్పు!. అన్నాడు ఆంజనేయుడు.

'ఈ రాజ్యంలో ఒక గణ నాయకుడు, తన పరివారాన్ని అణిచివేస్తున్న శతృవు దగ్గరికి వెళ్ళి, నీవే నా పరివారం సమస్యలు తీర్చగలవు. నా మద్దతు నీకే. రాముడికి లక్ష్మణుడు ఎలా ఉన్నాడో నేనూ నీకు లక్ష్మణుడిలాగా ఉంటానని ప్రకటించాడు. నేను నా పరివారానికి ఏనాడూ నష్టం చేయలేదు. అదే విధంగా నా అన్న రాక్షసులను సంహరించాడు గాని, తన రాజ్య ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకున్నాడు!. తన సొంత పరివారాన్ని మోసగించినవాడు. విభీషణుడు అవుతాడు. కాని లక్ష్మణుడు కాడు. ఇంత నింద నాపై పడిన తర్వాత నేను చేసిన త్యాగాలకు విలువలేదు. రామరాజ్యంలో నాకు చోటు అవసరంలేదు! అంటూ లక్ష్మణుడు వనవాసానికి వెళ్ళాడు. ■

- ఉషాకిరణ్

దేశంలో ధనేశం ఏకేశం శనీశం

దేశ ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారింది. కార్పొరేట్లకు కోట్ల రూపాలప్పగించిన నేతలు ఏకఛత్రాధిపత్య నిరంకుశత్వానికి పాల్పడ్డారు. మరోమారు గద్దెనెక్కితే నియంతత్వమే. శనీశ్వరాన్ని వదిలించుకోవాలని జనేశ్వరం కోరుకుంటున్నది. ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యతిరేక సంపన్న పాలకవర్గ, మతాధిపతుల, బహుళజాతి సంస్థల బంధం ధనస్వామ్యానికి దారి తీసింది. సామాన్యులు ప్రజాప్రాతినిధ్య అవకాశాలు కోల్పోయారు. చట్టసభలు కోటీశ్వరుల కోటరీలు. పాలకులు వ్యవస్థలను అవినీతిమయం చేశారు. ధనస్వామ్యానికి నాందిపలికారు. ఇందులో కాంగ్రెస్ పెద్దన్న బీజేపీ. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలను చట్టబద్ధం చేసి వాజపేయి ప్రభుత్వం ధనస్వామ్యాన్ని బలోపేతం చేసింది. మోడీయం నిస్సిగ్గుగా కార్పొరేట్ల దళారీగా మారింది. ఎన్నికల ప్రణాళికల్లో అవినీతి నిర్మూలన ఊసే లేదు. గతంలో నీతినిజాయతీ, నిరాడంబరతలకు మారుపేరు, ప్రజా సేవకులు, కమ్యూనిస్టులు ఇంద్రజీత్ గుప్త, భూపేశ్ గుప్త, జ్యోతిబసు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, నంబూద్రిపాద్, యెద్దుల ఈశ్వరరెడ్డి మొదలగు వారూ ఎన్నికయ్యారు. నేడు ఇలాంటి నేతలు నెగ్గటం లేదు. కార్పొరేట్ల మాధ్యమాలు పెట్టుబడిదారీ పార్టీల గొంతులయ్యాయి.ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లతో పాటు లిఖిత వాంగ్మూలాలు సమర్పిస్తారు. 2014 పత్రాల సమాచారంతో' ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం(అసోసియేషన్ ఫార్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్-ఎడిఆర్) సమర్పించిన నివేదిక ప్రకారం 29 రాష్ట్రాల, 2 కేంద్రపాలిత ప్రాంతాల 620 మంది మంత్రుల్లో 609 మంది సగటు ఆస్తి రూ.9.52 కోట్లు. వీరిలో 462 మంది కోటీశ్వరులే. ఆంధ్రప్రదేశ్‌లో 20మంది సగటు ఆస్తి రూ.45.49 కోట్లు. దేశంలో వీరిది అగ్రస్థానం. పొంగూరు నారాయణ రూ.496.86 కోట్ల ఆస్తితో అత్యధిక ధనశాలి. చంద్రబాబు రూ177.49 కోట్ల ఆస్తితో నాల్గవ స్థానంలో ఉన్నారు. కేంద్ర మంత్రుల్లో 72 (92శాతం) మంది కోటీశ్వరులు. వీరి సగటు ఆస్తి రూ.12.94 కోట్లు. రూ.113 కోట్లతో అరుణ్ జైట్లీ, రూ.95 కోట్లతో పియూష్ గోయల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నారు. 15వ లోక్‌సభ సభ్యుల్లో165 మంది కోటీశ్వరులు 16వ లోక్‌సభ (2014-19)కూ ఎన్నికయారు. 2009 -14మధ్య ఐదేండ్లలో ఈ ఎంపీల ఆస్తులు రూ1,232.43 కోట్ల పెరుగుదలతో సగటున 137 శాతం పెరిగాయి. 15వ సభ నుండి 16 వ సభకు పోటీ చేసిన 396 మంది చిరాస్తులు రూ3,366.58 కోట్లు (146శాతం) పెరిగాయి. 16వ లోక్ సభ అతి సంపన్నుల సభ. 82శాతం మంది కొత్త ఎంపీల ఆస్తులు కోటి పైనే. ఈ సంఖ్య 2004, 2009 సభల్లో వరుసగా 30శాతం, 58శాతం. గుంటూరు టీడీపీ ఎంపి గల్లా జయదేవ్ రూ.683 కోట్ల ఆస్తితో దేశంలో అతి ధనవంతుడు. రూ.50కోట్ల సగటు ఆస్తులతో తెలుగు రాష్ట్రాల టీడీపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపిలకు అత్యంత ధనవంతులైన సభ్యులున్నారు. ఇవి ఎన్నికల సంఘానికి సమర్పించిన అధికార గణాం కాలు. అనధికార ఆస్తుల "అభివృద్ధి" ఎన్నో రెట్లు ఎక్కువ. నల్ల సంపాదన, బినామీ ఖాతాల లెక్కలు వేరే ఉంటాయి. ఈ గణాంకాలు మన ధనస్వామ్య ఘనతను నిరూపిస్తున్నాయి.



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

రాజకీయ చందాలు: 2017-18 సంవత్సరంలో బీజేపీ అన్ని జాతీయ పార్టీలకంటే అధికంగా రూ.1,027.34 కోట్ల చందాలొచ్చాయి. అందులో రూ553.38 కోట్లు (53.87శాతం) రహస్య చందాలు. ఇవి అన్ని పార్టీల రహస్య చందాల్లో 80 శాతం. కాంగ్రెస్ చందా రూ.99.2 కోట్లు. బీఎస్పీ చందా రూ.51.7 కోట్లు. బీజేపీ ప్రభుత్వం చేసిన కొత్త చట్టం ప్రకారం రూ.20 వేల లోపు నగదు, ఎన్నికల బాండ్ల చందాల వివరాలు ప్రకటించనక్కర లేదు. అందువల్ల జాతీయ పార్టీలు పొందిన చందాల్లో 50 శాతం రహస్యాలే. 20 వేలు దాటిన చందాలు బీజేపీకి 93 శాతం రాగా అందులో 92శాతం కార్పొరేట్ల నుండే వచ్చాయి. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి 38శాతం, కాంగ్రెస్‌కు 4శాతం చందాలొచ్చాయి. ఇవి ఎన్నికల సంఘానికి సమర్పించిన గణాంకాలు. లెక్కల్లో చూపని వసూళ్ళ, జేబుల్లో కుక్కుకున్న చందాలు, నల్ల కుబేరులు అనామత్తుగా ఇచ్చింది, కానుకలు, పార్టీలు పబ్బాలు, తిండితీర్థాలు, సమావేశ నిర్వహణలకు శ్రేయోభిలాషులు పెట్టిన ఖర్చు కలిపితే వసూళ్ల ఎంతకు చేరుకుంటాయో! ఇంత సొమ్ము ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా ఇస్తారా? దేశ, విదేశాల్లోని నల్లధనాన్ని బయటికి తీస్తామని ఎన్నికల్లో అన్ని పాలక పార్టీలు వాగ్దానాలు చేస్తాయి. 2014 లో మోదీ నల్లడబ్బు తెచ్చి మనిషికి రూ.15 లక్షలు ఇస్తానని నమ్మించి పీఠమెక్కారు. నల్ల కుబేరులకు తాయిలాలు ఇచ్చారు కానీ చర్యల జోలికి పోలేదు. పాలక పార్టీలకు చందాలు వచ్చేదే నల్లసంపాదన నుండి. నల్లసొమ్ము వసూలు చేయడం కల్ల.



విదేశీ విరాళాలపై ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి స్పందిం చిన డిల్లీ హైకోర్టు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆరునెలల్లో చర్యలు తీసుకోమని కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని, 28 మార్చి 2014న ఆదేశించింది. కోర్టు ఆదేశాలు అమలు కాలేదు. కోర్టు ధిక్కార నేరం జరిగింది.2016 పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో లోక్ సభ 'ఆర్థిక బిల్లు 2016' ను ఆమోదించింది. దీని ప్రకారం విదేశీ షేర్ హోల్డింగ్ కంపెనీలు రాజకీయ పార్టీలతో సహా భారతదేశ సంస్థలకు ఇచ్చే విరాళాలు 'ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగులేషన్ యాక్ట్,2010' (ఎఫ్.సి.ఆర్.ఎ.) పరిధిలోకి రావు. ఎఫ్.సి.ఆర్.ఎ. సవరణకు పలుమార్లు విఫలమైన బీజేపీ ఏకం గా చట్టాన్నే చేసి కోర్టును ఎగతాళిచేసింది. రాజ్యాంగ, న్యాయ నిబంధనల ధిక్కరణలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం సహకరించుకున్నాయి. దొంగతనానికి అనుమతిచ్చి దొంగాటల ఇక్కట్లు తప్పించుకున్నాయి. ఆరెస్సెస్ అనుబంధ సంస్థలకు విదేశీ విరాళాలు ఎక్కువ. అధికారం అందిన తర్వాత అవి అధికమయ్యాయి. ఆర్థికబలం పెంచుకోవడానికి బీజేపీ చేసుకున్న చట్టాల్లో ఇదీ ఒకటి. రూ.20వేల పైబడిన విదేశీ చందాలు బీజేపీ, కాంగ్రెస్‌లకే వస్తున్నాయి. చందాలిచ్చిన వారికి "సేవలు" చేయాలి కదా. అదానీ, అంబానీ, తాతాలతో "నీకిది నాకది" సూత్ర పాలనే నేటి పాలక నీతి.ఎన్నికల బాండ్లతో, ఆర్థిక బిల్లు2016 తో బీజేపీతో బాగా లాభపడింది. రాజకీయ నిధులకు బీజేపీ చేసిన ఎన్నికల బాండ్ల చట్టం పారదర్శకతకు పాతరేసిందని, డొల్ల కంపెనీల ద్వారా నల్లనగదు పార్టీలకు చేరి అవినీతి అదుపు తప్పుతుందని ఎన్నికల సంఘం మార్చ్ 27, 2019న సుప్రీం కోర్టుకు అఫిడవిట్ ఇచ్చింది.

చట్టసభల్లో ధనవంతులు బహుళజాతి సంస్థలకు మేలుచేసే చట్టాలే చేస్తున్నారు.ప్రజాసమస్యలు పరిష్కరించబడవు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీలు ఎన్నికల్లో పోటీచేయలేరు. ధనవంతుల చట్టసభలు మహిళలు, పిల్లలకు అనుకూలం కావు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల ప్రచార నినాదాలు, ప్రపంచీకరణ విధానాలు, ఆర్థిక సంస్క రణలు, బూటకపు పథకాలు వామపక్షాల ఆకలి, పేదరికం, నిరుద్యోగం, దున్నేవాడికి భూమి, పని హక్కు, జీవించే హక్కు పెట్టుబడిదారీ, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ వ్యతిరేక ఆశయాలు, గమ్యాలను పూర్వపక్షం చేశాయి. వామ పక్షాల ఓట్ల శాతం తగ్గింది.

చట్టసభల్లో ధనవంతులు బహుళజాతి సంస్థలకు మేలు చేసే చట్టాలే చేస్తున్నారు.ప్రజాసమస్యలు పరిష్కరించబడవు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీలు ఎన్నికల్లో పోటీచేయలేరు. ధనవంతుల చట్టసభలు మహిళలు, పిల్లలకు అనుకూలం కావు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల ప్రచార నినాదాలు, ప్రపంచీకరణ విధానాలు, ఆర్థిక సంస్కరణలు, బూటకపు పథకాలు వామపక్షాల ఆకలి, పేదరికం, నిరుద్యోగం, దున్నేవాడికి భూమి, పని హక్కు, జీవించే హక్కు, పెట్టుబడిదారీ, ప్రపంచీకరణ, ప్రయివే టీకరణ వ్యతిరేక ఆశయాలు, గమ్యాలను పూర్వపక్షం చేశాయి. వామ పక్షాల ఓట్ల శాతం తగ్గింది.

ప్రత్యామ్నాయం: స్వయం ప్రతిపత్తి రాజ్యాంగ సంస్థ ఎన్నికల సంఘానికి విశేష అధికారాలున్నాయని సుప్రీంకోర్టు ధృవీకరించింది. అది ఆ అధికారాలు ఉపయోగించుకోలేదు. అభ్యర్థుల ధృవీకరణ పత్రాల్లోని ఆస్తులు, నేరాల ఆధారంగా చర్యలు చేపట్టలేకున్నది. తాను విధించిన ఎన్నికల ఖర్చు పరిమితులపైనిఘా, చర్యలు లేవు. బూర్జువా పార్టీల అనుచిత పథకాలను ప్రశ్నించటంలేదు. బీజేపీ ముక్త భారత్ కావాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ అనగా సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, "ఇప్పుడు కావలసింది కేవలం రాజకీయ ప్రత్యామ్నాయం కాదు. సైద్ధాంతిక, ఆర్థిక, సామాజిక ప్రత్యామ్నాయం." అన్నారు. వామపక్ష ప్రత్యామ్నాయం ఈ దిశలో సమసమాజ స్థాపనకు కృషిచేయగలదు. మార్క్సిజం సమకాలీన అనువర్తనతో ధనేశ, ఏకేశ శనీశాన్ని వదిలించగలదు. ■

రాజస్థాన్ బీజేపీ మ్యానిఫెస్టో ఓ హెచ్చరిక

'భారత్ వ్యతిరేక శక్తుల' కోసం ప్రత్యేక పోలీస్ విభాగం ఏర్పాటుకు ప్రకటన



జైపూర్ : రాజస్థాన్ శాసనసభ ఎన్నికలు ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. అయితే ఈ నెల ప్రారంభంలో 'సంకల్ప్ పత్ర' పేరిట బీజేపీ విడుదల చేసిన 75 పేజీల ఎన్నికల ప్రణాళికను లోతుగా పరిశీలిస్తే ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలగకమానదు. రాష్ట్రంలో అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి, అధికారాన్ని కైవసం చేసుకోవాలని కమలదళం శతవిధాలా ప్రయత్నించింది. అది ఫలిస్తుందా లేదా అన్నది డిసెంబర్ 3న తేలుతుంది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో ఓ హెచ్చరిక చేసింది. తనను గెలిపిస్తే 'భారత్ వ్యతిరేక శక్తుల'కు అడ్డుకట్ట వేసేందుకు ఏకంగా ప్రత్యేక పోలీస్ విభాగాన్నే ఏర్పాటు చేస్తానని ప్రకటించింది. దీనిని హామీగా కాకుండా హెచ్చరికగానే చూడాల్సి ఉంటుంది. రాజస్థాన్ గత చరిత్రను ఓసారి అవలోకనం చేసుకుంటే దానికి దీర్ఘకాలిక ఫ్యూడల్ చరిత్ర ఉంది. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్న అంశాల్లో మానవ హక్కుల పరిరక్షణ కూడా ఉంది. 2013-2018 మధ్యకాలంలో రాజస్థాన్ బీజేపీ ఏలుబడిలోనే ఉంది. గో రక్షకుల పేరిట హిందూత్వ శక్తులు పెట్రేగిపోయి దాడులకు తెగబడ్డ ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. విచారణ సంస్థలు సహా రాష్ట్ర ప్రభుత్వ యంత్రంగం ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తుల్ని నీరుకార్చింది. ఆ సమయంలో వసుంధర రాజె రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలు యధేచ్ఛగా సాగాయి. మత ఘర్షణలను ఆపడం పేరుతో బుల్‌డోజర్లు పంపి 750 మంది ముస్లిం ప్రజల నివాస గృహాలను కూల్చేశారు. ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని గో రక్షకులు దాడులు చేశారు.

రాష్ట్రంలో మియో ముస్లింలు ప్రధానంగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. రాజస్థాన్, హర్యానా సరిహద్దు ప్రాంతాల్లో వీరు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. భారీ పరిశ్రమలు లేకపోవడం, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగాలు లభించకపోవడం వంటి కారణాలతో మియో ముస్లింలకు డెయిరీలపై ఆధారపడడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. 2018లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గో రక్షకుల దాడుల నుండి రక్షణ కల్పించేలా రెండు బిల్లులు రాజస్థాన్ మూకదాడుల నుంచి రక్షణ బిల్లు, స్వేచ్ఛగా మతాంతర వివాహాలు చేసుకునే బిల్లు తీసుకొచ్చింది. అయితే వీటికి కేంద్ర హోం శాఖ మోకాలడ్డింది. ఫలితంగా ఇప్పటి వరకూ రాష్ట్రపతి ఆమోదం లభించలేదు.మియో ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న తిజారా నియోజకవర్గంలో బీజేపీ వ్యూహాత్మకంగా ఫైర్‌బ్రాండ్ హిందూత్వ నేత, అల్వార్ ఎంపీ బాలక్ నాథ్‌ను బరిలో దింపింది. తిజారాలో ఎన్నికల పోరు అంటే భారత్-పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ వంటిదని బాలక్ తన ఎన్నికల ప్రచారంలో పదేపదే చెప్పుకొచ్చారు. బాలక్ నాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో బీజేపీకే చెందిన మరో నేత సందీప్ దేమా మాట్లాడుతూ గురుద్వారాలు, మదర్సాలను కూల్చివేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. సిక్కు సంస్థల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో సందీప్‌ను పార్టీ నుండి బీజేపీ బహిష్కరించింది. తన వ్యాఖ్యలపై ఆ తర్వాత ఆయన వివరణ ఇస్తూ మసీదులు, మదర్సాలు అనబోయి గురుద్వారాలు అన్నానని చెప్పారు. ఈ ఉదంతాలన్నీ బీజేపీ కరడుకట్టిన హిందూత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయంటూ ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ నేతలు మొసలి కన్నీరు కార్చారు. అయితే వారి మాటలకు, చేతలకు మధ్య ఎంతో తేడా ఉంది. ఆ పార్టీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల్లో గిరిజన ఉప ప్రాంత (టీఎస్పీ) ప్రణాళికలో 72.85%, ఎస్సీ-ఎస్టీ ప్రాంతంలో 76.63% మాత్రమే ఖర్చు చేసింది. ఈ విషయంలో కాంగ్రెస్ పనితీరు మెరుగ్గా ఉంది. ఆ పార్టీ టీఎస్పీలో 90.70%, ఎస్సీ-ఎస్టీ ప్రాంతంలో 89.74% ఖర్చు చేసింది. అంతేకాక ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అసెంబ్లీలో కొన్ని బిల్లులు కూడా ఆమోదించింది.

రాజస్థాన్‌లో 68.70 శాతం పోలింగ్

న్యూఢిల్లీ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకూ 68.70 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. 6 గంటల తరువాత క్యూలో ఉన్నవారికి ఓటింగ్‌కు వీలు కల్పించడంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, గవర్నర్ కలరాజ్ మిశ్రా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, ప్రతిపక్ష రాజేంద్ర రాథోర్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింగ్ సింగ్ డోటస్రా, విధాన సభ స్పీకర్, కాంగ్రెస్ నేత సీపీ జోషి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 200 అసెంబ్లీ స్థానాలకు గాను 199 అసెంబ్లీ స్థానాల్లో శనివారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలు కాగా, ఒకటి, రెండు రాళ్లు రువ్వుకున్న సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. సికార్‌లోని బోచివాల్ భవన్, ఫతేపూర్ షెఖావతి సమీపంలో రాళ్ల దాడి జరిగింది. గతేడాది 70 శాతం ఓటింగ్ జరిగింది. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 1862 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా, 5.29 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఈసారి 22.61 లక్షల మందికి ఓటు హక్కు లభించింది. 3 లక్షల మంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 51,890 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. 2,74,000 మంది ప్రభుత్వ సిబ్బంది పోలింగ్ విధులు నిర్వహించగా, 1,71,000 మంది పోలీసు, భద్రతా సిబ్బంది మోహరించారు. ఈసారి ఎన్నికల బరిలో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింగ్ సింగ్ డోటస్రా, విధాన సభ స్పీకర్, కాంగ్రెస్ నేత సీపీ జోషి తదితర హేమాహేమీలు ఉన్నారు. డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఎన్నికల బహిష్కరణ

జైపూర్ జిల్లాలోని పాలావాలా జతన్ గ్రామస్థులు ఆ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నికలను బహిష్కరించారు. ఒక్క ఓటరు కూడా పోలింగ్ బూత్ వైపు కన్నెత్తి చూడలేదు. తమ గ్రామాన్ని సమీపంలోని తూంగా గ్రామంతో కలుపుతూ రోడ్డు వేయాలని పాలావాలా జతన్ గ్రామస్తులు అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాలు, అధికారుల ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరించారు. ఉదయం నుంచి ఒక్క గ్రామస్థుడు కూడా ఓటు వేసేందుకు రాకపోవడంతో పోలింగ్ బూత్ వెలవెలబోయింది. అక్కడి అధికారులు తప్ప ఓటర్లలెవరూ కనిపించలేదు. ఇప్పుడే కాదు.. గత ఏడు పర్యాయాలు ఎన్నికలను బహిష్కరిస్తూనే ఉన్నారు.

మ్యాచ్ చూసే టైముంది... మణిపూర్ వెళ్లడానికి లేదా?

మోడీకి సీతారాం ఏచూరి సూటిప్రశ్న

- బీజేపీని ఓడించడమే మా లక్ష్యం
- నాలుగు రాష్ట్రాల్లో కాషాయపార్టీకి ప్రతికూల ప్రభావం
- ఖమ్మంలో సీటివ్వకుండా పొత్తు ఎలా సాధ్యం
- పొత్తు ఎందుకు కుదర్లేదో కాంగ్రెస్‌నే అడగాలి
- సుప్రీం తీర్పును గవర్నర్లు అమలు చేయాలి
- మోటార్లకు మీటర్లను వ్యతిరేకిస్తున్నాం
- అభ్యర్థులకే కాదు పార్టీల ఖర్చుపైనా పరిమితి ఉండాలి : టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ఆధ్వర్యంలో మీట్ ద మీడియా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్-ఆస్ట్రేలియా వన్డే ప్రపంచకప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి సమయమున్న ప్రధాని మోడీకి మణిపూర్‌కు వెళ్లడానికి తీరికలేదా?అని సీపీఐ(ఎం) అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సూటిగా ప్రశ్నించారు. దేశంలో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీట్ ద మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి కోసమే పనిచేస్తామని స్పష్టం చేశారు. నాలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ప్రతికూల ప్రభావముందని చెప్పారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నాయని వివరించారు. రాజస్థాన్‌లో పోటాపోటీ ఉంది కానీ బీజేపీ పట్ల వ్యతిరేకత ఉందన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల్లేవని విమర్శించారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ధరల పెరుగుదల ప్రభావం ప్రజల్లో తీవ్రంగా ఉందన్నారు. మోడీ ప్రభుత్వంలో ఎవరికీ జవాబుదారీతనం లేదన్నారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌కు అనుమతి ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. ఆ ఘటనకు బాధ్యత ఎవరు వహిస్తారని అడిగారు. మోడీ ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా ఈసీ నోటీసులు ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షాలకు మాత్రం వెంటనే నోటీసులు ఇస్తున్నదని చెప్పారు. తెలంగాణలో పొత్తు ఎందుకు కుదరలేదో కాంగ్రెస్‌నే అడగాలని అన్నారు. తమకు బలమున్న ఖమ్మంలో తమకు ఒక్క సీటూ ఇవ్వకుండా కాంగ్రెస్‌తో పొత్తు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అందుకే తాము 19 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నామని చెప్పారు. అయితే తాము పోటీ చేయని చోట బీజేపీని ఓడించే పార్టీలకు మద్దతు ఇస్తామనీ, స్థానిక కమిటీలు నియోజకవర్గాల వారీగా నిర్ణయం తీసుకుంటాయని స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) పొత్తు లేకుంటే నష్టం వస్తుందన్న భావనలో కాంగ్రెస్ లేదని చెప్పారు. రాష్ట్రంలో హంగ్ వస్తే బీజేపీ మద్దతును బీఆర్‌ఎస్ తీసుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా, తక్కువ సీట్లు వచ్చినా అధికారంలోకి వచ్చే చరిత్ర బీజేపీకి ఉందని విమర్శించారు. మోడీ కూటమిలో ఈడీ, సీబీఐ ఉన్నాయని వివరించారు. ఈడీ, సీబీఐ, ఈసీ కేంద్రం చేతిలో బందీ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామక కమిటీలో సుప్రీంకోర్టు సీజే స్థానంలో ప్రధాని మోడీ సిఫారసు చేసే మంత్రిని చేర్చడం సరైంది కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గవర్నర్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారని అన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై పరిమితి ఉందనీ, పార్టీల ఖర్చుపై పరిమితి లేదని చెప్పారు. అందుకే రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నాయని విమర్శించారు. జర్మనీ తరహాలో ప్రభుత్వమే అభ్యర్థులకు ఖర్చు చేసే నిధులను ఇచ్చే పద్ధతి రావాలన్నారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు. అసలు వాస్తవమేంటో త్వరలో బయటపడుతుందన్నారు. పోరాడాలంటే ఎర్రజెండా కావాలనీ, ఓటేసేందుకు మాత్రం వేరే పార్టీలను ప్రజలు ఎంచుకుంటున్నారని చెప్పారు. మోడీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని వివరించారు. మోటార్లకు మీటర్లను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, హెచ్‌యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే తెలంగాణకు విముక్తి

- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కేసీఆర్‌కు వేసినట్టే :బీజేపీ విజయ సంకల్పసభలో అమిత్ షా



నవతెలంగాణ - పటాన్‌చెరు/చౌటుప్పల్

రాష్ట్రంలో బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం నేత ఓవైసీ చేతిలో ఉన్నదని, దాన్నుంచి త్వరలోనే తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు, యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గాల్లో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలోనూ బీజేపీ గెలిస్తేనే దేశానికి భద్రత సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలిస్తే ఎంఐఎం వంటి మతోన్మాద శక్తులకు అవకాశం ఇచ్చినట్టే అవుతుందని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఓవైసీకి వేసినట్టేనని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి రాజ్యమేలుతోందని, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం పెరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలకు కేసీఆర్ సర్కారే కారణమన్నారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన ఘనత బీజేపీదేనని తెలిపారు. ఒక్క సారి ఓటేస్తే రెండు పనులు అవుతాయని, ఒక ఓటు ఎమ్మెల్యేకు వేసి మరో ఓటు మోడీకి వేసి ప్రధానమంత్రిని చేయాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లోకి వెళ్తారని తెలిపారు. ఈ రోడ్డు షోల్లో పటాన్‌చెరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్, మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు గోదావరి అంజిరెడ్డి, డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనలో రాష్ట్రం బంది

- బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా



నవతెలంగాణ- హుజూర్ నగర్

సకల జనులు ఏకమై సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.. కుటుంబ పాలనలో బంధి అయిందని బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా అన్నారు శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు. మత ప్రాతిపదికన నాలుగు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణమని తెలిపారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్ డబ్బులు విత్ డ్రా చేసుకునే మిషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేలకోట్ల నిధులతో అంచనా వేసిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం రూ.1.30 లక్షల కోట్లకు పెంచి కేసీఆర్ ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. దళిత బంధులో 30శాతం ఎమ్మెల్యేలు లంచాలుగా తీసుకున్నారని సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు యువతకు ఉపాధి, రైతులకు భరోసా బీజేపీ ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు.

హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ సిండికేట్ రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజు చంద్రశేఖర్, కర్నాటక ఎమ్మెల్సీ రవికుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి కిషోర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బొబ్బ భాగ్యరెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్ రెడ్డి, కిషోర్ రేలంగి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవరన్నా...తోడుగా మేమున్నాం

పాలకవర్గాలపై ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫైర్ | ఆర్టీసీ కార్మికుల్లో ధైర్యాన్ని నింపుతున్న వైనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కోటి ఆశలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ నష్టపోయిందీ, అవమానాలకు గురైందీ, ఆర్థికంగా వెనుకబాటుకు గురైంది అక్షరాలా ఆర్టీసీ కార్మికులే. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు రెండుసార్లు వేతన సవరణలు జరిగాయి. కానీ ఆర్టీసీ కార్మికులకు 8 ఏండ్లుగా జీతాలు పెరగలేదు. పైగా వారికి రావల్సిన బకాయిల్ని చెల్లించడంలో కూడా ప్రభుత్వం ఇప్పటికీ తీవ్ర నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తున్నది. ఆర్టీసీ కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నామని సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రకటించినా, కార్మికుల మోముల్లో సంతోషాలు వెల్లివిరియలేదు. కారణం స్వరాష్ట్రంలో తాము ఏవైతే రావాలని కోరుకున్నారో అవి ఇప్పటికీ వారికి అందలేదు. పైపెచ్చు ఆర్టీసీ బస్సుల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. ఏటా రిటైర్ అవుతున్న వారి స్థానాల భర్తీకి కొత్త రిక్రూట్‌మెంట్లు లేవు. డబుల్ డ్యూటీల పేరుతో ఉన్నవారిపైనే అదనపు పనిభారాలు మోపుతున్నారు. ఇలాంటి దశలో టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కార్మికుల్లో విశ్వాసం, ధైర్యం, నమ్మకం కలిగించేందుకు విశేష కృషి చేసింది. ప్రతి సమస్య పైనా కరపత్రాలను ముద్రించి, క్షేత్రస్థాయిలో కార్మికుల్ని చైతన్యవంతుల్ని చేసేలా కృషి చేసింది. ఆ కరపత్రాలు చదివి అర్థం చేసుకున్న కార్మికులు తమ తమ యూనియన్లలో ఆ సమస్యలపై మీరెందుకు మౌనంగా ఉంటున్నారు అని ప్రశ్నించే స్థితిని ఎస్‌డబ్ల్యూఎఫ్ కల్పించింది. కార్మికుల నుంచి వచ్చిన ఆ ఒత్తిళ్ల ఫలితంగానే 49,776 మంది ఆర్టీసీ కార్మికులు 2019 అక్టోబర్ 5 నుంచి నవంబర్ 29వ తేదీ వరకు జరిగిన చారిత్రాత్మక 52 రోజుల సమ్మెలో భాగస్వాములు అయ్యారు. ఈ సమ్మె విచ్ఛిన్నానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేయని ప్రయత్నంలేదు. ఉద్యోగాల నుంచి తీసేస్తాం అని బెదిరించినా, కార్మికులు ఐక్యంగా నిలిచి, ప్రభుత్వంపై పోరాటానికే 'సై' అన్నారు. సమ్మె ఎక్కడ సడలుతుందో అనే భయంతో పలుచోట్ల కార్మికులు ఆత్మార్పణలకూ పాల్పడ్డారు. ఆశ నిరాశల మధ్యే ఆ సమ్మెను కార్మికులు విరమించుకొనే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాతా వారిపై వేధింపులు తీవ్రస్థాయికి చేరాయి. అప్పుడూ కరపత్రాల రూపంలో వారికి ఎస్‌డబ్ల్యూఎఫ్ ధైర్యానిచ్చింది. తమ శక్తిమేరకు బహిరంగ ఆందోళనలు నిర్వహించింది. ఆర్టీసీలో కార్మిక సంఘాలే లేవు అని ప్రభుత్వం ప్రకటిస్తే, ఏ చట్టం ప్రకారం నిషేధిస్తున్నారో చెప్పండంటూ తన గళాన్ని వినిపించి, పాలకవర్గంపై ధిక్కార స్వరాన్ని పెంచింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని సీఎం కేసీఆర్ ప్రకటిస్తే, మాకు రావల్సిన రెండు వేతన సవరణలు, డిఏలు, పీఎఫ్, సీసీఎస్ సహా ఇతర బకాయిలు సొమ్ము సంగతేంటని నిలదీసింది. మును గోడు ఉప ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఓట్ల కోసం పడిన తాపత్రయం అంతా ఇంతా కాదు. చివరకు వేతన సవరణ చేస్తాం ...మాకు అనుమతి ఇవ్వండంటూ ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖరాసే పరిస్థితి ఏర్పడింది. ఆ ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థి విజయం సాధించాక, మళ్ళీ ఆర్టీసీ కార్మికుల ముఖం చూసేందుకు ప్రభుత్వం ప్రయత్నించలేదు. దీన్నీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎత్తిచూపింది. ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చిన్నచూపును ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు నిలదీస్తూ కార్మికుల్లో అదే పోరాట స్ఫూర్తిని నిలిపి ఉంచేందుకు శతధా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని ప్రకటిస్తే, విధివిధానాలపై చర్చ జరగాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ పట్టుపట్టింది. ప్రభుత్వ కమిటీలో కార్మిక సంఘా లకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈపీఎఫ్‌కు సంబం ధించిన అనేక అంశాల పై కార్మికులకు అవగాహన కల్పిస్తూనే, సంబంధిత విభాగాధిపతులకు లేఖలు రాస్తూ, కార్మికుల సంక్షే మం పట్ల తమకున్న చిత్తశుద్ధి, అంకితభావాన్ని వెల్లడి స్తూనే ఉంది. ప్రస్తుతం ఆర్టీసీలో కార్మికుల సంఖ్య 42,300 కి తగ్గింది. సమీప భవిష్యత్‌లోనూ ఖాళీ పోస్టుల్ని భర్తీ చేసే పరిస్థితులు కనిపించట్లేదని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఆ క్రమంలోనే కార్మిక సంఘాల మధ్య ఐక్యత, సమైక్య పోరాటాలకు బాటలు వేసే దిశగా ఎస్‌డబ్ల్యూఎఫ్ కృషి పెరుగుతూనే ఉన్నది.

చాలా పరిష్కారం కావాలి

కార్మికుల్లో ఉద్యమ చైతన్యం పెరుగుతున్నది. అదే సందర్భంలో పరిష్కారం కావల్సిన సమస్యలు అనేకం ఉన్నాయి. తాత్కాలికంగా కొన్ని సమస్యలు పరిష్కారం అయినా, అవి కార్మికులకు హక్కుగా రావల్సినవే. గడచిన 8 ఏండ్లలో ఆర్టీసీ కార్మికులు పడిన గోస అంతాఇంతా కాదు. ఇప్పటికీ ఆ వేధింపులు, శ్రమదోపిడీ కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికులు ఆర్థికంగా నష్టపోయి, మానసికంగా కుంగిపోతున్నారు. ఈ సమయంలో వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత కచ్చితంగా కార్మిక సంఘాలదే. మేం అదే పని చేస్తున్నాం. ఈ ప్రయత్నంలో అనేక సందర్భాల్లో సంస్థలోని అనేక సంఘాలు కూడా మాతో కలిసివస్తున్నాయి. అంతిమంగా మా లక్ష్యం కార్మికుల శ్రేయస్సు, సమాజంలో గుర్తింపు, గౌర వం. దానికోసం శక్తివం చన లేకుండా ప్రయ త్నిస్తూ నే ఉంటాం. ఐక్య పోరాటాలు ,విజయా ల కోసం నిరం తరం శ్రమి స్తూనే ఉంటాం.



వీఎస్ రావు, ప్రధాన కార్యదర్శి, టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్

అవినీతి, అప్పుల కుప్పగా తెలంగాణ

- కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటే
- బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాజ్య సమితి :యూపీ సీఎం యోగీ ఆథిత్యనాథ్



నవతెలంగాణ - కాగజ్‌నగర్/కాగజ్‌నగర్‌రూరల్/ వేములవాడ

సంపన్న రాష్ట్రం తెలంగాణ.. కేసీఆర్ పాలనలో అవినీతిలో కూరుకుపోయి అప్పుల కుప్పగా మారిందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో శనివారం రామరాజ్య స్థాపన సంకల్పసభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అంటే అవినీతి బంధువుల సమితి అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను కేసీఆర్ పక్కన బెట్టారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీ గెలవాలని, డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, వీరిద్దరి కామన్ ఫ్రెండ్ ఎంఐఎం అని తెలిపారు. యూపీలో ఒకే ఒక్క సీటు గెలిచిన బీఎస్పీ సిర్పూర్‌లో గెలుస్తుందా అని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. హరీష్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని, జనవరి 22 తర్వాత రామమందిర దర్శనానికి ఎమ్మెల్యే హరీష్‌తో వచ్చి రాముడి ఆశీర్వాదం పొందాలని తెలిపారు. అభ్యర్థి పాల్వాయి హరీష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, దోపిడీదారులకు అడ్డాగా సిర్పూర్‌ను మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తనను నియోజకవర్గ ప్రజలు ప్రతిపక్షంగా ఉండాలని తీర్పునిచ్చారని, నిస్వార్థసేవకై మీలో ఒకడిగా నిలబడ్డానని, ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.కరీంనగర్ జిల్లా వేములవాడ పట్టణంలో నిర్వహించిన సభలో యోగీ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ విదేశాల్లో మన ప్రతిష్టను పెంచారన్నారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాజ్యసమితి అని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ పేరుతో బీజేపీ అభ్యర్థులపై అక్రమంగా కేసులు పెట్టారని, బీజేపీ ప్రభుత్వం వచ్చాక అందరికీ జవాబు చెప్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో అద్భుతమైనవని కొనియాడారు. బీఆర్ఎస్ పాలనలో అమరుల త్యాగాలను పక్కనపెట్టారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతిపరులను జైలుకు పంపిస్తామన్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,290	▲	320
22 క్యారెట్లు	57,100	▲	300
కిలో వెండి	82,200	▲	1000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 82
రిటైల్ (లైవ్)	రూ. 104
స్కిన్‌తో	రూ. 151
స్కిన్‌లెస్	రూ. 172

రాజకీయ వ్యాపారం దేశానికే ప్రమాదం...

ప్రస్తుత పరిస్థితి ఎమర్జెన్సీ కంటే ఘోరం

విలువలు, సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాలకు పట్టంగట్టండి

- దేశ భవిష్యత్ కోసం చట్టసభల్లో వామపక్షాలుండాలి
- 'ప్రజాస్వామ్యం-ఎన్నికలు-సీపీఐ(ఎం) వైఖరి' సెమినార్‌లో సీతారాం ఏచూరి

ఖమ్మం నుంచి అచ్చిన ప్రశాంత్

దేశంలో రాజకీయాలన్నీ వ్యాపారమయంగా మారాయని సీపీఐ (ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలపై కొనసాగుతున్న దాడులు ఎమర్జెన్సీ కంటే తీవ్రంగా, ఘోరంగా ఉన్నాయని చెప్పారు. డబ్బు, మతం, కులం చుట్టూ రాజకీయాలను తిప్పుతూ బీజేపీ ముందుకుపోతున్నదని విమర్శించారు. ఎలక్ట్రోరల్ బాండ్లను లీగల్ చేయడమనేది రాజకీయ అవినీతేనని అన్నారు. రూ.వేల కోట్లు బీజేపీకి ఎక్కడ నుంచి వచ్చాయో ఎవరికీ తెలియదన్నారు. తద్వారా బ్లాక్‌మనీ కాస్తా వైట్ మనీ అవుతుందని చెప్పారు. విలువలు, సిద్ధాంతాలు, ప్రజలకు చేసిన సేవలేంటనే అంశాలు నేటి ఎన్నికల్లో చర్చనీయాంశం కావడం లేదని వాపోయారు.

ప్రస్తుత ఎన్నికల్లో సీపీఐ (ఎం) అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి విచ్చేసిన ఏచూరి... 'ప్రజాస్వామ్యం-ఎన్నికలు-సీపీఐ(ఎం) వైఖరి' అనే అంశంపై ఆ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన లౌకికత్వం, ఆర్థిక వృద్ధి, సామాజిక న్యాయం, ఫెడరలిజంపై దాడి పెద్ద ఎత్తున జరుగుతున్నదని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కొత్త కొత్త చట్టాలను తీసుకొస్తున్నారని గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లో బుల్డోజర్ పాలిటిక్స్ నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీల ఇండ్లు, వ్యాపార సముదాయాలపై దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. వారికి ఇచ్చే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని తెలిపారు. మోడీ విధానాలను ప్రశ్నించే వారిపై ఎన్‌ఐఏ కేసులు పెట్టి బెయిల్ కూడా రాకుండా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం చార్జిషీట్‌లు కూడా లేకుండా జైళ్లలో మగ్గేలా చేస్తున్నారని వివరించారు. జర్నలిస్టులను కూడా జైళ్లకు పంపుతున్నారని గుర్తు చేశారు.

మోడీ ప్రభుత్వ విధానాల వల్ల దేశ సంపద సంపన్నుల పాలవుతోందని ఏచూరి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రూ.400గా ఉన్న గ్యాస్ ధరను రూ.1,100కి పెంచి ఇప్పుడు రూ.200 తగ్గించి గొప్పలకు పోతున్న బీజేపీ తీరును ఆయన ఈ సందర్భంగా ఎండగట్టారు. దేశంలో మహిళలు, దళితులు, గిరిజనులపై దాడులు తీవ్రమవుతున్న వైనాన్ని వివరించారు. పార్లమెంట్‌లో చర్చలకు అసలు అవకాశమే ఉండటం లేదన్నారు. 11 నిమిషాల్లో 22 బిల్లులను పాస్ చేయడమేంటని ప్రశ్నించారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టుకు సంబంధించిన ఐదుగురు జడ్జీలు వెలువరించిన తీర్పునకు వ్యతిరేకంగా కేంద్రం ఏకంగా ఒక చట్టమే తెచ్చిందని చెప్పారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని సైతం దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి ఉండే సీపీఐ (ఎం) అభ్యర్థులను ఎన్నికల్లో ఆదరించాలని పిలుపునిచ్చారు. తద్వారానే దేశాన్ని రక్షించుకోగలుగుతామని విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో వామపక్ష ప్రజా ప్రతినిధులుంటేనే ప్రజల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని ఏచూరి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ... ఎన్నికల్లో సీపీఐ (ఎం) కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్, బూర్జువా, ధనస్వామ్యం నుంచి ప్రజలను రక్షించేందుకు వీలుగా, వారిని మరింతగా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. నలువైపుల నుంచి ఎదురవుతున్న ఆటుపోట్లను తట్టుకుని ధైర్యంగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ (ఎం) నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... నేటి డబ్బు రాజకీయాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలని కోరారు. పాలమూరులో స్వతంత్ర్య అభ్యర్థి బర్రెలక్కకి పెరుగుతున్న మద్దతు చూస్తే ఇంకా ప్రజాస్వామ్యం బతికే ఉందనిపిస్తోందని చెప్పారు. ఇలాంటి శక్తులన్నింటినీ సీపీఐ (ఎం) ఏకం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థి ఎర్రా శ్రీకాంత్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్‌రావు, నాయకులు ఎం.సుబ్బారావు, రమేశ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో 142 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్ కర్తార్ సింగ్‌ను కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. హర్యాన రాష్ట్రంలోని జింద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అమ్మాయిలపైన పాఠశాల ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడటం సభ్యసమాజం తలదించుకునేలా చేసిందని తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులు చెప్పుకోలేని విధంగా మానసికంగా, శారీరకంగా లైంగిక వేధింపులకు గురి వేయడం అత్యంత పాశవికచర్య అని విమర్శించారు. విద్యా బుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాలయంలో ఇటువంటి ఘటన జరగటం శోచనీయమని పేర్కొన్నారు. మహిళా కమీషన్లు, ప్రజాప్రతినిధులు ఈ విషయమై తగిన విధంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు, బాలికలకు భద్రత లేదని తెలిపారు.

రైతుబంధు అనుమతి తెచ్చారు...సరే

- దళిత, బీసీ,మైనార్టీ బంధు ఎందుకు తేలేదు
- సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రం నుంచి రైతు బంధు డబ్బులను రైతు ఖాతాల్లో జమ చేసేందుకు అనుమతి తెచ్చారు...సరే దళిత, బీసీ, మైనార్టీ బంధుకు ఎందుకు తీసుకరాలేదని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. 2023 ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 15లోగా రైతు బంధు వేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని కోరినట్టు తెలిపారు. కానీ పోలింగ్ నాలుగు రోజులు ఉండగా రైతు బంధు విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ పరిణామాలను ప్రజలు గమనించాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రసంగాలకు, జరుగుతున్న తతంగాలకు పోలిక లేదన్నారు. కాంగ్రెస్ గెలుస్తుందనే టాక్ నేపథ్యంలోనే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేలను కొనే చరిత్ర కేసీఆర్‌ది

రైతులకు ఎన్ని గంటలు కరెంటు కావాలో ఆ రాష్ట్రానిదే నిర్ణయం

కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఎమ్మెల్యేలను కొనే చరిత్ర సీఎం కేసీఆర్‌దేనని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమర్శించారు. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని విజయం సాధించారని తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు దేశానికి కవలపిల్లలు అన్నారు. వేరే పార్టీలు ఎమోషన్స్‌తో పాలిటిక్స్ చేస్తాయన్నారు. కర్నాటకలో పాలన సెక్రటేరియట్ నుంచి నడిస్తే, తెలంగాణలో మాత్రం పాలన ఫామ్ హౌజ్ నుంచి నడుస్తోందన్నారు. రైతులకు ఎన్ని గంటల కరెంట్ కావాలో ఆ రాష్ట్రానిదే నిర్ణయమన్నారు. కర్నాటకలో రైతులు ఐదారు గంటలు సరిపోతుందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో విలేకర్లతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. ప్రపంచమంతా తెలంగాణ ఎన్నికల వైపు చూస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లో తాను తిరిగాననీ, ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు.కాంగ్రెస్ ప్రజల జీవితాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేస్తాయన్నారు. తెలంగాణ విషయంలో కర్నాటక హృదయంతో ఆలోచిస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ వస్తే, సీఎం అభ్యర్థి విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారు.'చంద్రబాబు, వైఎస్సార్ హైదరాబాద్ అభివృద్ధి కోసం పాటు పడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌కు రిక్వెస్ట్... కర్నాటక విషయాలు తెలుసుకోండి. అరగంటలో కర్నాటక వచ్చి అక్కడ అమలవుతున్న పథకాల గురించి తెలుసుకోవచ్చు. కర్నాటక ప్రజలకు ఐదు గ్యారంటీలు అమలు అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేషనల్ పార్టీ. మా పార్టీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో అవసరం ఉంటుంది. రాష్ట్ర ప్రజలకు అనుగుణంగా పథకాలు ఉంటాయి. రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానంటూ కేసీఆర్ మాట తప్పారు. కర్నాటక రైతులకు మేం ఉచిత కరెంట్ ఇవ్వడం ప్రారంభించాం. తెలంగాణతో పోల్చితే కర్నాటక పెద్ద రాష్ట్రం. కరెంట్ విషయంలో తెలంగాణ కంటే మేం మెరుగ్గా ఉన్నాం. కేసీఆర్ ఒక అబద్ధాల కోరు' అని డీకే పేర్కొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ జాయిట్ కన్వీనర్‌గా సూర్యనాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా పార్టీ సీనియర్ నేత సూర్యనాయక్‌ను నియమిస్తూ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయనతోపాటు వాసుదేవరెడ్డి, సయ్యద్ ఖైసర్, పృధ్వినాయక్‌లను నియమించారు.

కాంగ్రెస్ హయాంలో.. మైనార్టీలకు ధోకా

- తల నరుక్కుంటాం కానీ ఢిల్లీకి గులాం కాబోం
- కేసీఆర్ పక్కా లోకల్ : రోడ్ షోల్లో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-కంఠేశ్వర్/భిక్కనూర్

కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, జైన్లు అందరూ సంతోషంగా ఉన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కేసీఆర్ మైనారిటీల సంక్షేమానికి రూ.12,780 కోట్లు ఖర్చు చేస్తే 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ రూ.930 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది." అని మంత్రి కేటీఆర్ తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంతో పాటు కామారెడ్డి నియోజకవర్గం భిక్కనూర్‌లో శనివారం రోడ్‌షోలో పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ రెండూ ఒకటేనని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, కానీ ఇప్పటి వరకు కేసీఆర్ బీజేపీతో పొత్తు పెట్టుకోలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ గొంతు నిక్కాలని మోడీ-షా చూస్తున్నారని, తాము వాళ్లకు భయపడేదీ లేదని తెలిపారు. తల నరుకుంటాం కానీ ఢిల్లీ వాళ్లకు మెడ వంచబోమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి లాభం కలుగుతుందన్నారు.

కామారెడ్డినియోజకవర్గం భిక్కనూర్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి ఇస్తున్న సలాకా సిమెంట్‌లకు ఓట్లు రావన్నారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు కేసీఆర్ నాన్ లోకల్ కాదని, కోనాపూర్ గ్రామం ఆయన తల్లిగారి ఊరైనని, లోకలేనని తెలిపారు. నాయకులకు పైసలు ఆశ చూపి కొనుక్కోవడం రేవంత్ రెడ్డికి అలవాటేనని, రూ.50 లక్షలతో దొరికిన దొంగకు కామారెడ్డి ఓటర్లు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజలు తరిమికొడితే కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, అక్కడ చెల్లని రూపాయి కామారెడ్డిలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసిన కామారెడ్డి జిల్లా ప్రజలు తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కామారెడ్డి జిల్లాను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

మంత్రి కేటీఆర్‌కు ఈసీ నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు (కేటీఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసులు ఇచ్చింది. ఈనెల 20వ తేదీ హైదరాబాద్‌లోని 'టీ వర్క్స్'లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులతో మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. ఉద్యోగార్థులంతా మెట్లపై కూర్చుని ఉండగా, వారికి దిగువన మంత్రి కేటీఆర్ కూర్చుని ఉన్న ఫోటో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీనిపైనే కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్యాలయం అయిన టీ వర్క్స్‌ని మంత్రి ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారనీ, ఉద్యోగాల సంఖ్యను పెంచి, భర్తీచేస్తామని హామీ ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది కచ్చితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కిందికే వస్తుందనీ, అందువల్ల మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును పరిశీలించి, ప్రాథమిక దర్యాప్తు జరిపిన ఎన్నికల సంఘం ఈ అంశం ఎన్నికల ప్రవర్తనా నియమావళి కిందికే వస్తుందని భావిస్తూ మంత్రి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలలోపు నోటీసులకు సమాధానం ఇవ్వాలని కోరింది.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-బాల్కొండ



(ఫైల్)

పదో తరగతి విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.గోపి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివరాత్రి రిబిక(17) సెయింట్ ఎలిజబెత్ స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. పదేండ్ల క్రితమే ఆమె తల్లిదండ్రులు చనిపోగా.. అప్పటి నుంచి తన పిన్ని దగ్గర ఉంటూ చదువుకుంటున్నది. తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ మానసిక వేదనతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆమె పిన్ని తెలిపారు. పిన్ని శివరాత్రి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

టీఎంసీ ఎంపీ మహువ మొయిత్రీపై సీబీఐ దర్యాప్తు షురూ..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారానే ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్ర చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. లోక్‌పాల్ ఆదేశాలపై ఆమెపై ప్రాథమిక దర్యాప్తును సీబీఐ ప్రారంభించింది. దర్యాప్తు ఆధారంగా మొయిత్రపై క్రిమినల్ కేసు నమోదు చేయాలా వద్దా అనేది లోక్‌పాల్ నిర్ణయిస్తుంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కేసులో నిందితురాలిని (మొయిత్రీ) సీబీఐ అరెస్టు చేయడం కానీ, సోదాలు జరపడం కానీ చేయరాదు. సమాచారం అడగడం, డాక్యుమెంట్ల పరిశీలన, మొయిత్రీని ప్రశ్నించే అధికారం ఉంటుంది. లోక్‌పాల్ ఆదేశానుసారం దర్యాప్తు ప్రారంభించినందున ఇందుకు సంబంధించిన నివేదికను కూడా లోక్‌పాల్‌కు సీబీఐ సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంత్ దేహాద్రయి సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆయన బీజేపీ ఎంపీ నిషాకాంత్ దుబేకి కూడా ఫిర్యాదు చేయడంతో ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా దృష్టికి తీసుకురావడం, ఆయన ఎథిక్స్ కమిటీకి అప్పగించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నారు. దుబే సైతం లోక్‌పాల్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు.

గుజరాత్, మహారాష్ట్రకు ఎల్లో అలర్ట్

న్యూఢిల్లీ:దేశంలోని పలు రాష్ట్రా ల్లో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. గుజరాత్, మహారాష్ట్ర తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. వచ్చేవారం దక్షిణ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.

పట్టాలు తప్పుతోంది..!

విశ్వసనీయత కోల్పోతున్న భారతీయ రైల్వేలు

దేశంలోనే అతి పెద్దదైన భారతీయ రైల్వే వ్యవస్థ పట్టాలు తప్పుతోంది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. నిధుల దుర్వినియోగం, లాభాలు ఆర్జించడంలో అసమర్థత వంటి ఆరోపణలతో కూనారిల్లిపోతోంది. గతంలో ఏ రైలులో చూసినా జనరల్, స్లీపర్ బోగీలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఆ వాతావరణం మచ్చుకైనా కన్పించడం లేదు. సంపన్నులు, ఎగువ మధ్యతరగతి ప్రజలు వినియోగించే ఏసీ బోగీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. సామాన్యులు ఉపయోగించే జనరల్, స్లీపర్ బోగీల సంఖ్య తక్కువగా ఉండడంతో అవి కిటకిటలాడుతున్నాయి. ఇక నిర్వహణ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రమాదాలు సరేసరి. దేశ చరిత్రలోనే అత్యంత భయానకమైన బాలాసోర్ ప్రమాదం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది.

నిధుల దుర్వినియోగం, అసమర్థతతో కుదేలు

- శాపంగా మారిన నిర్వహణ లోపం
- ఆందోళనకరంగా ఆర్థిక పరిస్థితి



న్యూఢిల్లీ : భారతీయ రైల్వేల పనితీరు పేలవంగా ఉండడానికి ప్రధానంగా ఐదు కారణాలు కన్పిస్తున్నాయి. కాగ్ నివేదిక ప్రకారం 2021-22లో రైల్వేల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దాని నిర్వహణ నిష్పత్తి 107.39%కి చేరుకుంది. దీని అర్థం ఏమంటే వంద రూపాయలు సంపాదించడానికి రైల్వేలు రూ.107కు పైగా ఖర్చు చేస్తున్నాయి. ఈ పరిస్థితికి కోవిడ్ కారణమని చెప్పి తప్పించుకునేందుకు ప్రారంభంలో రైల్వేలు ప్రయత్నించాయి. వాస్తవానికి కోవిడ్‌కు ముందు... 2016లోనే నిర్వహణ నిష్పత్తి దారుణంగా ఉంది. అప్పటి నుండి అది వంద శాతానికి చేరువలోనే కొనసాగింది. మిగులు ఆదాయాన్ని పొందడంలో రైల్వేలు ఘోరంగా విఫలమయ్యా యని ఆ శాఖ ఖాతా పుస్తకాలు పరిశీలిస్తే అర్థమవుతుంది. మిగులు మాట అటుంచి పరిస్థితి లోటులోకి దిగజారిపోతోంది.

పక్కదారి పడుతున్న నిధులు

రైల్వే శాఖలో నిధుల దుర్వినియోగం జరుగుతోందని కాగ్ ఎత్తిచూపింది. గత సంవత్సరం డిసెంబరులో కాగ్ విడుదల చేసిన మరో నివేదిక ఏం చెప్పిందంటే....రైల్వేలో భద్రత కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం 2017లో రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ (ఆర్ఆర్ఎస్‌కే) పేరిట ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. అయితే రైల్వేలో భద్రత కోసం ఉద్దేశించిన ఈ నిధి పక్కదారి పట్టింది. ఈ నిధిని ఫుట్ మసాజర్లు, పాత్రలు, ఎలక్ట్రికల్ వస్తువులు, ఫర్నీచర్, చలి కోట్లు, కంప్యూటర్లు, ఎస్కలేటర్ల కొనుగోలుకు వినియోగించారు. అంతేకాదు...పూల తోటల అభివృద్ధికి, మరుగుదొడ్ల నిర్మాణానికి, జీతాలు, బోనస్‌ల చెల్లింపునకు, చివరికి జెండాల ఏర్పాటుకు కూడా ఖర్చు చేశారు. ప్రతి సంవత్సరం ఈ నిధికి రూ.20 వేల కోట్లు జమ చేయాల్సి ఉంటుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు, రైల్వే ఆదాయం నుండి రూ.5 వేల కోట్లు జమ చేస్తారు. అయితే గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో రైల్వే శాఖ తన వాటాగా కేవలం రూ.4,225 కోట్లు మాత్రమే సమకూర్చింది. దీంతో రూ.15,775 కోట్ల లోటు ఏర్పడింది.

గుదిబండగా మారిన పాత ఆస్తులు

రైల్వేలో నిర్వహణ అధ్వాన్నంగా ఉంటోంది. కాగ్ నివేదిక ప్రకారం రైల్వేలో రూ.94,873 కోట్ల విలువైన పాత ఆస్తులు ఉన్నాయి. ఈ మొత్తాన్ని తరుగుదల రిజర్వ్ నిధి నుండి పొందాల్సి ఉంటుంది. ఇందులో 60% నిధులు అంటే రూ.58,459 కోట్లు పట్టాల నవీకరణకు అవసరమవుతాయి. అయితే ఇందుకోసం రూ.671.92 కోట్లు అంటే 0.7% నిధుల్ని మాత్రమే వెచ్చించారు. 2015లో ప్రభుత్వం ఓ శ్వేతపత్రం విడుదల చేసింది. దీని ప్రకారం ప్రతి సంవత్సరం 4,500 కిలోమీటర్ల మేర పట్టాలను ఆధునీకరించాల్సి ఉంటుంది. అయితే అప్పటి నుండి 2021-22 వరకూ ఏ ఒక్క సంవత్సరంలోనూ ఆ పని జరగలేదు.

సత్తతో పోటీ పడుతూ...

రైళ్ల రాకపోకల విషయంలో సమయపాలన గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. 2012-13లో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సమయపాలన 79% ఉంటే 2018-19లో 60.23%కి పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్యాసింజర్ రైళ్ల సగటు వేగం గంటకు ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువే తగ్గింది. సరకు రవాణా రైళ్ల వేగం కూడా గంటకు ఆరు గంటలు తగ్గింది.

తగ్గుతున్న జనరల్, స్లీపర్

రైల్వే శాఖ ఓ పద్ధతి ప్రకారం అనేక రైళ్లలో స్లీపర్, సెకండ్ క్లాస్ బోగీల సంఖ్యను తగ్గించివేస్తోంది. వాటి స్థానంలో ఏసీ బోగీలను ప్రవేశపెడుతోంది. దీనివల్ల జనరల్ బోగీల్లో ప్రయాణించే వారు నరకం అనుభవించాల్సి వస్తోంది. ఈ బోగీల్లో సీటు సంగతి అటుంచితే కనీసం నిలబడడానికి కూడా ఖాళీ ఉండడం లేదు. పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలు ఏసీ బోగీల్లో ప్రయాణించే పరిస్థితి లేదు. ఆ బోగీల్లో ఛార్జీలు వారికి అందుబాటులో ఉండవు. ఇలాంటి వారి కోసం రైల్వేలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు.

జనరల్ టిక్కెట్ ఉన్న వారు రిజర్వేషన్ బోగీల్లో ప్రవేశించి ప్రయాణించడం సర్వసాధారణమైపోయింది. మధ్య, ఉత్తర, పశ్చిమ రైల్వే జోన్లలో రైళ్లలో ఏసీ బోగీల సంఖ్య బాగా పెరుగుతోంది. దక్షిణ, తూర్పు రైల్వే జోన్లలో పెరుగుదల ఆ స్థాయిలో లేదు. నాన్-ఏసీ బోగీల సంఖ్యను తగ్గించడంతో పాటు కోవిడ్ తర్వాత అన్-రిజర్వ్‌డ్ జన్ సాధారణ్ రైళ్లను పూర్తిగా నిలిపివేయడంతో సాధారణ ప్రయాణికుల కష్టాలు అధికమయ్యాయి. దీంతో ఏ రైలు చూసినా కిక్కిరిసిపోతోంది. లాభాలు లేనందునే జన్ సాధారణ్ రైళ్లను నిలిపివేశామని రైల్వే శాఖ చెబుతోంది.

అభ్యర్థులు అయోమయం..



అంతుచిక్కని ఓటరు నాడి

- తలపట్టుకుంటున్న లీడర్లు
- అన్ని పార్టీల సభలకూ జనం
- రోజుకో రకంగా మారుతున్న సమీకరణాలు
- సామాజిక తరగతుల వారిగా కేంద్రీకరణ
- ఓట్ల బదిలీపై ఎవరి లెక్కలు వారివే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిల బడ్డ ప్రధాన పార్టీల అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ.. సన్నిహితుల దగ్గర తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఫలానా సామాజిక తరగతి పెద్దలు ఏమను కుంటు న్నారో.. తెలుసుకోవాలని వేగులను పంపుతున్నారు. కానీ ఓటర్లు ఎవరిని కనిక రించబోతున్నారన్న విష యం తలపండిన రాజకీయ విశ్లేషకులకు కూడా ఏ మాత్రం అంతు చిక్కటం లేదు. అన్ని పార్టీల సభ లకూ జనం వస్తుండటంతో అభ్యర్థులు గందర గోళ ం పడుతు న్నారు. లీడర్లు తలప ట్టుకు ంటున్నా రు.గడిచి న పదేండ్లుగా అధికా రంలో ఉన్న బీఆం్‌ఎస్ పార్టీపై పైకి వ్యతిరేకత బాగా నే కన్పిస్తు న్నా అది విపక్షాలకు ఓట్లుగా బదిలీ అవుతుందా..? లేదా అన్నది ఎవరికీ అంతుపట్టని విషయంగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు అనే అంచనాలు ఉన్నప్ప టికీ.. ఆయా నియోజక వర్గాల్లో ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ వల్ల ప్రధాన పార్టీలు ఆందోళన చెందు తున్నాయి. వీరి పోటీవల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం అనే చర్చతో పాటు, గ్రామాల్లో ఏ సామాజిక తరగతి ఓట్లు ఎవరికి వేస్తారో లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాల్లో ఒక్కోచోట ఒక్కోరకమైన సమీకరణలు చోటు చేసుకుంటుండటంతో ఫలాన పార్టీది పైచేయిదిగా ఉండవచ్చని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డిలోని కొన్ని నియోజకవర్గాల్లో ఈ దఫా ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు పోటీగా సీపీఐ(ఎం)కు అనూహ్యంగా మద్దతు చేకూరుతున్నట్టు తెలుస్తున్నది.

సామాజిక సమీకరణలపైనే అందరి దృష్టి..

సామాజిక సమీకరణల మీదనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తరగతుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఆయా నేతలు వాగ్దానాలు చేస్తున్నారు. వారి ఓటు బ్యాంకును తమ వైపునకు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ కులం ఓట్లు ఎక్కువగా పడుతున్నాయో గమనించి, ఆ తరగతిలో చీలిక తీసుకురావటం ఎలాగనే దానిపై బీఆర్‌ఎస్ ఎత్తులు వేస్తోందని చర్చించుకుంటున్నారు. ఏబీసీడీ వర్గీకరణ, ముస్లిం రిజర్వేషన్లు తదితర అంశాలను తెరమీదకు తీసుకు వస్తున్నారని మాట్లాడుకుంటున్నారు. బీసీ ముఖ్యమంత్రి వాగ్దానంతో ఆయా తరగతుల్లో చీలిక తీసుకొచ్చేందుకు బీజేపీ ఎత్తులు వేస్తున్నదని తెలుస్తున్నది. మరోపక్క అధికార పార్టీకి ఉపయోగపడేలాగా ఎంఐఎం పావులు కదుపుతున్నది.

పోరాటాలే.. ప్రచారాస్త్రాలు..

మరోవైపు రాష్ట్రంలో సీపీఐ(ఎం) 19 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. ఆయా నియోజక వర్గాల్లో హెూరాహెూరీగా ప్రచారం సాగుతుండటంతో ఈ మూడు పార్టీల మధ్య సమీకరణలు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పటికిప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రజల దైనందిన సమస్యలపై నిరంతరం ఆ పార్టీ, ప్రజాసంఘాలు సాగించిన ఉద్యమాలు, పోరాటాలే సీపీఐ(ఎం) అభ్యర్థులు, నేతలు ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంటున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులు ఏ ఒక్కరూ గెలవటానికి వీలు లేకుండా తగిన విధంగా రాజకీయ ఎత్తుగడలతో పావులు కదుపుతున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు, తద్వారా ప్రజల మధ్య అనైక్యత, దేశ సమగ్రతకు వాటిల్లబోయే ప్రమాదాన్ని ఈ సాధారణ ఎన్నికలకు రాజకీయ ప్రచార వేదికలుగా ఉపయోగించుకుంటున్నారు.

రాష్ట్రంలో మైనార్టీ, దళిత, గిరిజన ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉంటుందన్నది అత్యంత కీలకంగా మారింది. వాస్తవానికి ఈ సామాజికవర్గ ఓటర్లు గడిచిన రెండు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వైపు నిలుస్తూ వచ్చారు. కానీ ఈ దఫా చీలకవచ్చే పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది. అయితే మొత్తం సమీకరణలను పరిగణలోకి తీసుకున్నపుడు బీజేపీకి లబ్ది చేకూరే అవకాశాలున్నచోట మాత్రం మైనార్టీ ఓటర్లు ఏకీకృతం అయి అక్కడ ఆ పార్టీని ఓడించగలిగే శక్తి వైపు మొగ్గే అవకాశాలున్నాయని తెలుస్తున్నది.

ఈ నాలుగు రోజులు కీలకం..

ఎన్నికల పర్వంలో రాబోయే నాలుగు రోజులు అత్యంత కీలక సమయం అని చెప్పక తప్పదు. ఇప్పటికే ప్రచారంలో నువ్వా.. నేనా అన్నట్టు తలపడుతున్న రాజకీయపార్టీలు రాబోయే ఆరు రోజుల్లో సామాజిక సమీకరణలు సమూలంగా మార్చివేసే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలుస్తున్నది. చివరి దశలో సానుకూల ప్రతికూల ఓటింగ్ సమీకరణలు పూర్తిగా మారిపోయే పరిస్థితులు ఉండవచ్చని భావిస్తున్నారు. అధికారపార్టీ, కాంగ్రెస్ పార్టీల మధ్య మ్యానిఫెస్టో వార్ తారాస్థాయికి చేరిన దరిమిలా ఓటర్లను ఏ పార్టీ ఆకట్టుకోగలిగితే ఆ పార్టీ వైపు సమీకరణలు మారే అవకాశం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా చివరి రెండ్రోజుల్లో అభ్యర్థులు ఇచ్చే తాయిలాలు ఓటర్లను ప్రభావితం చేయవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో ఈ ఆరు రోజులు అన్ని పార్టీలకు అత్యంత కీలకం అని చెప్పాలి.

వైవిధ్యంతో.. సమాజంలో అనైక్యత

ఆర్‌ఆర్‌ఎస్ నాయకుడి విడ్డూర వ్యాఖ్యలు

బ్యాంకాక్: 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతదేశ స్ఫూర్తికి భిన్నంగా.. ఆర్‌ఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే విడ్డూర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో సహా అనేక దేశాల్లో వైవిధ్యం అనైక్యతకు దారి తీసిందని అన్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్న 3వ ప్రపంచ హిందూ మహాసభలో దత్తాత్రేయ హోసబాలే ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ప్రపంచవ్యాప్తంగా హిందూ సంస్థలను బలోపేతం చేయడం అత్యవసరని అన్నారు. భాషలు, వర్గాలు, కులాలు, ఉపకులాలు, గురువులు ఆధారంగా ప్రపంచంలో అనేక సంఘాలు, సంస్థలు, ఫోరంలు ఏర్పాటయ్యాయని, ఇవన్నీ కూడా తమ తమ కార్యక్రమాలతో సమాజంపై 'సమ్మెట దెబ్బలు' వేసారని హోసబాలే తెలిపారు. 'ఇలాంటి సంస్థలతో హిందూ తన ఉనికి కోల్పోయింది. ఎప్పుడూ కూడా భారీ లక్ష్యాన్ని విస్మరించకూడదు. అనేకసార్లు హిందూ సమాజంలోని వైవిధ్యం అనేక చోట్ల అనైక్యతకు దారి తీసింది' అని హోసబాలే అన్నారు. 'హిందూ సమాజం యొక్క స్వరాన్ని మరింత బలంగా వినిపించడానికి వైరుధ్యాలను, బేధాలను తొలగించాలి' అని తెలిపారు. ఇందుకు హిందూ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మతమార్పిడి, హిందువుల మానవ హక్కులను అణచివేయడం, ప్రాంతీయ భాషల్లో హిందూ సాహిత్యం లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించడానికి కూడా హిందూ సంస్థలు పనిచేయాలని అన్నారు. బ్యాంకాక్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ హిందూ మహాసభ జరగనుంది. 60 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. "హిందూధర్మంలోని మొదటి పదం 'హిందూ' హద్దులు లేనిది.. సనాతనం, శాశ్వతమైనది. ధర్మం మనల్ని నిలబెట్టేది' అని ప్రతినిధులు తెలిపారు. 'ఇజం'తో కూడిన హిందూయిజం దీనికి పూర్తిగా భిన్నమైనదని చెప్పారు. ఈ కారణంగానే పూర్వీకులు 'హిందుత్వ' అనేవారని, తామందరం దీనితో ఏకీభవిస్తున్నట్టు పేర్కొన్నారు. సనాతన ధర్మం నిర్మూలించాలని ఇటీవల తమిళనాడులోని డీఎంకె నాయకులు చేసిన ప్రకటనలు సంచలనం సృష్టించిన నేపథ్యంలో హిందూ మహాసభ ఇలాంటి తీర్మానం చేయడం విశేషం. ఈ మహాసభలో ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షులు మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. భౌతికవాదం, కమ్యూనిజం, పెట్టుబడిదారీ ప్రయోగాలతో సతమతం అవుతున్న ప్రపంచానికి భారతదేశం సంతోషానికి, సంతృప్తికి బాట చూపిందని చెప్పారు.

అమెజాన్ కార్మికుల ఆందోళన

- పలు డిమాండ్లతో బ్లాక్ ఫ్రైడే

న్యూఢిల్లీ : అమెజాన్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. 'మేక్ అమెజాన్ పే' పేరిట ప్రపంచ దేశాల్లో చేపట్టిన నిరసనల్లో భాగంగా మన దేశంలో కూడా బ్లాక్ ఫ్రైడే పాటించారు. యూఎన్‌ఐ గ్లోబల్ యూనియన్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ పిలుపు మేరకు 80 సంఘాలు, పౌర సమాజ సంస్థలు, పర్యావరణవేత్తలు ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని, సంఘాల్లో చేరే హక్కును గౌరవించాలని డిమాండ్ చేశారు. పన్నులు సక్రమంగా చెల్లించాలని, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కర్తవ్యాలను నెరవేర్చాలని కూడా వారు తమ ప్రచారోద్యమంలో డిమాండ్ చేశారు. న్యూఢిల్లీ, పాట్నా, వారణాసి, ముంబయి, కోల్‌కతా, ఔరంగాబాద్, రుషీకేశ్, ఆగ్రా, భోపాల్, కొల్హాపూర్ తదితర ప్రాంతాల్లో అమెజాన్ కార్మికులు నిరసన తెలిపారు. తమ మానసిన, శారీరక బాగోగులను అమెజాన్ సంస్థ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది దేశాల్లో యూఎన్‌ఐ గ్లోబల్ యూనియన్ చేపట్టిన సర్వే ప్రకారం... అమెజాన్ సంస్థ జరుపుతున్న పర్యవేక్షణ కారణంగా తమ మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటోందని యాభై శాతం మంది కార్మికులు



ఫిర్యాదు చేశారు. అమెజాన్ గిడ్డంగిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మాట్లాడుతూ 'పని ఒత్తిడి విపరీతంగా ఉంటోంది. రోజుకు పది గంటలు పని చేయాలి. ఆ సమయంలో నిలుచునే ఉండాలి. గంటకు 150 పెద్ద వస్తువుల్ని ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. అది మా టార్గెట్. ఒకవేళ గంటలో ఆ పని చేయకపోతే అధికారులు మాపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయాలని అడుగుతారు. మధ్యలో ఎలాంటి విరామాలు ఉండడం లేదు. లక్ష్యాన్ని చేరుకోకపోతే వాష్‌రూమ్‌కి కూడా వెళ్లనివ్వరు. తోటి కార్మికులతో మాటా మంతి ఉండదు. కనీసం ఫోన్‌లో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరు' అని వాపోయారు. సమాన వేతన విధానాన్ని అమలు చేయాలని, 2030 నాటికి ఉద్గమనాలను పూర్తిగా నివారించాలని, వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని పనిలో లక్ష్యాలను నిర్దేశించాలని, ప్రమాదాలకు గురైతే నష్టపరిహారం అందజేయాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని అమెజాన్ ఇండియా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు వరుసగా నాలుగు సంవత్సరాల నుండి బ్లాక్ ఫ్రైడేను పాటిస్తున్నారు. అమెజాన్ విధానాలను నిరసిస్తూ ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో సమ్మె కూడా చేస్తున్నారు. బంగ్లాదేశ్‌లో వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు అమెజాన్ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు.

కొచ్చిలో విషాదం

- తొక్కిసలాటలో నలుగురు విద్యార్థులు మృతి
- మరో 50 మందికి గాయాలు

కొచ్చి : కేరళలోని కొచ్చి విశ్వవిద్యాలయంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. క్యాంపస్‌లో సాయంత్రం టెక్ ఫెస్ట్ నిర్వహిస్తుండగా వర్షం కురియటంతో తొక్కిసలాట జరిగి నలుగురు విద్యార్థులు చనిపోయారు. మరో 50 మంది గాయపడ్డారు. మృతులందరూ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. చనిపోయిన వారిలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారు. క్షతగాత్రులను కలమస్సేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం..విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగిన టెక్ ఫెస్ట్ కార్యక్రమంలో రాత్రి 7 గంటలకు వర్షం కురవడంతో ఈ తొక్కిసలాట జరిగింది. వర్షంలో తడవకుండా ఉండడానికి విద్యార్థులు లోపలి వైపు ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగిందని పేర్కొన్నారు. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ నిఖితా గాంధీ



లైవ్ కాన్సర్ట్‌ను వీక్షించేందుకు విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో అత్యున్నత సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన విషాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోందని విజయన్ అన్నారు. మృతి చెందిన నలుగురు విద్యార్థుల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా సూచనలు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని కూడా స్పష్టం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు పరిస్థితిని నేరుగా అంచనా వేసేందుకు, కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు కొచ్చి బయలుదేరి వెళ్లారు. అలాగే, సంతాపాన్ని తెలియజేసేందుకు మంత్రులు అత్యవసరంగా సమావేశమయ్యారు. విద్యార్థులు మరణించడంతో సంతాప సూచకంగా ఆదివారం జరగాల్సి ఉన్న నవకేరళ సంబంధించిన వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేశారు. కోజికోడ్‌లో శనివారం రాత్రి ప్రభుత్వం అతిథి గృహంలో ఈ సమావేశం జరిగింది.

కలమస్సేరిలో ప్రత్యేక వైద్య శిబిరం

యూనివర్సిటీలో తొక్కిసలాట విషాదం నేపథ్యంలో ఎర్నాకులం జిల్లాలోని కలమస్సేరి మెడికల్ కాలేజీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. దీని కోసం వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ఇప్పటికే అక్కడకి చేరుకున్నారని చెప్పారు. తదుపరి ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ డైరెక్టర్, వైద్య విద్యాశాఖ డైరెక్టర్‌లను ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రులు కూడా సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. భారీ సంఖ్యలో 108 అంబులెన్స్‌లను సిద్ధం చేయాలని కూడా ఆదేశించారు. త్రిసూర్ మెడికల్ కాలేజీకి చెందిన సర్జరీ, ఆర్థోపెడిక్స్ విభాగానికి చెందిన వైద్యుల బృందం త్వరలో ఎర్నాకులం చేరుకోనున్నట్టు మంత్రి తెలిపారు.

హస్తం గుర్తుకు ఓటేయండి... కాంగ్రెస్‌ను గెలిపించండి

- మిత్రపక్షాల సమన్వయ కమిటీ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నియంతృత్వ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని మిత్రపక్షాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆ కమిటీ నేతలు మహేష్ కుమార్, కోదండరెడ్డి(కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి, బాలమల్లేష్, ఈటీ నరసింహ (సీపీఐ), కోదండరాం, పీఎల్ విశ్వేశ్వరరావు (టీజేఎస్) విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ పార్టీలు కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. పార్టీల కలయికతో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తున్నట్టు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడిగా ప్రచారం చేస్తున్నామన్నారు. కొత్తగూడెంలో సీపీఐని, మిగతా ప్రాంతాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

రెండో రౌండ్ బందీల విడుదలలో జాప్యం

గాజాసిటీ: ఉత్తర గాజాకు సహాయం అనుమతిస్తామన్న హామీకి భిన్నంగా ఇజ్రాయిల్ వ్యవహరించడంతో రెండో రౌండ్ బందీల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఉత్తర గాజాలోకి సహాయక ట్రక్కులను ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుందని హమాస్ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండేందుకు ఇజ్రాయిల్ తిరస్కరిస్తున్నంతవరకు బందీల విడుదల ఆలస్యమవుతుందని హమాస్ అధికారి ఒకరు తెలిపారు.

మీ కలలను సాకారం చేస్తాం..

- యువతకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ
- హైదరాబాద్‌లోని సిటీ సెంట్రల్ లైబ్రరీ సందర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ యువతకు న్యాయం జరగలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు లేకపోవటం, కోర్టు కేసులు, పేపర్ లీకేజీలతో 30 లక్షల మంది నిరుద్యోగులకు నష్టం జరిగిందని ఆయన వాపోయారు. వారి కలలన్నింటినీ తమ పార్టీ సాకారం చేస్తుందని హామీనిచ్చారు. ఎన్నికల ప్రచార నిమిత్తం రాష్ట్రానికి విచ్చేసిన రాహుల్ శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లోగల సిటీ సెంట్రల్ లైబ్రరీని సందర్శించారు. అక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతను కలిసి వారిలో భరోసానింపారు. కాంగ్రెస్ రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను వారికి చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 2 లక్షల నియామకాలను పూర్తి చేసి, యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని తెలిపారు.

బందోబస్తును సమీక్షించిన డీజీపీ

- ప్రచార చివరి ఘట్టం నేపథ్యంలో పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం హెచ్చరించిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల చివరి ప్రచార ఘట్టానికి రెండు రోజుల్లో తెరపడనుండటం, మరోవైపు పార్టీల అగ్రనేతలు ప్రచార ఘట్టంలోకి దూకటంతో బందోబస్తును నిర్వహించటంలో పోలీసు ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. శనివారం నుంచే ప్రధాని మోడీ మొదలుకొని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీతో పాటు కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకపక్క బహిరంగ సభలు, మరోపక్క రోడ్‌షోలు, ఇంకోపక్క కార్నర్ మీటింగ్‌లతో హెూరెత్తిస్తున్నారు. ప్రచారానికి వివిధ పార్టీలు లక్షలాది మంది ప్రజలను సమీకరించి తమ బలాన్ని చాటుకోవటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయి. వీరి లక్ష్యమంతా ఎట్టి పరిస్థితుల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకోవాలనే లక్ష్యంపై ఉండగా.. వీరి హెూరు ఎక్కడ శాంతి, భద్రతల సమస్య తలెత్తుందోనన్న ఆందోళనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తున్నది.

వచ్చే రెండ్రోజుల పాటు బస్తీలు, నగరాలు, పట్టణాలు, గ్రామాల వరకు ఈ ప్రచార హెూరు సాగుతుండటంతో వీరికి బందోబస్తును నిర్వహించటంలో సాయుధ బలగాలను సమకూర్చటంలో పోలీసు ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు.

ముఖ్యంగా, రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఆవేశకావేశాలున్న ప్రాంతాల్లో, మత కలహాలు చెలరేగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ శనివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 47 వేల మంది పోలీసులతో పాటు కేంద్రానికి చెందిన 374 కంపెనీల సాయుధ పోలీసు బలగాలను ప్రచార చివరి ఘట్టంలో విస్తృతంగా వినియోగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, ప్రాణాలకు ముప్పు ఉన్న అభ్యర్థుల భద్రత విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇంకోవైపు, రాష్ట్ర సరిహద్దులు, ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకోని ఉన్న ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై కూడా గట్టి నిఘా వేసి ఉంచాలని కూడా ఆయన ఆదేశించారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశించకుండా అక్కడి పోలీసు ఉన్నతాధికారులతో కూడా సమన్వయం కావాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే అదనపు పోలీసు బలగాల కోసం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. మొత్తానికి ప్రచారా చివరి ఘట్టంలో ఎన్నికల నియమావళిని ఏ పార్టీ అభ్యర్థులు కూడా ఉల్లంఘించకుండా కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఎన్నికల నియమాల ఉల్లంఘనతో పాటు నమోదైన ఇతర క్రిమినల్ కేసుల గురించి ఆయన సమీక్ష జరిపారు.

సెర్ట్-ఇన్ ఆర్టీఐ పరిధిలోకి రాదు

- జాతీయ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీకి కేంద్రం మినహాయింపు

న్యూఢిల్లీ : ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సెర్ట్-ఇన్‌ను కేంద్రం సమాచార హక్కు చట్టం, 2005 (ఆర్టీఐ) పరిధి నుంచి మినహాయించింది. దేశ జాతీయ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ అయిన సెర్ట్-ఇన్.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తుంది. దేశంలోని ప్రధాన డేటా ఉల్లంఘనలపై దాని పరిశోధనలు పారదర్శకతను లోపించాయని నిపుణులు విమర్శించారు.యాపిల్ సెక్యూరిటీ నోటిఫికేషన్‌లపై దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో ఆర్టీఐ చట్టం నుంచి ఏజెన్సీ మినహాయింపు పొందటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. ఈ ఏడాది అక్టోబరులో అనేక మంది ప్రతిపక్ష నాయకులు, పాత్రికేయులు.. తమ ఫోన్‌లను రిమోట్‌గా రాజీ చేయడానికి వస్తున్న ప్రయత్నాలపై హెచ్చరిస్తూ ఐఫోన్ తయారీదారు నుంచి తమకు హెచ్చరిక అందిందని ఇప్పటికే చెప్పిన విషయం విదితమే. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ అపర్ గుప్తా సెర్ట్-ఇన్ నుంచి మినహాయించే నోటిఫికేషన్‌లో చర్యకు ఎలాంటి కారణమూ లేదని చెప్పారు. " ఇక్కడ సందేశం చాలా సులభం. కేంద్రం మీ వ్యక్తిగత జీవితాలను పరిశీలించి, దానిని ప్రపంచానికి లీక్ చేయాలనుకుంటున్నది. అది మీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఇష్టపడదు" అని గుప్తా చెప్పారు. కాగా, ఆర్‌టీఐ చట్టంలోని నిబంధనల నుంచి ఒక ఏజెన్సీకి మినహాయింపు ఇవ్వడం ఏడేండ్లలో ఇదే తొలిసారి అని 'ది హిందూ' నివేదించింది. 2016లో రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ చట్టం రెండో షెడ్యూల్ కిందకు తీసుకురావడం ద్వారా ఆర్టీఐ పరిధి నుంచి మినహాయించబడిన విషయం తెలిసిందే.

స్టే విధించండి

- జిల్లా కలెక్టర్లకు ఈడీ సమన్లపై మద్రాస్ హైకోర్టుకు తమిళనాడు ప్రభుత్వం

చెన్నై : తమిళనాడులోని పది జిల్లాల కలెక్టర్లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. తమిళనాడులో నదీ ఇసుక తవ్వకాలు, విక్రయాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణలో భాగంగా కేంద్ర ఏజెన్సీ జిల్లా కలెక్టర్లకు సమన్లు అందించినట్టు వార్త కథనాలు తెలుపుతున్నాయి. అక్రమంగా తవ్విన ఇసుక విక్రయాల ప్రక్రియ వివరాలను సేకరించేందుకు జలవనరుల శాఖ ఇంజినీర్లను గతంలో ఏజెన్సీ అధికారులు విచారించారు. అయితే, వారు జిల్లా కలెక్టర్ల వైపు వేళ్లను చూపినట్టు సమాచారం. దీంతో ఈడీ నుంచి కలెక్టర్లకు సమన్లు అందాయని తెలుస్తున్నది. ఈ చర్యతో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో అధికార డీఎంకే ప్రభుత్వం తన పిటిషన్‌లో ఈడీ తీరును తప్పుబట్టింది. ఈడీ తన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నదనీ, కొందరిని టార్గెట్ చేస్తున్నదని ఆరోపించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి నేరాలపై విచారణ లేకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తింది. "ఈడీ దర్యాప్తు రాజకీయ చిక్కులను తక్కువ అంచనా వేయలేము" అని తమిళనాడు ప్రభుత్వ సీనియర్ న్యాయవాది అన్నారు. వారి చర్యలు వారి అధికారాన్ని అతిక్రమించడమే కాదు, ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలను బలహీనపరిచేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక ఎత్తుగడ కూడా అని తెలిపారు. మనీలాండరింగ్ కేసులో జిల్లా కలెక్టర్లు నిందితులు లేదా సాక్షులు కాదని పేర్కొంటూ.. సమన్లు, తదుపరి చర్యలపై మధ్యంతర స్టే విధించాలని ప్రభుత్వం హైకోర్టును అభ్యర్థించింది.

ఇంకా మిగిలే ఉంది

- ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పట్టొచ్చు
- ఉత్తరకాశీ టన్నెల్ ఘటనపై ఎన్డీఎంఏ వెల్లడి
- నిలిచిపోయిన రెస్క్యూ పనులు
- నేటి నుంచి మాన్యువల్ డ్రిల్లింగ్

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో టన్నెల్ కూలిన ఘటనలో కార్మికులను రక్షించే చర్యలు అప్పుడే తుది దశకు చేరుకునేలా కనిపించటం లేదు. ఈ ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పట్టేలా కనిపిస్తున్నది. ఈ విషయాన్ని జాతీయ విపత్తుల నియంత్రణ సమస్థ (ఎన్డీఎంఏ) తెలిపింది. టన్నెల్ కూలి గత 13 రోజులుగా 41 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన విషయం విదితమే. అయితే, అప్పటి గత 13 రోజులుగా అధికారులు రక్షణ, సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ అనేక ఇబ్బందులు ఎదురవటంతో కార్మికులను కాపాడటంలో జాప్యం జరుగుతున్నది.

కార్మికులు చిక్కుకున్న సొరంగం వద్ద సహాయక చర్యలు నిలిచిపోయాయి. టన్నెల్ వద్ద నేటి(ఆదివారం) నుంచి మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. డ్రిల్లింగ్ చేపట్టిన ఆగర్ మెషిన్‌కు శుక్రవారం రాత్రి శిథిలాల్లోని ఇనుపపట్టి అడ్డుపడింది. దీంతో ఆగర్ మెషిన్ బ్లేడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి అన్నారు. అయితే, ప్రస్తుతం అది పనికి రాకుండా పోవటంతో మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. కాగా, రోజులు గడుస్తున్నా కొద్దీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాల్లో ఆందోళన కలుగుతున్నది.

పాలస్తీనాకు సంఘీభావంగా క్యూబాలో భారీ ర్యాలీ

హవానా: గాజాలో పాలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతకు వ్యతిరేకంగా అధ్యక్షుడు డియాజ్ కానెల్ నేతృత్వంలో వేలాది మంది క్యూబన్లు గురువారం నాడిక్కడి అమెరికన్ ఎంబసీ ఎదుట భారీ ప్రదర్శన నిర్వహించారు. గాజాపై యుద్ధానికి స్వస్తి పలకాలని, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయాలని ప్రదర్శకులు నినదించారు. యంగ్ కమ్యూనిస్టు లీగ్ నిర్వహించిన ఈ మార్చ్‌లో డియాజ్ కానెల్‌తోబాటు ప్రధాని మాన్యుయెల్, విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తదితరులు కూడా పాల్గొన్నారు. పాలస్తీనా పతాకాలను చేబూని వేలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రదర్శన హవానా సిటీలో సముద్ర తీరం వెంబడి రహదారిపై రెండు కిలో మీటర్ల పొడవునా అంటే మాలెకాన్‌లోని అమెరికన్ ప్రధాన దౌత్య కార్యాలయం వరకు సాగింది. అమెరికన్ ఎంబసీ ఎదుట ఇంత భారీ మార్చ్ నిర్వహించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటి సారి. క్యూబా పై అమెరికా ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా క్యూబన్ విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రో నేతృత్వంలో ఇటువంటి భారీ ప్రదర్శనలు గతంలో జరిగాయి. పాలస్తీనాకు కాస్ట్రో గట్టి మద్దతుదారు. ఇజ్రాయిల్ దేశంగా ఏర్పడగానే దానిని మొట్టమొదట గుర్తించింది అమెరికా అయితే, . పాలస్తీనాను దేశంగా మొట్టమొదట గుర్తించింది క్యూబా అన్న విషయం మరచిపోరాదు. అంతేకాదు, యూదు దురహంకార ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించిన దేశం క్యూబా. 200 మందికిపైగా పాలస్తీనా వైద్యులకు క్యూబా శిక్షణ ఇచ్చింది. పాలస్తీనా, క్యూబా మధ్య బంధం చెక్కుచెదరనిది. గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడుల్లో గత ఆరువారాల్లో 14,800 మంది మరణించారు. వీరిలో 40 శాతానికిపైగా పిల్లలే ఉన్నారు.

తేజస్‌లో మోడీ విహారం

బెంగళూరు : దేశీయంగా తయారైన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విహరించారు. యుద్ధ పైలెట్ దుస్తుల్లో మోడీ.. తేజస్‌ను స్వయంగా నడిపిన అనుభూతిని పొందారు. శనివారం ఆయన బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)ను సందర్శించారు. హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తయారీ యూనిట్‌ను కూడా ఆయన పరిశీలించారు. తేజస్‌లో ప్రయాణించిన తొలి ప్రధానిగా కూడా మోడీ రికార్డులకెక్కారు. ఈ వివరాలను సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. స్వదేశీ సామర్థ్యాన్ని పెంచాలన్న తన నమ్మకానికి బలం చేకూరినట్టు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'తేజస్ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేశాను. ఈ అనుభవం చాలా అద్భుతంగా ఉంది. ఈ ప్రయాణంతో మన స్వదేశీ సామర్థ్యంపై విశ్వాసం మరింత పెరిగింది. మన దేశ శక్తి సామర్థ్యాల పట్ల నాకు గర్వంగా ఉంది. ఇది మన శాస్త్రవేత్తల కృషి, అంకిత భావానికి నిదర్శనం. స్వావలంబనలో మనం ప్రపంచంలో ఎవరి కంటే తక్కువ కాబోమని గర్వంగా చెప్పగలను. భారత వాయుసేన, డిఆర్‌డిఒ, హాల్‌కు అభినందనలు' అని మోడీ పేర్కొన్నారు.

ఫైనల్లో సాత్విక్ జోడీ

- సెమీస్‌లో చైనా షట్లర్లపై గెలుపు
- చైనా మాస్టర్స్ సూపర్ 750



భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్, చిరాగ్ జోరు కొనసాగుతోంది. 2023 ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య డబుల్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రేసులో నిలిచిన మనోళ్లు... చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో అదరగొడుతున్నారు. ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఫైనల్లో అడుగుపెట్టిన సాత్విక్, చిరాగ్ నేడు టైటిల్ వేటకు రంగం సిద్ధం చేసుకుంది. ఈ ఏడాది సాత్విక్, చిరాగ్‌లకు ఇది నాల్గో బిడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్ కావటం విశేషం.

షెంజెన్ (చైనా)

చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో భారత సూపర్‌స్టార్స్ చెలరేగుతున్నారు. తెలుగు తేజం సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జంట డబుల్స్ సర్క్యూట్‌లో వరుస విజయాల మోత మోగిస్తోంది. టైటిల్ ఫేవరేట్‌గా చైనా మాస్టర్స్‌ను ఆరంభించిన మనోళ్లు.. అంచనాలను అందుకున్నారు. సెమీఫైనల్లో లోకల్ స్టార్స్, చైనా జోడీపై విజయంతో టైటిల్ పోరుకు చేరుకున్నారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో హీ జీ టింగ్, రెన్ షియాంగ్ యు (చైనా)లపై 21-15, 22-20తో సాత్విక్, చిరాగ్ జోడీ ఘన విజయం సాధించింది. టాప్ సీడ్ సాత్విక్, చిరాగ్‌లు నేడు ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగనున్నారు.

అదిరింది జోరు

ఈ ఏడాది భీకర ఫామ్‌లో ఉన్న భారత డబుల్స్ స్టార్స్ సాత్విక్, చిరాగ్‌లు మరో టైటిల్ ముంగిట నిలిచారు. చైనా మాస్టర్స్ పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ భారత జోడీ ఫైనల్లోకి ప్రవేశించింది. లోకల్ స్టార్స్, చైనా షట్లర్లు హీ జి టింగ్, రెన్ షియాంగ్ యులపై సాత్విక్, చిరాగ్‌లు వరుస గేములో గెలుపొందారు. 50 నిమిషాల్లో ముగిసిన సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత జోడీకి ఎదురేలేదు. సాత్విక్ నిలకడగా ఎదురుదాడి చేయటంతో తొలి గేమ్‌లో విరామ సమయానికి మనోళ్లు 11-6తో ఐదు పాయింట్ల ముందంజలో నిలిచారు. ద్వితీయార్థంలోనూ సాత్విక్, చిరాగ్ స్మాష్‌లకు చైనా జోడీ నుంచి సమాధానం రాలేదు. 18-10, 21-15తో తొలి గేమ్‌ను అలవోకగా సొంతం చేసుకున్నారు. కీలక రెండో గేమ్‌లో టింగ్, షియాంగ్ పుంజుకున్నారు. ప్రథమార్థంలో సాత్విక్, చిరాగ్‌లకు గట్టి పోటీ ఇచ్చారు. నెట్ దగ్గర విలువైన పాయింట్లు దక్కించుకుని 11-8తో విరామ సమయానికి మూడు పాయింట్ల ఆధిక్యంలో నిలిచారు. ద్వితీయార్థంలో వేగంగా పుంజుకున్న సాత్విక్, చిరాగ్‌లు 13-13తో స్కోరు సమం చేశారు. 18-16తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. కానీ చివర్లో సైతం చైనా షట్లర్లు పట్టు విడువలేదు. 19-19తో స్కోరు సమం చేసి టాప్ సీడ్‌కు సవాల్ విసిరారు. ఆఖర్లో ఒత్తిడిని అధిగమించిన మనోళ్లు 20-20 నుంచి వరుసగా రెండు పాయింట్లు సాధించి 22-20తో రెండో గేమ్‌ను గెల్చుకున్నారు. వరుస గేముల్లో విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించారు.

నాల్గో టైటిల్‌పై గురి

ఈ ఏడాది ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బిడబ్ల్యూఎఫ్) టూర్‌లో సాత్విక్, చిరాగ్‌లు నాల్గో టైటిల్‌పై కన్నేశారు. ఓ వైపు ఇతర భారత స్టార్ షట్లర్లు పేలవ ఫామ్‌తో తంటాలు పడుతుంటే.. సాత్విక్, చిరాగ్ జోడీ మాత్రం అదిరే విజయాలతో దూసుకెళ్తోంది. స్విస్ ఓపెన్, ఇండోనేషియా ఓపెన్, కొరియా ఓపెన్ ఫైనల్స్‌కు చేరిన సాత్విక్, చిరాగ్‌లు ఈ ఏడాది మూడు ఫైనల్స్‌లోనూ మెరుపు విజయాలతో విజేతలుగా నిలిచారు. సీజన్లో నాల్గోసారి ఫైనల్స్‌కు చేరిన సాత్విక్ జోడీ.. నేడు నాల్గో టైటిల్‌పై కన్నేసింది. ఫైనల్స్‌లో హ్యాట్రిక్ టైటిళ్ల ఉత్సాహంలో ఉన్న సాత్విక్, చిరాగ్‌లకు నేడు చైనాలో ఎదురుందా?!



శనివారం వర్షంతో పూర్తిగా తడిసిన తిరువనంతపురం గ్రౌండ్

వర్షం ముప్పు?!

- భారత్, ఆసీస్ రెండో టీ20 నేడు
- రాత్రి 7 నుంచి జియో సినిమాలో..

తిరువనంతపురం

భారత్, ఆస్ట్రేలియా రెండో టీ20 మ్యాచ్‌కు వర్షం ప్రమాదం పొంచి ఉంది. విశాఖ టీ20లో పరుగులు పోటెత్తగా.. ఆఖరు బంతి థ్రిల్లర్‌లో టీమ్ ఇండియా విజయం సాధించింది. సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఐదు మ్యాచుల సిరీస్‌లో లెక్క సరి చేసేందుకు ఆస్ట్రేలియా ఆలోచన చేస్తుండగా.. వరుణుడు అడ్డొచ్చినా 2-0పై సూర్యసేన కన్నేసింది. వర్షం ప్రభావం, స్వింగ్ అనుకూలతతో ఇరు జట్లు తుది జట్టు కూర్పులో మార్పులపై కసరత్తు చేసేందుకు అవకాశం ఉంది. ఇక్కడ జరిగిన మూడు టీ20ల్లోనూ స్వల్ప స్కోర్లే నమోదయ్యాయి. చివరి మ్యాచ్‌లో సఫారీ 9 పరుగులకే 5 వికెట్లు చేజార్చు కుంది. దీంతో టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

బంతితో మెరవాలి!

విశాఖ టీ20లో భారత్ మెప్పించింది. బ్యాటింగ్ లైనప్‌లో ఓపెనింగ్, టెయిలెండర్లు ఆతిథ్య జట్టుకు బలహీనత!. టెయిలెండర్లు నం.8 నుంచి మొదలవుతున్నారు. దీంతో ముగింపులో ఊహించని షాక్‌లు ఎదురవుతున్నాయి. ఈ సమస్య అధిగమించేందుకు భారత్ ఆల్‌రౌండర్లను తుది జట్టులోకి తీసుకునే



అవకాశం లేకపోలేదు. బంతితో రవి బిష్ణోయ్, ప్రసిద్ కృష్ణలు నిరాశపరిచారు. ధారాళంగా పరుగులు ఇచ్చారు. ఇప్పుడే ప్రమాదం లేకపోయినా.. నేడు మెరుగుపడకపోతే మూడో మ్యాచ్‌లో బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ మంచి ఫామ్‌లో ఉన్నారు. తెలుగు తేజం తిలక్ వర్మ మెగా ఇన్నింగ్స్‌పై గురి పెట్టాడు. రింకూ సింగ్ తనదైన ఫామ్ కొనసాగిస్తున్నాడు.

సమం చేయాలని

ప్రపంచకప్ సాధించిన జట్టు సభ్యులు మాక్స్‌వెల్, జంపా, హెడ్‌లు అందుబాటులో లేరు. అయినా, ఆసీస్ సిరీస్ సమం చేసేందుకు సిద్ధమవుతోంది. తొలి టీ20లో మంచి ఆరంభం దక్కినా.. బ్యాటింగ్ పిచ్‌పై 208 పరుగులే చేసింది. చివరి ఓవర్లో ముకేశ్ కుమార్ వైవిధ్య బౌలింగ్‌తో కంగారూ బ్యాటర్లను కట్టడి చేశాడు. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై ఆసీస్ స్మిత్, షార్ట్‌ను టాప్ ఆర్డర్‌లోనే కొనసాగించనుంది. స్టోయినిస్, డెవిడ్, వేడ్ మెరిస్తే ఆసీస్‌కు మంచి అవకాశం ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా : స్టీవ్ స్మిత్, మాథ్యూ షార్ట్, జోశ్ ఇంగ్లిశ్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డెవిడ్, ఆరోన్ హార్డీ, మాథ్యూ వేడ్, సీన్ అబాట్, నాథన్ ఎలిస్, జేసన్ బెహెన్‌డార్ఫ్, తన్వీర్ సంగా.

బదిలీ ఫీజు రూ.15 కోట్లు?

చర్చనీయాంశంగా హార్దిక్ పాండ్య ట్రాన్స్‌ఫర్



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అతి త్వరలోనే ఫుట్‌బాల్ క్లబ్‌ల తరహాలో రికార్డు ట్రాన్స్‌ఫర్ ఫీజులను చేరుకోనుందా?!. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య కోసం గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ మధ్య లావాదేవీలు చూస్తే ఇదే నిజమని అనిపిస్తుంది. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఇద్దరు కెప్టెన్లు బదిలీ అయ్యారు. రవిచంద్రన్ అశ్విన్ (పంజాబ్ కింగ్స్), అజింక్య రహానె (రాజస్థాన్ రాయల్స్)లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లారు. కానీ ఆ బదిలీ వ్యవహారంలో ఎటువంటి అదనపు ట్రాన్స్‌ఫర్ ఫీజులు చోటుచేసుకోలేదు. కానీ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను తిరిగి ముంబయి ఇండియన్స్ గూటికి పంపించేందుకు గుజరాత్ టైటాన్స్ రూ.15 కోట్ల బదిలీ ఫీజు దక్కించుకోనున్నట్టు సమాచారం!.

2021 ఐపీఎల్ సీజన్ ముంగిట రోహిత్, బుమ్రా, సూర్య, పొలార్డ్‌లను నిలుపుకున్న ముంబయి ఇండియన్స్ హార్దిక్ పాండ్యను వేలంలోకి వదిలేసింది. 2015లో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రూ.10 లక్షలకు ముంబయి ఇండియన్స్‌కు వెళ్లిన పాండ్య.. అనతి కాలంలోనే స్టార్‌గా ఎదిగాడు. తిరిగి వేలంలో తీసుకుంటామని ముంబయి ఇండియన్స్ హామీ ఇచ్చినా.. కొత్త ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ వేలానికి ముందే రూ.15 కోట్లతో హార్దిక్ పాండ్యను సొంతం చేసుకుంది. పాండ్యకు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించి క్రికెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. తొలి సీజన్లోనే టైటాన్స్‌ను చాంపియన్‌గా నిలిపిన పాండ్య.. రెండో సీజన్లో రన్నరప్‌గా నిలిపాడు. గుజరాత్ టైటాన్స్ ఆడిన రెండు సీజన్లలో ఆ జట్టు గ్రూప్ దశలో అగ్రస్థానం సాధించింది. ఇప్పుడు ముంబయి ఇండియన్స్ హార్దిక్ పాండ్యను కోరుకుంటుండగా.. రూల్స్ ప్రకారం రూ.15 కోట్లను చెల్లించటంతో పాటు అదనంగా బదిలీ ఫీజు సైతం ఇవ్వాల్సి ఉంటుంది.

అయితే, ఈ బదిలీ ఫీజు ఎంత అనే అంశంపై స్పష్టత లేకపోయినా అదీ రూ.15 కోట్లు వరకు ఉందని అంచనా. రూ.15 కోట్ల రెగ్యులర్ ఫీజు పూర్తిగా పాండ్యకు దక్కనుండగా.. బదిలీ ఫీజులో పాండ్య 50 శాతం పొందనున్నాడు. ముంబయి ఇండియన్స్ గత సీజన్ వేలం అనంతరం రూ.50 లక్షల నగదు మాత్రమే మిగిల్చుకుంది. ఈ సీజన్ వేలానికి అదనంగా రూ.5 కోట్లు అందుబాటులో ఉంటాయి. దీంతో జట్టులోని కొందరు ఆటగాళ్లను వదిలేస్తేనే హార్దిక్ పాండ్యను తీసుకునేందుకు ముంబయికి అవకాశం ఉంటుంది. గాయాలతో ఇబ్బంది పడుతున్నా, వచ్చే సీజన్‌కు అందుబాటులో ఉండని క్రికెటర్లను ముంబయి ఇండియన్స్ వేలంలోకి వదిలేసే అవకాశం కనిపిస్తోంది. అట్టిపెట్టుకునే ఆటగాళ్ల జాబితా సమర్పించేందుకు నవంబర్ 26 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉంది. ఈ లోగా గుజరాత్ టైటాన్స్ నిర్ణయం మార్చుకుంటే మినహా హార్దిక్ పాండ్య ముంబయి ఇండియన్స్ గూటికి రావటం ఖాయంగా కనిపిస్తోంది.

ఓవరాల్ చాంపియన్ రంగారెడ్డి

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు



హైదరాబాద్ : 67వ ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్స్‌లో రంగారెడ్డి జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాచుపల్లిలోని జియోన్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా అండర్-14, అండర్-17 గర్ల్స్, బాయ్స్ విభాగాల్లో పోటీలు జరుగగా, విజేతలుగా నిలిచిన స్విమ్మర్లను జాతీయ చాంపియన్‌షిప్స్‌కు ఎంపిక చేశారు. విజేతలకు పీఈటీఏటీఎస్ అధ్యక్షుడు బి. రాఘవ్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

జిమ్నాస్టిక్స్‌లో నిషిక పసిడి షో



హైదరాబాద్ : అంతర్జాతీయ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టోర్నీమెంట్‌లో తెలంగాణ యువ సంచలనం నిషిక అగర్వాల్ పసిడి పతకంతో మెరిసింది. ఈ నెల 20-25 వరకు తాష్కెంట్‌లో జరిగిన పోటీల్లో జూనియర్ గర్ల్స్ విభాగంలో నిషిక రెండు పతకాలు సాధించింది. టేబుల్ వాల్ట్‌లో పసిడి పతకం సాధించగా, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో కాంస్య పతకం అందుకుంది.

భారత జట్టులో మనోళ్లు

అండర్-19 ఆసియా కప్ జట్టును ప్రకటించిన బీసీసీఐ

ముంబయి : ఏసీసీ అండర్-19 మెన్స్ ఆసియా కప్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో హైదరాబాద్ కుర్రాళ్లు చోటు సాధించారు. ప్రస్తుతం విజయవాడలో ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ అండర్-19 జట్లు పోటీపడుతున్న టీ20 టోర్నీలో పోటీపడుతున్న అరవల్లి అవినాశ్ రావు, మురుగున్ అభిషేక్‌లు జట్టులో చోటు సాధించారు. ఉదయ్ సహరన్ (పంజాబ్) భారత అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆసియా కప్ డిసెంబర్ 8న దుబాయ్ (యుఏఈ)లోని ఐసీసీ గ్రౌండ్‌లో భారత్, అఫ్గనిస్థాన్ మ్యాచ్‌తో ఆరంభం కానుంది. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ డిసెంబర్ 10న ఉండగా, నేపాల్‌తో డిసెంబర్ 12న మనోళ్లు ఢీకొట్టనున్నారు. డిసెంబర్ 17న టైటిల్ పోరు జరుగుతుంది.

నవచిత్రం

ఇళయరాజా స్వరాలతో 1920 భీమునిపట్నం



కంచర్ల అచ్యుతరావు, ఇళయరాజా, నరసింహ నంది

భారత స్వాతంత్ర్య పోరాట నేపథ్యంలో చక్కటి భావోద్వేగాల మధ్య నడిచే కథతో '1920 భీమునిపట్నం' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. తొలిచిత్రం విడుదలకు మునుపే ఒకేసారి ఐదు సినిమాలలో నటిస్తున్న కంచర్ల ఉపేంద్ర హీరోగా నటించనున్న ఈ చిత్రాన్ని ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.6గా కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్నారు. నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్నారు.

వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రం గురించి నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'తెలుగు సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లగలిగే కథ. ఆస్కార్ స్థాయికి తగట్టుగా తెరకెక్కించబోతున్నాం. ఈ కథ ఇళయరాజాకి బాగా నచ్చి, సంగీతం అందిస్తున్నారు. వారి సంగీతం ఈ చిత్రానికి ఓ హైలైట్ గా నిలుస్తుంది. ఇప్పటివరకు ఇలాంటి కథను వినలేదని ఆయన చెప్పడం మాకెంతో ప్రేరణను కలిగించింది' అని అన్నారు.

'నా కెరీర్‌లో ఇదో విభిన్న చిత్రమవుతుంది. నటనకు ఎంతో స్కోప్ ఉన్న కథ. ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. అవార్డుల దర్శకుడు నరసింహ నంది ఈ చిత్రం చేస్తుండటం ఓ విశేషం' అని హీరో కంచర్ల ఉపేంద్ర అన్నారు. దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ, '1920- 22 సంవత్సరాల మధ్య కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి అలుముకున్న సమయంలో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు ఉద్యమానికి ఆకర్షితులైన ఎంతోమంది యువతీయువకులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఉద్యమంలోకి అడుగుపెట్టారు. అలాంటివారిలో సీతారాం, సుజాత స్వాతంత్ర్య పోరాట నేపథ్యంలో జరిగే ప్రేమికుల కథ ఇది. కొన్ని నిజ జీవితంలో జరిగిన పాత్రలు ప్రేరణతో ఈ ప్రేమకథను తయారు చేశాను. ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందిస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాను' అని తెలిపారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.

యూనిక్ కాన్సెప్ట్



తిరువీర్

'పరేషాన్, జార్జ్ రెడ్డి, పలాస 1978, మసూద' వంటి వైవిధ్యమైన చిత్రాల్లో నటించి మెప్పించిన హీరో తిరువీర్.

ఆయన లేటెస్ట్‌గా నటిస్తున్న కొత్త సినిమాకి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

మూన్ షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై సాయి మహేష్ చందు, సాయి శశాంక్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజ్ విరాట్ దర్శకుడు.

ద్రిష్టి తల్వార్ కథానాయికగా నటిసు_న్నారు. రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా యూనిక్‌నెస్‌తో కాన్సెప్ట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. డార్క్ కామెడీ జోనర్‌లో అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందని నిర్మాతలు తెలిపారు. తిరువీర్ మరో విలక్షణమైన పాత్రలో మెప్పించ నున్నారు. త్వరలోనే షూటింగ్ జరుపు కోనున్న ఈ సినిమా టైటిల్ ఇంకా ఖరారు కాలేదు. త్వరలోనే మరిన్ని వివరాలు మేకర్స్ ప్రకటించ నున్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్: లియోన్ జేమ్స్, సినిమాటో గ్రఫీ: సుజాత సిద్ధార్థ్, ప్రొడక్షన్ డిజైనర్: రామ్ అరసవిల్లి, ఎడిటర్: ఛోటా కె.ప్రసాద్.

మా సక్సెస్‌కు నిదర్శనమిదే



శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్, రాహుల్ విజయ్, శివాని ముఖ్యతారలుగా తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల అభినందనలతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంటూ బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలిచింది.

ఈ సందర్భంగా శనివారం చిత్ర యూనిట్ థ్యాంక్స్ మీట్ ఏర్పాటు చేసింది. నిర్మాతల్లో ఒకరైన బన్నీవాస్ మాట్లాడుతూ,'నిజాయితీగా సినిమా చేశాం. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మార్నింగ్ వసూళ్లు తక్కువ వున్నా ఫస్ట్ షో టైమ్‌కు మౌత్‌టాక్‌తో కలెక్షన్లు పెరిగాయి. ఇదే మా సినిమా సక్సెస్‌కు నిదర్శనం. ఓ మంచి సినిమా తీశాను అది జనాలకు నచ్చిందనే విషయాన్ని మాత్రం కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. తేజ మార్ని ఎంతో ప్రతిభ గల దర్శకుడు. ఈ రోజు చిత్రంలో ప్రతి సన్నివేశానికి క్లాప్స్ పడుతున్నాయంటే అతనే కారణం' అని అన్నారు. 'మీడియా మిత్రులు చాలా మంది ఫోన్ చేసి అభినందిస్తుంటే ఆనందంగా ఉంది. 'ఖడ్గం, ఆపరేషన్ దుర్యోధన' రోజులు గుర్తొచ్చాయని అందరూ అంటున్నారు. ఈ మధ్యకాలంలో నాకు ఏ చిత్రానికి ఇన్ని ప్రశంసలు రాలేదు. ఇలాంటి సినిమా తీయాలంటే గట్స్ ఉన్న నిర్మాతలు కావాలి. ఆ గట్స్ నాకు వాసు, విద్యలో కనిపించాయి' అని హీరో శ్రీకాంత్ చెప్పారు. ఈ చిత్ర దర్శకుడు తేజ గొప్ప దర్శకుడుగా ఎదుగుతాడు అన్నారు.

'ఎంతో కష్టపడి, అందరి సహకారంతో చేసిన ఈ సినిమాకు ఇంత మంచి ఆదరణ దొరకడం హ్యాపీగా ఉంది' అని దర్శకుడు తేజ మార్ని తెలిపారు. శివాని మాట్లాడుతూ, 'సినిమాలో నా నటన గురించి అందరూ అమ్మకు ఫోన్ చేసి అభినందిస్తున్నారు. మౌత్ టాక్ బాగుంది' అని చెప్పారు.

పక్కా క్యారెక్టర్ బేస్డ్ సినిమా




సందీప్‌రెడ్డి వంగా

రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్ ఇతరకీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి 5 భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మీడియాతో మాట్లాడుతూ, 'దీన్ని తండ్రీ కొడుకుల ప్రేమకథగా అనుకోవచ్చు. ప్రైమరీ స్టోరీ అదే. ఒక వ్యక్తి కుటుంబం కోసం ఎంత దూరం వెళ్తాడనేది ఈ సినిమా. నేను తీసిన 'అర్జున్ రెడ్డి, యానిమల్' ఈ రెండూ కూడా క్యారెక్టర్ బేస్డ్ సినిమాలే. కథాపరంగా ఎమోషన్, వైలెన్స్ అన్నీ సరిగ్గా బ్యాలెన్స్ చేశాననే అనుకుంటున్నాను(నవ్వుతూ). ఇందులో రష్మికది చాలా ముఖ్యమైన పాత్ర. సినిమా ఆద్యంతం ఉంటుంది. రెగ్యులర్‌గా కాకుండా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. హీరోని పేరెంట్స్ కంటే ఎక్కువ అర్థం చేసుకున్న పాత్ర. ఇందులో మంచి ప్రేమకథ కూడా ఉంది. రణ్‌బీర్ కపూర్ చాలా గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి. ఆయన నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోనే తను అత్యుత్తమ నటుడు.ఈ కథలో అనిల్ కపూర్‌ది కీలక పాత్ర. ఆయన వలనే ఆయన గురించే డ్రైవ్ అవుతుంది. బాబీ డియోల్ విలన్‌గా కనిపిస్తారు. నా సినిమాలో సౌండ్, మ్యూజిక్‌కి చాలా ప్రాధన్యత ఇస్తాను. హర్ష వర్ధన్ రామేశ్వర్ నేపథ్యం సంగీతం చేశారు. చాలా అద్భుతంగా చేశాడు. ఈ సినిమానికి నేనే ఎడిటింగ్ చేశా. ప్రభాస్ చేసే ప్రాజెక్ట్ జూన్ నుండి ప్రీప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ అవుతుంది' అని తెలిపారు.

నేటి సమాజానికీ ప్రతిబింబమే



'జర్నలిస్ట్‌గా పని చేస్తున్న రోజుల్లో నేను నిర్మాతగా మారతానని, పైగా అవార్డులు అందుకున్న 'కాలం మారింది' వంటి చిత్రాన్ని నిర్మిస్తానని కలలో కూడా ఊహించలేదు. యాభై ఏండ్లుదాటినా నేటికీ ఈ సినిమా తెలుగు చలన చిత్ర కావ్యంగా నిలవడం ఆనందంగా, గర్వంగా ఉంది' అని సీనియర్ జర్నలిస్ట్, నిర్మాత వాశిరాజు ప్రకాశం అన్నారు.

కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో శోభన్‌బాబు, శారదా జంటగా నటించిన ఈ చిత్రం 1972లో విడుదలై, విశేష ప్రేక్షకాదరణతో శతదినోత్సవం జరుపుకుంది. గాంధీ భావజాలానికి అనుగుణంగా నాటి పరిస్థితుల నేపథ్యంలో సినిమా తీసినప్పటికీ నేటి సమాజానికి ప్రతిబింబంగా నిలిచిన ఈ చిత్రం గురించి నిర్మాత వాశిరాజు ప్రకాశం మాట్లాడుతూ, 'ఈ కథని నందమూరి తారకరామారావుకి చెప్పటానికి వెళ్తే ఈ సినిమా తీయవద్దని సలహా ఇచ్చారు. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు దగ్గరికి వెళ్తే, 'పూలరంగడు' సినిమాతో బిజీగా ఉన్నానని చెప్పారు. నిరాశ, నిస్పృహలతో ఉన్న సమయంలో ఈ కథ నచ్చి కె.విశ్వనాథ్ తానే డైరెక్ట్ చేస్తానని చెప్పారు. శోభన్‌బాబు, శారదా, గుమ్మడి, అల్లురామలింగయ్య, చంద్రమోహన్, అంజలి ఇలా అందరూ ఎంతో సహకారం అందించారు. రచయిత బొల్లిముంత శివరామకృష్ణ అందించిన సాహిత్యం నాటికీ నేటికీ ఒక పాఠ్యగ్రంథమే. చెన్నైలోని అశోకా హోటల్‌లో జరిగిన ఈ సినిమా శతదినోత్సవానికి నాటి తారలందరూ విశేషంగా తరలి వచ్చి ఓ పెద్ద పండగలా జరగడం ఇప్పటికీ నాకు బాగా గుర్తు' అని చెప్పారు.

మాస్ బీట్‌తో కేసీపీడీ.. సాంగ్



కార్తీక్ రాజు

క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్స్ ఎప్పుడూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటాయి. అయితే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లను క్లూస్ టీమ్ కోణంలో నుంచి చూపించేందుకు 'అథర్వ' అనే చిత్రం రాబోతోంది.

అన్ని రకాల ఎమోషన్స్ కలిపి తీసిన ఈ చిత్రం నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందింది. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో, హీరోయిన్లుగా నటించారు. మహేష్ రెడ్డి దర్శకత్వం వహించగా సుభాష్ నూతలపాటి నిర్మించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించారు.

'ఇప్పటికే చిత్రం నుంచి విడుదల చేసిన టీజర్, ట్రైలర్, పాటలు, పోస్టర్లకు మంచి స్పందన వచ్చింది. తాజాగా మరో మంచి బీట్ ఉన్న వీడియో సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'కేసీపీడీ...' అంటూ సాగే ఈ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఊరి వాతావరణంలో ఎంతో సహజంగా ఈ పాటను తెరకెక్కించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ, శ్రీ చరణ్ పాకాల బాణీ, గాత్రం ఈ పాటను వినసొంపుగా, చూడముచ్చటగా మార్చేశాయి. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం ఎంతో క్యాచీగా ఉంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ మూవీ డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ మూవీని తాజాగా పోలీస్ డిపార్ట్మెంట్లోని క్లూస్, ఫోరెన్సిక్ విభాగం వారు వీక్షించి, ప్రశంసల వర్షం కురిపించారు. క్లూస్ టీంను ఇంత బాగా ఇదివరకు ఎవ్వరూ చూపించలేదని కొనియాడారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.

అన్నంటే దోస్తే సోదరా..



సంజోష్, మంచు మనోజ్, సంపూర్ణేష్‌బాబు

సంపూర్ణేష్ బాబు, సంజోష్ ముఖ్య పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. మన్ మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో క్యాన్స్ ఎంటర్టైన్మెంట్స్, మాంక్ ఫిలిమ్స్ బ్యానర్లపై చంద్ర చగంలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'అన్నంటే దోస్తే సోదరా..' అంటూ సాగే సాంగ్ లాంచ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ సాంగ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'డార్లింగ్ సంపు అండ్ స్టైల్ ఎప్పుడు కూడా స్వచ్ఛంగా హార్ట్ ఫుల్‌గా ఉంటుంది. సంజోష్ ఈ సినిమాతో సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను. అలాగే దర్శకుడు, ప్రొడ్యూసర్లు వాళ్ళు పడిన కష్టం ఈ సినిమాలో తెలుస్తుంది ఈ సినిమా అందరికీ మంచి సక్సెస్ ఇవ్వాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'ఈ పాట ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. మమ్మల్ని బ్లెస్ చేసిన మంచి మనోజ్‌కి కృతజ్ఞతలు' అని సంపూర్ణేష్ బాబు చెప్పారు.

సంజోష్ మాట్లాడుతూ, 'అన్నదమ్ముల అనుబంధంతో వస్తున్న ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది' అని అన్నారు. 'ఈ సాంగ్ లాంచ్ చేసిన మంచు మనోజ్‌కి కృతజ్ఞతలు. ఈ సాంగ్ పెద్ద సక్సెస్ అవుతుందని, అలాగే సినిమా కూడా మంచి సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత చంద్ర చగంలా తెలిపారు. దర్శకుడు మన్ మోహన్ మేనంపల్లి, 'ఈ పాటను సుద్దాల అశోక్ తేజ రాశారు. సునీల్ కశ్యప్ అద్భుతమైన సంగీతం సమకూర్చారు. ఈ సినిమా అన్నదమ్ముల మధ్య అనుబంధాన్ని అద్దం పట్టేలా ఉంటుంది' అని అన్నారు.



లక్షణాలు ఇవే

ప్రతి 28 రోజులకు ఒకసారి క్రమం తప్పక వచ్చే రుతుస్రావం మరుసటి నెలలో తప్పిపోవడం గర్భం వచ్చిందనటానికి స్పష్టమైన సంకేతం. అయినప్పటికీ, గర్భం దాల్చిన మొదటి కొన్ని వారాల్లో గర్భం ప్రారంభ లక్షణాలను మనం గమనించడం ప్రారంభించవచ్చు. కొన్ని సాధారణ లక్షణాలు ఇలా వుంటాయి.

వక్షోజాల్లో మార్పులు : హార్మోన్ల మార్పుల వల్ల వక్షోజాలు మరింత భారీ, సున్నితమైన, మృదువుగా కనిపిస్తాయి. గర్భం దాల్చిన 1-2 వారాల తర్వాత ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

అలసట : గర్భం దాల్చిన ప్రారంభ దశలలో అధిక ప్రొజెస్టెరాన్ స్థాయిల కారణంగా అలసట, నిద్రను కలిగిస్తాయి.

ఆహార కోరికలు, విరక్తి : కొన్ని వాసనలు కొంతమందికి వికారం కలిగించవచ్చు, మరికొందరు ఒక నిర్దిష్ట ఆహారం కోసం ఆరాటపడవచ్చు.

తలనొప్పి : హార్మోన్ల స్థాయి పెరగడం గర్భం ప్రారంభ దశలో తలనొప్పికి కారణమవుతుంది. తలనొప్పి వివిధ దశలలో కూడా సంభవిస్తుంది.

తరచుగా మూత్రానికి : తరచుగా మూత్ర విసర్జన చేయాలనిపిస్తుంది. శరీరంలో గర్భధారణ హార్మోన్ల స్థాయిలు పెరగడం కిడ్నీ, కటి ప్రాంతానికి రక్త ప్రవాహాన్ని పెంచుతుంది.

వికారం : గర్భం దాల్చిన మూడు వారాల్లోనే వికారం మొదలవుతుంది. వాంతి వచ్చినట్టు అనిపిస్తుంది. చాలామంది మహిళలు గర్భం దాల్చిన మొదటి కొన్ని వారాలలో మాత్రమే వికారంగా ఉంటుంది. తర్వాత ఈ సమస్య తగ్గిపోతుంది.

తిమ్మిరి : కొంతమందికి ఉదరం, కటి లేదా నడుము భాగం తిమ్మిరిగా అనిపిస్తుంది. గర్భాశయంలో జరుగుతున్న మార్పుల వల్ల ఇది కావచ్చు.

మల బద్ధకం : హార్మోన్ల మార్పులు జీర్ణవ్యవస్థకు అంతరాయం కలిగిస్తాయి. గర్భం దాల్చిన ప్రారంభ వారాల్లో మలబద్ధకం ఉంటుంది.

కండ్లు తిరగడం : గర్భం దాల్చిన తర్వాత కొంతమందికి రక్తపోటు పెరిగే అవకాశం ఉంది. అలాంటపుడు పడుకుని లేచినపుడు మైకం వస్తుంది. మెదడుకు ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే రక్త నాళాలలో మార్పుల వల్ల ఇది సంభవిస్తుంది.



ఇలా రక్షించుకోండి

○ చలికాలంలో నీరు తాగడం ఎంతో అవసరం. ఈ కాలంలో దాహంగా అనిపించదు కాబట్టి నీరు తాగడం మర్చిపోతాం. ఒక బాటిల్ దగ్గర పెట్టుకుని అందులో నుండి మాత్రమే నీరు తాగితే మీకే తెలుస్తుంది, ఎంత తక్కువ నీరు తాగుతున్నారో. అందుకనే, మీ మొబైల్ ఫోన్‌లో రిమైండర్ పెట్టుకుని అయినా నీరు తాగండి. లేదా ఒక ఆట లా కూడా దీన్ని మార్చుకోవచ్చు. మీరు టైమ్ చూసినప్పుడల్లా చివరి సంఖ్య బేసి సంఖ్య అయితే గ్లాసు నీరు తాగాలి అని అనుకుని తాగండి. తేడా మీకే తెలుస్తుంది.

○ దోసకాయలు వంటి వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. చిలగడదుంపలు, క్యారెట్స్, క్యాప్సికం, గుమ్మడికాయ వంటి వాంటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ చర్మానికి మేలు చేస్తాయి. విటమిన్స్ ఎ, బీ, ఈ, ఐరన్, ఒమేగా-3 కొరకు పాల కూర, ఇంకా ఇతర ఆకు కూరలు తీసుకోండి.

○ చేతులు మెత్తగా మృదువుగా లేవంటే మీకు ఒమేగా 3 సరిపడినంత లేదని కూడా సూచన కావచ్చు. సాల్మన్, ఆలివ్ ఆయిల్, వాల్‌నట్స్‌లో ఈ ఫ్యాటీ ఆసిడ్స్ ఉంటాయి.

○ ఈ కాలంలో వేడి నీటి స్నానం వల్ల హాయిగా ఉంటుంది. కానీ మరీ ఎక్కువ వేడి నీరు చర్మానికి మాత్రం హాని చేస్తుంది. అందుకే గోరు వెచ్చని నీటితోనే స్నానం చేయండి.

○ కొబ్బరి నూనె చర్మ రక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగిన డ్యామేజ్‌ని తగ్గిస్తుంది.





నిత్యం ప్రజలతోనే ఉంటా

మాచర్ల భారతి... చదువుకునే రోజుల్లోనే సమాజం పట్ల అవగాహన పెంచుకున్నారు. సమసమాజం కోసం తపించారు. విద్యార్థి ఉద్యమంలో పని చేస్తూ అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారు. తన జీవితం సమాజానికే అంకితం చేయాలని భావించారు. సీపీఐ(ఎం)లో పూర్తి కాలం కార్యకర్తగా పని చేస్తూ పేదల పక్షం నిలబడ్డారు. ఎర్రజెండా ఆధ్వర్యంలో జరిగిన ఎన్నో ఉద్యమాల్లో భాగస్వామి అయ్యారు. ప్రస్తుతం సత్తుపల్లి నియోజకవర్గం నుండి సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమె ఉద్యమ జీవిత పరిచయం నేటి మానవిలో...

భారతి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల మండలంలో ఓ సామాన్య వ్యవసాయ కార్మిక కుటుంబంలో పుట్టారు. తల్లి నాగరత్నం, తండ్రి మన్యం దేవానందం. పదోతరగతి పూర్తి చేసిన వెంటనే సింగరేణి ఉద్యోగి మాచర్ల గోపాల్‌తో వివాహం జరగడంతో ఇల్లందు వచ్చారు. ఈ వివాహమే ఆమె జీవితాన్ని ఓ మలుపు తిప్పింది. రాజకీయ జీవితానికి నాంది పలికింది.

విద్యార్థి దశ నుండే...

భర్త, బావ ప్రోత్సాహంతో ఇల్లందు కాలేజీ లో ఇంటర్‌లో చేరారు. చదువుకునే రోజుల్లో ఎస్ఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో పని చేసే వారు. విద్యార్థి సంఘ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొ నేవారు. అలా విద్యార్థి దశలోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐలో చురు కైన కార్యకర్తగా విద్యార్థులు ఎదుర్కొనే అనేక సమస్యలపై పని చేశారు. ఇంటర్ తర్వాత ప్రజా నాట్యమండలి, ఐద్వాలో పని చేయడం మొదలు పెట్టారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. స్ఫూర్తి బిటెక్ పూర్తి చేయగ, సుమైత్రి ఎంటెక్ చేసింది. కుటుంబ సభ్యులతో పాటు పిల్లలు కూడా ఆమె రాజకీయ జీవితాన్ని వెన్నుదన్నుగా నిలబడుతు న్నారు. ప్రస్తుతం భారతి ఖమ్మం జిల్లా కేంద్రం సిపిఎం పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు రాలు, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఉన్నారు.

పార్టీలో బాధ్యతలు

ఇల్లందు డివిజన్ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా టౌన్, డివిజన్ కార్యదర్శిగా, పార్టీ ఇల్లందు టౌన్ కార్యదర్శి బాధ్యతలు నిర్వ హించారు. 2014 నుండి ఖమ్మం జిల్లా కేంద్రం లో నివాసం ఉంటూ ఐద్వా జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఐద్వా జిల్లా కార్యదర్శిగా రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా, కేంద్ర కమిటీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు.

ఉద్యమాల్లో కీలక పాత్ర

2000లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2006లో జరిగిన ఇళ్ల స్థలాల భూపోరాటంలో ఐదు రోజులు ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. మద్యపాన నిషేధం, నియంత్రణ వంటి సమస్యలపై, మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, వరకట్న వేధింపుల నుండి మహిళలను కాపాడేందుకు, ప్రభుత్వ వైద్యశాలల్లో పేదలకు మెరుగైన వైద్య సేవల కోసం, దళిత, గిరిజన, పేదలకు భూమి హక్కుల కోసం, ఇంకా ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించారు. పాలక పార్టీలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా రాజకీయంగా ప్రజలను చైతన్యం చేసి, పోరాటాల్లోకి వచ్చేలా కృషి చేశారు. జిల్లాలోని రైతులకు సాగునీరు అందించే దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం పార్టీ చేపట్టిన సాగునీటి సాధన రైతు మహాపాదయాత్రలో వెయ్యి మందితో కలిసి 13 రోజులు, సామాజిక న్యాయం-తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సీపీఎం పార్టీ నిర్వహించిన పాదయాత్రలో 14 రోజులు నడిచారు.

ప్రత్యక్ష పోరాటాలు...

గిరిజనులు, గిరిజనేతర పేదలు సాగుచేస్తున్న పోడు భూములను రక్షించుకునేందుకు హక్కు పత్రాల సాధన కోసం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల్లో ప్రత్యక్షంగా పోడు సాగుదారులకు అండగా నిలబడ్డారు. దళితులపై జరుగుతున్న సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా దళితుల హక్కుల రక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమలలో ప్రత్యక్షంగా పాల్గొన్నాను. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులు కేటాయించుటకు, వృత్తిదారుల సమస్యలపై, బీసీ సబ్‌ప్లాన్ కోసం, ఎంబీసీలు, మైనార్టీల హక్కుల కోసం జరిగిన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. సింగరేణి బొగ్గుగని కార్మికుల సమస్యలపై, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలపై, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఇంటి పని వాళ్ళు, డ్వాక్రా సహిళల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారు.

కేసులు నిర్బంధాలు

మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదల కోసం చేసిన పోరాటంలో నాలుగు రోజులు జైలు జీవితం గడిపారు. మద్యపాన నిషేధం, మునిసిపల్ సమస్యల పోరాటంలో, రైతు పండించిన పంట గిట్టుబాటు ధర కోసం రాష్ట్రవ్యాప్త సరిహద్దు దిగ్బంధన ఆందోళనలో అక్రమ కేసులు బనాయించబడి నేటికీ అవి కొనసాగుతున్నాయి.



ఎర్ర జెండాతోనే సాధ్యం..

ఇప్పటివరకు సత్తుపల్లి నుండి పోటీ చేసి గెలిచిన వారు ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉంటూ ప్రజలకు దూరంగా ఉన్నారు. కానీ మీరు నాపై విశ్వాసం ఉంచి గెలిపిస్తే నియో జకవర్గ కేంద్రంలోనే నివాసముంటూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. సింగరేణి ఓసీ ప్రజలు ఎదు ర్కొనే సమస్యలపైన కృషి చేస్తాను. రైతాంగానికి సాగర్ నీరు అందక ప్రతి ఏడాది పంటలు ఎండి పోతున్నాయి. సాగర్ ఆయకట్టు రైతాంగానికి నీరు అందించేందుకు కృషి చేస్తాను. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గానికి రెండు పంటలకు నీళ్ళు అందేలాగా కృషి చేస్తాను. పోడు సాగుదారులను భూముల నుండి ఖాళీ చేయించేదానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. హరితహారం పేరుతో పోడు సాగుదారులను ఇబ్బంది పెడుతుంది. నన్ను గెలి పిస్తే పోడుసాగుదారులకు అండగా ఉంటాను. వారికి హక్కుపత్రాల కోసం, కౌలు, పోడు రైతులకు రుణాలు, రైతు బంధు పథకం కోసం పోరాడతాను. నియోజకవర్గంలోని దళితపేలు, వారి అభివృద్ధికి అదే విధంగా ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు పథకం అమలుకు కృషి చేస్తానని, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను. ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్య పరిష్కారం కోసం అంకిత భావంతో పని చేస్తాను. పేదల జీవితాలు బాగుపడాలన్నా, రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నా ఎర్రజెండా ఒక్కటే మార్గం.

గంప గుత్త బేరాలు

(మొదటిపేజీ తరువాయి)

మార్చిన నేతలు అవకాశం ఉన్నచోట గ్రామాలకు గ్రామాలనే కొనుగోలు చేస్తున్నారు. వందకు వందశాతం ఓట్లు తమకే పడేలా సామూహిక ప్రమాణాలు చేయిస్తున్నారు.

ప్రతి గ్రామంలో భిన్న పార్టీలు ఉంటాయి. వ్యక్తుల మధ్య, పార్టీల మధ్య వైరుధ్యాలుంటాయి. అలాంటప్పుడు ఇదెలా సాధ్యం? అన్న ప్రశ్న సహజం. అయితే ముందుగా గ్రామాల్లోని చోటా మోటా నేతలను, పార్టీల సభ్యులు, ఇతర కీలక నేతలను మచ్చిక చేసుకుంటున్నారు. ఆ తర్వాత కుల సంఘాల నాయకులను దారికి తెచ్చుకుంటున్నారు. అన్ని సక్రమంగా జరిగితే ఆ గ్రామాన్ని కొనుగోలు చేస్తున్నా "విడిగా ఓటుకు ఇంత అని ఇవ్వడంతో పాటు మీ గ్రామానికి ఇంత మొత్తాన్ని అందజేస్తాం. ఈ మొత్తాలు చాలా పెద్దవి. దాంతో గ్రామంలో రోడ్డు వేయించు కుంటారో, బడి కట్టించుకుంటారో, ఆస్పత్రి కట్టించుకుంటారో మీ ఇష్టం" అంటూ ఒప్పందం చేసుకుంటారు. కాని షరతు ఏమిటంటే గ్రామంలో వందకు వందశాతం ఓట్లు వారికే పడాలి. ఇందుకు కావలసిన గ్యారంటీని గ్రామంలోని ఫలానా వ్యక్తి దగ్గర ఉంచుతున్నాం. ఇది గ్రామస్తులకు రాజకీయ పార్టీలకు మధ్య జరుగుతున్న ఒప్పందం. ఈ ఎన్నికల్లో సదరు పార్టీ అభ్యర్థి ఓడిపోయినా గెలిచినా సంబంధం లేదు. అనుకున్న ప్రకారం గ్రామ నిర్ణయానికి అనుగుణంగా ఓట్లు పడితే ఒప్పందం అమలవుతుంది. అందుకు మీ గ్రామంలోని ఫలానా వ్యక్తి గ్యారెంటీ.. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో గత రెండు రోజుల నుంచి ఎంచుకున్న గ్రామాల్లో రాజకీయ పార్టీలు ఈ తరహా బేరాలకు పాల్పడుతు న్నాయని తెలుస్తోంది.

ఎన్నికల్లో గెలుపొందేందుకు ఓటర్లను అంగట్లో సరుకుల మాదిరిగా తయారు చేస్తున్నారు. గతంలో ఊర్లలో వేలం పాటల నిర్వహించేవారు. అక్కడక్కడ కుల సంఘాలు ఇతర సమూహాలకు ఓపెన్ ఆఫర్ ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ట్రెండు మార్చి ఈ కొత్త పోకడలకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో డబ్బు మద్యం తో పాటు గంపగుత్తగా గ్రామాలను కొనుగోలు చేసే సంస్కృతి మొదలైంది. ఇది ప్రజాస్వామ్యానికి అంత శ్రేయస్సు కాదు. ఎన్నికల కమిషన్ ఇలాంటి సంఘటనలపై దృష్టి పెట్టి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే పదేళ్లు వెనక్కి

నవతెలంగాణ-నెక్కొండ/ బొమ్మలరామారం

తెలంగాణలో ఓటర్లు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి ఓటేస్తే.. రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోతుందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు, మోటార్లకు మీటర్లు తప్పవని, గ్యారంటీ లేని స్కీంలతో ప్రజలకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. శనివారం వరంగల్ జిల్లా నెక్కొండ, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు ఎంతకైనా తెగిస్తున్నాయని, గతంలో ఏనాడు ప్రజల బాగోగులు పట్టించుకోని ఈ నేతలు ఎన్నికలవేళ ఎక్కడలేని ప్రేమ ఒలకపోస్తున్నారన్నారు. మార్పు రావాలని కోరుతున్న కాంగ్రెస్ బూటకపు ప్రచారంతో విషవలయంలో పడిపోవద్దని ఓటర్లను అప్రమత్తం చేశారు. ఈ గడ్డమీద పుట్టిన బీఆర్ఎస్ కావాలా? ఢిల్లీలో పుట్టిన జాతీయ పార్టీలు కావాలా? అని ప్రశ్నించారు. కేంద్రం రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలంటే ప్రాణం ఉన్నంతకాలం మీటర్లు పెట్టనివ్వనని కేసీఆర్ తెగేసి చెబితే రాష్ట్రానికి రావాల్సిన రూ.28వేల కోట్లు నిలుపుదల చేసినట్టు ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ క్లారిటీ ఇచ్చినట్టు చెప్పారు. నర్సంపేటలో పెద్దిని గెలిపించిన నెలరోజుల్లోనే నెక్కొండకు సివిల్ ఆస్పత్రి మంజూరుతోపాటు నెక్కొండను మున్సిపాలిటి చేయిస్తామన్నారు.

గ్యారెంటు లేని కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలి

యాదాద్రి భువనగిరి జిల్లా చీకటిమామిడి గ్రామంలో జరిగిన రోడ్ షోలో మంత్రి మాట్లాడుతూ.. రైతుల జోలికొస్తే ఊరుకునే పరిస్థితి లేదని, కేసీఆర్‌కు రైతులంటే ఎంతో ప్రేమని అన్నారు. ఆలేరు నియోజవర్గంలో ఐటీ పరిశ్రమలు తెచ్చే బాధ్యత తనదని తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని కేసీఆర్ అద్భుతంగా కట్టించారన్నారు. ఆలేరు నియోజక వర్గంలో ఎక్కడైనా కరెంటు తీగలు పట్టుకొని 24 గంటల కరెంటు వస్తుందో లేదో తెలుస్తుందని కోమటిరెడ్డి, రేవంత్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చింది ఉచిత కరెంటు కాదని, ఉత్తుత్తి కరెంట్ అని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ గొంగడి మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ సందీప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్యగౌడ్, కల్లూరు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రిమోట్ మోడీ చేతిలో..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/బోధన్/ వేములవాడ

" రాష్ట్రంలో దొరల తెలంగాణ- ప్రజల తెలంగాణ మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి.. సీఎం కేసీఆర్ కుటుంబ పాలన..పేద ప్రజల మధ్య జరుగుతున్న ఎన్నికలు.. ఇక్కడి ప్రజలు ఇలాంటి పాలన కోరుకోలేదు. ఈ దొరల పాలనను అంతమొందించి ప్రజల తెలంగాణను తీసుకురావాలనేదే తమ లక్ష్యం" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తెలంగాణ కోసం అనేక మంది యువకులు బలిదానాలు చేసుకున్నారని, వారు ఇలాంటి తెలంగాణను కోరుకోలేదని తెలిపారు. ఎలాంటి తెలంగాణ కావాలో జనం తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉందని..బీజేపీ, ఎంఐఎం పార్టీలు బీఆర్ఎస్‌కు సహాయకారిగా ఉన్నాయని విమర్శించారు. శనివారం ఆదిలాబాద్, బోధన్. వేములవాడ కాంగ్రెస్ విజయభేరీ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో రాహుల్ మాట్లాడుతూ ప్రజల తెలంగాణ అంటే ప్రభుత్వం ప్రజల చేతిలో ఉండాలని, ఈ ఆకాంక్షను కాంగ్రెస్ నెరవేరుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 8వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో ఎస్టీలవి రూ.5500కోట్లు, ఎస్సీలవి రూ.15,500కోట్ల నిధులను దారి మళ్లించారని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ అవినీతిని ప్రధాని మోదీ ఎందుకు బయటపెట్టడం లేదని, మోడీ రిమోట్ తీయగానే కేసీఆర్ సైలెంట్ అవుతారని రాహుల్‌గాంధీ అన్నారు. మోదీకి కేసీఆర్, ఓవైసీ స్నేహితులని, వారిద్దరిలో ఒకరు పీఎంగా, మరొకరు సీఎంగా ఉండాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. నాపై కేసులు మోపారని, పార్లమెంటు సభ్యత్వం రద్దు చేశారని, బంగ్లాను ఖాళీ చేయించారని, నా ఇంటిని లాక్కొన్నారని అయినా నేను భయపడలేదని, సంతోషంగా తాళాలు ఇచ్చి వచ్చానని అన్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌ను.. అక్కడ బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి రాగానే మంత్రిమండలి సమావేశాన్ని ఏర్పాటుచేసి వాటిని చట్టాలుగా మారుస్తామని రాహుల్‌గాంధీ భరోసా ఇచ్చారు. విద్వేషమనే బజారులో ప్రేమతో కూడిన దుకాణం తెరుస్తున్నామని వ్యాఖ్యానించారు.

ధరణిని రద్దుచేసి భూములు కాపాడతాం

"కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతి చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి కేసులు గానీ, కేసీఆర్ కుటుంబంపై ఎలాంటి దాడులు గాని చేయడం లేదు. వీరిద్దరి స్నేహానికి ఇదే నిదర్శనమని' బోధన్‌లో రాహుల్ గాంధీ అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. 1200మంది విద్యార్థులు బలిదానాలు చేసుకుంటే వచ్చిన తెలంగాణ నేడు కల్వకుంట్ల కుటుంబం కబంధహస్తాల మధ్య బంధీ అయిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. నరేంద్ర మోడీ, కేసీఆర్ ఇద్దరూ ఒకటేనని విమర్శించారు.

స్కామ్‌లుగా ఇరిగేషన్ స్కీమ్‌లు..

(మొదటిపేజీ తరువాయి)

చేశాడని అన్నారు. సామాజిక సమన్వయ సాధికారత కోసమే బీజేపీ పని చేస్తుందని తెలిపారు. బీసీలకు తగిన గౌరవం ఇస్తూ వారికి సీట్లు కేటాయించామన్నారు. తెలంగాణ వికాస యాత్రలో మాదిగ సామాజిక తరగతికి అన్యాయం జరిగిందని, దాన్ని సవరించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు డబ్బులు అవసరం పడితే ఏటీఎం దగ్గరికి వెళ్తారని, బీఆర్ఎస్ నాయకులు మాత్రం.. ప్రాజెక్టులకు కొత్త ప్రాజెక్టులు నమోదు చేసి వారి జేబులు నింపుకుంటారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతుల నుంచి బాయిల్డ్ రైస్ తీసుకుంటామనీ, ఈ ఖరీఫ్‌లో అదనంగా 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. చెరకు రైతులకు లాభం కలిగేలా పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్నట్టు తెలిపారు. ఇథనాల్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని, దాంతో కామారెడ్డి రైతులకు లాభం జరుగుతుందని అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగిన సభలో ఆయన మాట్లా డుతూ.. కాంగ్రెస్ నేతల గర్వాన్ని, అహంకారాన్ని అణచాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ కార్బన్ పేపర్‌గా మారుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్ కు వేసినట్టే.. అని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామన్నారు. సుప్రీంకోర్టులో మాదిగ సామాజిక తరగతి తరపున న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణలో బీజేపీ పాలనపై నమ్మకం పెరుగుతోందన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా బీజేపీకే ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)ది
డబ్బు యాత్ర కాదు, పోరాట యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

కాదు, బ్యాలెట్ పేపర్‌లో కూడా నెంబర్ వన్‌గా ఉన్న భూక్య వీరభద్రం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తిచేశారు. సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గం అభ్యర్థి భూక్యా వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ శనివారం బృందాకరత్ వైరా, కొణిజర్ల మండల కేంద్రాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా రింగ్ రోడ్డు వద్ద జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. సీపీఐ(ఎం)ది డబ్బు యాత్ర కాదని, తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ(ఎం) ప్రతినిధి ఉండాలనే ఒకే ఒక సందేశంతో చేస్తున్న పోరాటాల యాత్రని తెలిపారు. అటవీ హక్కుల చట్టం కోసం పోరాడింది సీపీఐ(ఎం) మాత్రమేనన్నారు. ఆదివాసీల పోడు భూముల కోసం భూక్యా వీరభద్రం అనేక ఉద్యమాలు నిర్వహించి ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఈ పోరాట చరిత్ర లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి పోడుపట్టాలు ఇచ్చే ఉద్దేశం లేదని, అటవీ భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 20వేల మందికి పోడు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా.. 4వేల మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొని నమ్మకద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి రైతులకు సాగునీరు అందించాలని తమ్మినేని వీరభద్రం మహాజన పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. రైతులకు మంచి చేయాలనే ఉద్దేశం బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉంటే ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలను ప్రయివేటు పరం చేస్తోందని తెలిపారు. బీజేపీకి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని, మతాన్ని నమ్ముకుందని, ప్రజలను విభజించడానికి మతాన్ని వాడుతున్నారన్నారు. 6 గ్యారంటీలు మాట్లాడే వారికే గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణకు పోరాటాల చరిత్ర ఉన్నదని, ఎర్రజెండా చేతబట్టుకొని ప్రజలతో మమేకమై తిరుగుతూ ప్రజలతో కలిసి పోయి, ప్రజల మధ్య ఒకడిగా ఉంటూ పోరాటాలు నడుపుతున్న భూక్యా వీరభద్రంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు పారుపల్లి ఝాన్సీ, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, ప్రముఖ విద్యావేత్త ఐవీ రామణారావు, కొణిజర్ల, జూలూరుపాడు మండల కార్యదర్శులు చెరుకుపల్లి కుటుంబరావు, యాసా నరేష్ పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష కమ్యూనిస్టులే...

(మొదటిపేజీ తరువాయి)

ఇదేనా? అని నిలదీశారు. దేశంలో నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే కొత్త భారతాన్ని నిర్మించవచ్చునని చెప్పారు. కుల గణన చేయకుండా మోడీ సర్కారు మొండికేస్తున్నదని విమర్శించారు. బీహార్‌లో గణన చేస్తే 85 శాతం దళితులు, గిరిజనులు, ఓబీసీలున్నారని తేలిందనీ, ఇప్పుడు అక్కడ ఆ ప్రజలకు రిజర్వేషన్లు పెంచే పనిలో ఆ ప్రభుత్వం ఉందని చెప్పారు. దేశ సంపదకు యజమానులు ప్రజలేననీ, మన తెలియకుండానే ఆస్తులను అమ్ముకుంటున్న మేనేజర్(మోడీ)ను మార్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. నేతలపై ఆధారపడి నడిచే పార్టీల కంటే సిద్ధాంతపరంగా ముందుకెళ్లే కమ్యూనిస్టులనే ప్రజలు ఆదరించాలని కోరారు. ఎన్నికల్లో సీట్లు రాకపోయినా తమ ప్రభుత్వమే ఏర్పాటు అవుతుందంటూ బీజేపీ చెప్పడం వెనుక కొనుగోళ్లపర్వం దాగుందని చెప్పారు. మోడీ తన మిత్రులకు లబ్ధి చేకూరుస్తూ వారి దగ్గర నుంచి ధనశక్తిని తీసుకుని ఎమ్మెల్యేలను కొంటూ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. గోవా, మహారాష్ట్రలో గతంలో జరిగిన ఘటనలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. పాలేరు గడ్డమీద సీపీఐ(ఎం) జెండా ఎగురబోతున్నదని నొక్కిచెప్పారు. దళితులు, రైతులు, ఆశాలు, అంగన్‌వాడీల కోసం తమ్మినేని నికరంగా నిలబడ్డారని అన్నారు. ఖమ్మంలో 2004లో వచ్చిన ఫలితమే ఇప్పుడు పాలేరులో పునరావృతం కాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు ఆకలితో చనిపోతే ఎన్నడైనా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారి ముఖం చూశారా? అని ప్రశ్నించారు. అలాంటప్పుడు ఆయనకు ఎందుకు ఓటేయాలి..? అని అడిగారు. వ్యక్తి చనిపోతే రూ.5వేలు, రూ.10 వేలు ఇవ్వడం కాదు కుటుంబాలు గౌరవంగా బతికేలా చూడాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో బతకాలని కోరుకునే వ్యక్తి తమ్మినేని, ఆయన కూలీరేట్లు పెంచడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. కేరళలో ప్రతిపేదకూ 7,40,000 ఇచ్చి ఇల్లు కటిస్తున్న ఘనత కమ్యూనిస్టు ప్రభుత్వానిదేనని అన్నారు. క్వింటా ధాన్యానికి కేంద్రం ఇచ్చే రూ.2,000కు మరో 700 కలిపి రూ.2,700 చేసి రైతుల నుంచి ధాన్యం కొంటున్న ఘనత వామపక్ష ప్రభుత్వానిదేనన్నారు. కేరళలో రోజు కూలి రూ.850 ఇస్తున్నారని చెప్పారు. ఆ రాష్ట్రంలో ఆరేండ్లలో 2,70,000 ఉద్యోగాలిచ్చామని చెప్పారు. అక్కడ నూటికి 96 శాతం మంది ప్రజలకు భూమి ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ భూమి ఇవ్వాలి లేకుంటే అరకలు కడుతామంటూ తమ్మినేని అసెంబ్లీలో తన వాణిని వినిపిస్తారని తెలిపారు. పినపాకలో ఎమ్ఎల్ పార్టీకి, కొత్తగూడంలో సీపీఐకి మద్దతునివ్వాలని తీర్మానించినట్టు ఆయన చెప్పారు.

పాలేరు అభ్యర్థి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... తమ నియోజకవర్గంలో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటుకు రూ.3 వేల చొప్పున పంచుతున్నాయనీ, ఎన్నిక రోజు మరో రూ.2వేలు పంచేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన తనను గెలిపించాలని ప్రజల్ని కోరారు. సీపీఐ (ఎం) ఒత్తిడి వల్లనే రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చారని తెలిపారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేశాననీ, తన పోరాటానికి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి దిగివచ్చి రూ.600 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావడానికి చేపట్టిన సైకిల్ యాత్రను ప్రస్తావించారు. ఆ పోరాట ఫలితంగానే నేడు దళిత కాలనీలకు రోడ్లు, అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి వెనుక కమ్యూనిస్టులు ఉన్నారని గుర్తు చేశారు. డబ్బులు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఖమ్మం జిల్లా సాగునీటి జలాల కోసం నికరంగా కొట్లాడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్నభోజన కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు పర్మినెంట్ కావడంలో తమ పోరాటాలు కీలకమన్నారు.

అందువల్ల ఆయా తరగతుల ప్రజానీకమంతా ఎర్రజెండాకు ఓటేసి గెలిపించాలని కోరారు. తద్వారా పోరాడేవారికి ఆయుధమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల తరపున పోరాడేందుకోసం తనకు ఎమ్మెల్యే పదవి అనే పదునైన కత్తినివ్వాలని కోరారు. అధ్యక్షా... పాలేరు గోస ఇది అని ఉపేందర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారా? లోక్‌సభలో ఖమ్మం ఎంపీగా పొంగులేటి జిల్లా సమస్యల్ని ఏనాడైనా ప్రస్తావించారా..? అని నిలదీశారు. వారికి ఎమ్మెల్యే పదవి అవసరం లేదన్నారు. అందువల్ల వారు వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ప్రజల పక్షాన పోరాడుతున్న తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నుంచి ఏడో గ్యారంటీ కావాలి..'అదే పార్టీ మారననే హామీ...' అని తమ్మినేని ఈ సందర్భంగా చురకలంటించారు. బహిరంగ సభలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కూడా ప్రసంగించారు. సభకు నంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు.



భద్రాచలంలో ఎర్రజెండా ఎగరాలి

బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్టే • కాంగ్రెస్ అవినీతి సొమ్ముతో గెలవాలని చూస్తోంది : త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్/ వెంకటాపురం

ప్రజా సమస్యలపై పోరాడే వారికే పట్టం కట్టి, భద్రాచలం గొంతుక కారం పుల్లయ్యను అసెంబ్లీకి పంపించాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రజల్ని విభజించి పాలించాలని చూస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బీజేపీకి బీఆర్ఎస్ సర్కార్ బీ టీంగా వ్యవహరిస్తోందని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై అనేక రకాల దాడులను ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య విజయాన్ని కాంక్షిస్తూ శనివారం భద్రాచలం పట్టణంలో మాణిక్ సర్కార్ రోడ్ షో నిర్వహించారు. బ్రిడ్జి సెంటర్ చెక్‌పోస్టు పాయింట్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా అక్రమంగా సంపాదించిన సంపాదనతో ఎన్నికల్లో గెలవాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతో చైతన్యవంతులు కాబట్టే 30 ఏండ్లపాటు భద్రాచలంలో ఎర్రజెండా రెపరెపలాడిందని గుర్తు చేశారు. మరోసారి ప్రజల చైతన్యాన్ని చూపించే సమయం వచ్చిందని, ఆదివాసీ, ఏజెన్సీ గడ్డపై మతోన్మాద విషం జిమ్మకుండా ఉండాలంటే ఎర్రజెండా పార్టీలను ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ ప్రాంత సమస్యలపై మిడియం బాబురావు ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంటులో చర్చించి ఆదివాసీలకి అటవీ హక్కుల చట్టాన్ని సాధించారని గుర్తు చేశారు. సున్నం రాజయ్య కొంజా బొజ్జి తమ పదవీకాలం మొత్తం ఈ ప్రాంత అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో సీపీఐ(ఎం) కార్యకర్తలు తమ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించారని, అటువంటి పార్టీకి ఓటు వేసి అసెంబ్లీకి పంపిస్తే భద్రాచలం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. భద్రాచలం అభ్యర్థి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. ఐదేండ్లుగా నిలిచిపోయిన అభివృద్ధిని పునః ప్రారంభించాలంటే ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) గెలిచి తీరాలన్నారు. కాగా, రోడ్ షోకి పట్టణం నుంచి ప్రజలు తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ డోలు, కోయలు, తీన్మార్ డాన్స్‌లతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్ షోలో మాజీ ఎంపీ మీడియం బాబురావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, సీనియర్ నాయకులు ఎల్లమంచిలి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పండి

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లనుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఎర్రజెండా పట్టుకుని పోరాడాలని త్రిపుర మాజీ సీఎం, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి కారంపుల్లయ్య గెలుపును కాంక్షిస్తూ ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురంలో శనివారం కొప్పుల రఘుపతి అధ్యక్షతన సభ, ర్యాలీ జరిగింది. మాణిక్ సర్కార్ మాట్లాడుతూ.. దేశాన్ని విభజించి పాలించే రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. దానికి తగ్గట్టుగానే కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి అటవీ హక్కుల చట్టం సాధించుకున్నామని గుర్తు చేశారు. ఆ చట్టం అమలులో కాంగ్రెస్, తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. ఆ దారిలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ విధానం ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతమంది గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం పెరిగిందన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. కారం పుల్లయ్యను గెలిపించాలని పిలునిచ్చారు. ఎర్రజెండా వ్యక్తులను అసెంబ్లీకి పంపితే ప్రజాస్వామ్య హక్కులకై నిలబడుతారన్నారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, అభ్యర్థి కారం పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సూడి కృష్ణా రెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదు.. ఉద్యోగాలు ఇవ్వలేదు..

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. మోడీ తమ్ముడే కేసీఆర్

- ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర రోడ్‌షోల్లో ప్రియాంకగాంధీ
- జనాన్ని చూసి వ్యాన్‌పైనే స్టెప్పులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

"ఈ రాష్ట్రం మీ శ్రమతో ఏర్పడింది. తెలంగాణ ఆడబిడ్డలు రాష్ట్రాన్ని నిర్మించారు. యువత పోరాడి తెచ్చుకుంది.. అటువంటి రాష్ట్రంలో ఉద్యోగాలు రాలేదు.. రైతులకు రుణమాఫీ కాలేదు.. ఇండ్లూ ఇవ్వలేదు.. ఇవన్నీ కావాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే పరిష్కారం" అని కాంగ్రెస్ జాతీయ నాయకులు ప్రియాంకగాంధీ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గంలోని జలగంనగర్, నాయుడుపేట, పెద్దతండా, సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరులో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం మధిర నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలోనూ మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ప్రియాంక మండిపడ్డారు. ఎక్కడైతే వ్యవసాయం, శ్రమ మీద ఆదాయం సరిగ్గా రాదో అక్కడ సమస్యలు వెంటాడుతాయన్నారు. ఈ పదేండ్లలో ధరలు పెరిగాయి, పెట్టుబడి పెరిగింది, దానికి తగ్గ ఆదాయం మాత్రం రావట్లేదని తెలిపారు. మోడీ, కేసీఆర్ అన్నదమ్ముల్లాంటి వారేనని, కేంద్రంలో అవసరమైతే తమ్ముడు కేసీఆర్ అన్న మోడీకి సపోర్టు చేస్తాడని అన్నారు. సింగరేణిని బీజేపీ ప్రయివేటీకరించేందుకు పూనుకుంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణిని ప్రభుత్వరంగంలోనే ఉంచుతామని హామీ ఇచ్చారు. ఇన్నేండ్లయినా ఇందిరమ్మ గుర్తుండటానికి కారణం భూమి, నీళ్లు, నిధుల కోసం ఆమె చేసిన పోరాటమేనని తెలిపారు. నాయకులు తప్పు చేసినప్పుడు ప్రశ్నించాలి, ప్రజాస్వామ్యంలో ప్రజలే ముఖ్యమైన శక్తులు, మీ ఓటే మీ శక్తి.. కాబట్టి డబ్బులు, స్కీమ్‌ల ఆశచూపే వారితో జాగ్రత్తని హెచ్చరించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని, సంతు సేవాలాల్ సమితి ద్వారా లంబాడ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విదేశీ చదువులకు సహాయమందిస్తామని తెలిపారు. కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ ప్రజలను మోసం చేసి, వారి నిధులను వేరేవైపు మళ్లించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొదలు గ్రామాల అభివృద్ధి వరకు ప్రతిదానిలోనూ అవినీతి జరిగిందన్నారు. ఏ పని కావాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనన్నారు.

పెద్దతండాలో ప్రియాంక స్టెప్పులు..

పోటెత్తిన జన సంద్రాన్ని చూసి ప్రియాంక ఉప్పొంగిపోయారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలో భారీగా జనం తరలివచ్చారు. పెద్దతండాలో జనాన్ని చూసి ప్రియాంక అభివాదానికి బదులు స్టెప్పులు వేసి అలరించారు. వ్యాన్‌పైన ఆమెకు అటుఇటు బంజార మహిళలు ఉండగా వారితో కలిసి ఆమె స్టెప్పులు వేశారు. 'మార్పు కావాలి...కాంగ్రెస్ రావాలి' అని తెలుగులో ఆమె అనడంతో జనం ఆమెను అనుసరించారు. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మట్టా రాగమయి, మల్లు భట్టివిక్రమార్క పేర్లు ఉచ్చరిస్తూ జనంతో జేజేలు పలికించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ నాయకులు మట్టా దయానంద్, రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, మువ్వా విజయ్‌బాబు, జావీద్, దయాకర్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి, రమేష్ చింతల పాల్గొన్నారు.



బీజేపీ ప్రమాదాన్ని అడ్డుకోవాలి

- ఇండియా కూటమిలోని పార్టీలపై కాంగ్రెస్ వైఖరి ఆందోళనకరం
- కేంద్రంలో ఎవరికి మద్దతు ఇస్తారో చెప్పాలని కేసీఆర్‌కు ప్రశ్న : బీవీ రాఘవులు

ఈ ఎన్నికల్లో దేశానికి ప్రమాదకరంగా ఉన్న మతోన్మాద బీజేపీని అడ్డుకుని, సీపీఐ(ఎం) అభ్యర్థులకే తమ ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలన్నారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. బీజేపీని అడ్డుకోవాలంటే కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సీపీఐ(ఎం) అభ్యర్థి యాదయ్యని గెలిపించాలని కోరుతూ చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ వేసి.. వారిని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీజేపీ వ్యవహరిస్తున్న తీరు దేశానికి చాలా ప్రమాదకరమన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టే ప్రభుత్వంలో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత ఉంటుందని, అందులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని కేసీఆర్ ప్రకటిస్తున్నారని అన్నారు. కానీ దేశంలో ఎవరికి మద్దతు ఇస్తారనే విషయంలోనే ఆయనకే స్పష్టత లేదని, ఇప్పటికైనా వారి నిర్ణయాన్ని ప్రకటించాలని తెలిపారు. అంతేకాకుండా, బీజేపీ పట్ల కాంగ్రెస్ కఠినమైన వైఖరిని తీసుకోవాలన్నారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురి చేస్తోందన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణలో సీట్ల సర్దుబాటులో మోసం చేసిందని, ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించుకున్నదని చెప్పారు. ఇదే విషయంపై అఖిలేష్ యాదవ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా వామపక్షాలను మోసం చేసిందని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ అడ్డు పుల్లలు పెడుతున్నట్టు అర్థమవుతుందన్నారు. కీలకమైన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వైఖరి సరైనది కాదన్నారు. అసెంబ్లీలో వామపక్షాల ప్రాతినిధ్యం అవసరమని, రాష్ట్రవ్యాప్తంగా పోటీచేస్తున్న 19 స్థానాల్లో సీపీఐ(ఎం)కు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, జగదీష్, మండల కార్యదర్శి సిహెచ్ జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు రామకృష్ణారెడ్డి, ఆనంద్, పురుషోత్తం తదితరులున్నారు.

చిన్నతుండ్ల, లోయపల్లి సభల్లో పాల్గొన్న రాఘవులు

కమ్యూనిస్టులు చేసిన పోరాటాలతోనే బడుగు, బలహీన వర్గాలకు భూములు దక్కాయని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చిన్నతుండ్ల, మంచాల మండలం లోయపల్లి గ్రామాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య ప్రచార సభల్లో రాఘవులు పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కృష్ణమూర్తి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది పేదలకు భూమిని పంచిపెట్టారని గుర్తుచేశారు. వెట్టిచాకిరీ నశించాలని, దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో కమ్యూనిస్టు పార్టీ పనిచేసిందన్నారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భూ బకాసురుల్లా వాటిని లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఓడించేందుకు.. కమ్యూనిస్టు అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని కోరారు.

మిగులు రాష్ట్రాన్ని.. అప్పుల రాష్ట్రంగా మార్చారు

• ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం • బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే.. : మల్లికార్జున ఖర్గే

నవతెలంగాణ-ఆమనగల్/బిచ్కుంద

సీఎం కేసీఆర్ అవినీతి, అక్రమాలతో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో కల్వకుర్తి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రాజెక్టుల ముసుగులో రూ.5.70 వేల కోట్ల అప్పులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, దాంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి నెత్తిపై రూ.1.50 లక్షల అప్పు ఉందని తెలిపారు. నిరుపేద కుటుంబాల రైతులకు 70 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత పాలనతో నిత్యావసర



వస్తువుల ధరలు పెరిగిపోయి పేద, మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు ఒక్కటేనన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. భూ, ఇసుక, మైనింగ్ మాఫియాలతో చేతులు కలిపి అక్రమంగా లక్షల కోట్లు సంపాదిస్తూ అప్పుడప్పుడు ఒక కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను మభ్య పెడ్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నాయకులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండే కల్వకుర్తి శాసన సభ్యునిగా కసిరెడ్డి నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

దళితబంధుకు ఎందుకు అనుమతి తీసుకోరు..? :రేవంత్ రెడ్డి

రైతుబంధుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్న కేసీఆర్ దళిత బంధు పథకం కొనసాగింపునకు ఎందుకు అనుమతి తీసుకోలేదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దళితున్ని సీఎం చేస్తామని చెప్పిన కేసీఆర్.. పదేండ్లుగా వారిని మోసం చేస్తూనే ఉన్నారన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన కుటుంబ పాలనను అంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.



కమ్యూనిస్టులను ఆదరించేది ఆదివాసీలే...

అశ్వారావుపేటలో సీపీఐ(ఎం) జాతీయ నాయకులు వెంకట్

నవతెలంగాణ - అశ్వారావుపేట

కమ్యూనిస్టులను అత్యధికంగా ఆదరించేది ఆదివాసీలేనని, వీరి కోసం పనిచేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు వెంకట్ అన్నారు. గిరిజనుల, సంఘటిత, అసంఘటిత కార్మికులు, కర్షకుల, శ్రామికుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే సీపీఐ(ఎం) అభ్యర్థి అర్జున్‌రావు పిట్టలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేట మండలం దబ్బతోగులో పార్టీ మండల కమిటీ సభ్యులు సోడెం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) అభ్యర్థులు గెలిస్తే కేరళ మోడల్‌లో పరిపాలన చేసే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ధన అహంకారం ప్రదర్శిస్తూ ఓటుకు నోటు బేరం చేస్తున్నాయని, ఇలాంటి పార్టీలను ఓడించాలని తెలిపారు. గ్రామానికి చేరిన బి.వెంకట్‌కు ముందుగా పూలు జల్లుతూ ఘనస్వాగతం పలికారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.